
మీ ఆర్థిక అవసరాల ఆశయసాధన
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

ESTD: 1999
www.voodayam.com

# వుదయం

మీ ఆర్థిక అవసరాల ఆశయసాధన
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

హైదరాబాద్ | 05-05-2026 మంగళవారం | సంపుటి : 27 | సంచిక : 63 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously Published from Hyderabad, Adilabad, Karimnagar, Khammam, Guntur & Warangal | Follow us on



### పశ్చిమ బెంగాల్‌లో కమలం వికసించింది!

2026 పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికలు చిరకాలం గుర్తుండిపోతాయి. ప్రజాశక్తి గెలిచింది, బీజేపీ సుపరిపాలన రాజకీయాలు విజయం సాధించాయి. పశ్చిమ బెంగాల్‌లోని ప్రతి ఒక్కరికీ నేను నమస్కరిస్తున్నాను. ప్రజలు బీజేపీకి అద్భుతమైన తీర్పు ఇచ్చారు. పశ్చిమ బెంగాల్ ప్రజల కలలు, ఆకాంక్షలను నెరవేర్చడానికి మా పార్టీ శాయశక్తులా కృషి చేస్తుందని నేను వారికి హామీ ఇస్తున్నాను. సమాజంలోని అన్ని వర్గాలకు అవకాశం, గౌరవాన్ని అందించే ప్రభుత్వాన్ని మేం అందిస్తాం.


– ప్రధాని

# ఊహించీ ఊహించని విజయాలు

## మే 4 సరికొత్త రికార్డు


## పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరిలలో కాషాయం రెపరెపలు

## కేరళలో యూడిఎఫ్




## తమిళనాట విజయ్ బావుటా






ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మూడు రాష్ట్రాల్లో సిట్టింగ్ సీఎంలకు చెక్ పడింది. తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళంలో అధికార పార్టీలు ఈ ఎన్నికల్లో ఘోర పరాభవానికి గురయ్యాయి. దీంతో ఇప్పటివరకు ముఖ్యమంత్రులుగా ఉన్న ఎంకే స్టాలిన్, మమతా బెనర్జీ, పినరయి విజయన్.. తమ సీఎం సీటులను ఖాళీ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఆయా రాష్ట్రాల్లో ప్రస్తుత ప్రభుత్వాలు మారి.. కొత్త పార్టీలు కొలువుదీరనున్నాయి. వీరిలో స్టాలిన్.. కనీసం తన సీటులో కూడా విజయం సాధించకపోవడం గమనార్హం. ఈ ఎన్నికల ఫలితాల్లో మూడు రాష్ట్రాల్లో అధికార పార్టీలకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. దీంతో ముఖ్యమంత్రులు తమ కుర్చీలను వదులుకోవాల్సి వచ్చింది. పశ్చిమ బెంగాల్‌లో ఇప్పటికే హ్యాట్రిక్ విజయాలు సాధించి నాలుగోసారి సత్తా చాటాలని ఎదురుచూసిన మమతా బెనర్జీకి ఎదురుదెబ్బ తగిలింది. ఇక కేరళంలోనూ రెండు సార్లు వరుసగా విజయం సాధించిన పినరయి విజయన్.. ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రి కావాలన్న ఆశలు అడియాసలు అయ్యాయి. మరోవైపు.. తమిళనాడులో వరుసగా రెండోసారి గెలుస్తామని ధీమాగా ఉన్న ఎంకే స్టాలిన్‌కు షాకిస్తూ.. తమిళ ఓటర్లు.. కొత్తగా పార్టీ పెట్టిన విజయ్‌కి పట్టం కట్టారు. దీంతో ఏళ్ల తరబడి ఆయా పార్టీలు, నేతలకు కంచుకోటలుగా ఉన్న రాష్ట్రాలు ఇప్పుడు వారి చేతులు జారాయి.

మిగతా 2లో

### తమిళనాట కొత్త శకం

తమిళనాడు రాజకీయ చరిత్రలో ఒక కొత్త శకం మొదలైంది. వెండితెరపై దళపతిగా ముద్ర వేసుకున్న జోసెఫ్ విజయ్, ఇప్పుడు రాజకీయ రంగంలోనూ తన సత్తా చాటారు. తన సొంత పార్టీ తమిళగ వెట్రి కళగం (టీవీకే) తరఫున తొలిసారి బరిలోకి దిగిన విజయ్, పోటీ చేసిన రెండు స్థానాల్లోనూ ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించారు. హోరాహోరీగా సాగిన ఈ పోరులో విజయ్ తన సమీప ప్రత్యర్థి, డీఎంకే అభ్యర్థులను మట్టికరిపించారు. కౌంటింగ్ ప్రారంభమైనప్పటి నుండి ఆధిక్యంలో కొనసాగిన విజయ్, చివరికి 20 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

### రాజకీయ యవనికపై నుంచి అదృశ్యమవుతున్న ఎర్ర పార్టీలు?



- వామపక్ష పార్టీల అస్తిత్వం, ఉనికి కనుమరుగైపోనుందా..?
- ఐదు దశాబ్దాల్లో ఇటువంటి రాజకీయ శూన్యం ఏర్పడటం ఇదే తొలిసారి

5

### మోడీమయమైన భారత్
## ఎక్స్‌పై బిజెపి మాప్





పశ్చిమ బెంగాల్ లో బిజెపి గెలుపు భారతీయ జనతా పార్టీకి కొత్త ఉత్సాహాన్ని, ఊపునీ ఇచ్చింది. కమ్యూనిస్టు, తృణమూల్ పార్టీల ప్రభావం గల రాష్ట్రంలో బిజెపి గత ఎన్నికల్లోనే తన ఉనికిని చాటినప్పటికీ, ఆ ఎన్నికల తర్వాత జరిగిన హింసను గమనించిన వారికి, మళ్లీ ప్రజలు దానికి ఓటు వేస్తారనే భావన కలుగలేదు. కానీ ఐదేళ్లలోనే ప్రజలు తిరిగి బీజేపీని ఎంచుకోవడంతో ఆ పార్టీ ఉత్సాహంతో పరవళ్లు తొక్కుతోంది. అందుకే, మోదీమయమైన భారత్ అంటూ ఎక్స్ వేదికగా పార్టీ ట్వీట్ చేసింది. కమలం బెంగాల్‌ను కూడా చేరుకుందని పేర్కొంది. ఢిల్లీ నుంచి బెంగాల్ వరకు గెలుపు కేవలం విస్తరణ కాదని, ప్రగతిపథంలో సాగేందుకు దేశ ప్రజలు తమపై చూపించిన విశ్వాసానికి ప్రతీక అని రాసుకొచ్చింది. ఉత్తరాది నుంచి ఈశాన్యం వరకు

మిగతా 2లో

### ముగింపునకు దగ్గర్లో
## కాంగ్రెస్ శకం

- ప్రజలు హస్తం పార్టీని తిరస్కరించారు
- ఆ పార్టీ ఎప్పటికీ అధికారంలో రాదు
- దేశానికి రాహుల్ ప్రధాని కావడం కలే
- మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజన బిల్లు వ్యతిరేక పార్టీలకు ఓటర్లు బుద్ధి చెప్పారు : కేంద్రమంత్రి బండి సంజయ్

**కరీంనగర్, మే 04 (వుదయం ప్రతినిధి)** : త్వరలోనే దేశంలో కాంగ్రెస్ శకం ముగుస్తుందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ ప్రజలు కాంగ్రెస్‌ను



పూర్తిగా తిరస్కరించారన్న ఆయన కాంగ్రెస్ పార్టీ ఇక ఎప్పటికీ అధికారంలోకి రాదని జోస్యం చెప్పారు. హస్తం పార్టీ త్వరలోనే దేశ రాజకీయ ముఖచిత్రం నుంచి కనుమరుగవుతోందని వెల్లడించారు. ఆ పార్టీ మళ్లీ అధికార పీఠం ఎక్కడం అసాధ్యమన్నారు. ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల విశ్లేషించుకున్న ఆయన సోమవారం కరీంనగర్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజన బిల్లు వంటి చారిత్రాత్మక నిర్ణయాలను వ్యతిరేకించిన పార్టీలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని సెటైర్లు వేశారు. అభివృద్ధికి అడ్డుపడుతున్న పార్టీలను ఎట్టి పరిస్థితుల్లో ఓటర్లు క్షమించరని ఆయన వ్యాఖ్యానించారు. పశ్చిమబెంగాల్‌లో ఎన్నో అరాచకాలు జరిగాయని.. బంగ్లా చొరబాటు దారులకు దారులు మూసుకుపోయాయని కేంద్రమంత్రి పేర్కొన్నారు. దేశం అంతా బీజేపీని కోరుకుంటోందని ఉద్ఘాటించారు. మిగతా 2లో

### మొక్కజొన్న రైతులను
## ఆదుకోవాలి

- తక్షణ నష్టపరిహారం ఇవ్వాలి
- ప్రభుత్వానికి టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్



**హైదరాబాద్, మే 4 (ఎఎంఎస్)** : ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని కనుగుట్టలో ప్రమాదవశాత్తు వంద ఎకరాలకు పైగా మొక్కజొన్న పంట దహనం అవడంపై తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత ఆందోళన వ్యక్తం చేశారు. పంట దహనమై నష్టపోయిన రైతులతో ఆమె సోమవారం హైదరాబాద్ నుంచి ఫోన్ లో మాట్లాడి ఓదార్చారు. పంట నష్టపోయిన రైతులు ధైర్యంగా ఉండాలని చెప్పారు. పంట నష్టం గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేలా ఒత్తిడి చేస్తామని ధైర్యం చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మొక్కజొన్న పంట దహనమై నష్టపోయిన రైతులకు తక్షణ సాయం అందించాలని ఈ సందర్భంగా కవిత కోరారు. పంటనష్టం అంచనా వేసి నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, టీఆర్ఎస్ నాయకులు బానోత్ మౌనికతో కలిసి ఆమె బాధిత రైతులతో మాట్లాడారు.

## యూడీఎఫ్ కూటమి విజయం అసాధారణం

### కేరళం ఫలితాలపై సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మే 04 (వుదయం ప్రతినిధి) :** కేరళం అసెంబ్లీ ఎన్నికల్లో అసాధారణమైన, కఠోరమైన స్ఫూర్తిదాయకరమైన విజయం సాధించిన యూడీఎఫ్ కూటమి నాయకులు, కార్యకర్తలను సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. ఈ చారిత్రాత్మక విజయానికి నాయకత్వం వహించిన రాహుల్ గాంధీ, ఖర్గే, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, దీపాదాస్ మున్షిలకు పార్టీ, కేడర్ తో కలిసి అభినందనలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. కేరళ ప్రచారం సందర్భంగా తనపై ప్రేమ కురిపించినందుకు యూడీఎఫ్ మద్దతుదారులకు, ప్రజలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

## తెలంగాణలోనూ ఎస్ఐఆర్ అమలు

- బెంగాల్ లో మాదిరిగానే అమలుకు కేంద్రం సన్నద్ధం
- వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు పునాది వేసేందుకే మోడీ తెలంగాణ టూర్
- పశ్చిమ బెంగాల్‌లో విజయం తర్వాత విపక్షాల్లో వణుకు
- నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్

2



### గత ప్రభుత్వ విద్యుత్ అక్రమాల
## విచారణ సీబీఐకి అప్పగింత

- భద్రాద్రి, యాదాద్రి విద్యుత్తు ప్లాంట్లలో జరిగిన అవకతవకలు, అక్రమాలపై విచారణ కమిషన్
- రాష్ట్రంలో భూముల ధరల సవరణ, క్రమబద్ధీకరణ, హిల్ట్ పాలసీలో దరఖాస్తు చేసుకునే వారికి అవకాశం
- నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డుకు నల్గొండ-రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సంఘం
- బుగ్గవాగు నుంచి లెఫ్ట్ ఫ్లడ్ ఫ్లో కాలువ నిర్మాణానికి ఆమోదం : కేబినెట్ భేటీలో ప్రభుత్వం కీలక నిర్ణయాలు

2

### వేగవంతంగా ధాన్యం
## కొనుగోళ్లు

- ఇప్పటివరకు 14.80 లక్షల మెట్రిక్ టన్నుల పై చిలుకు కొనుగోళ్లు
- 8,575 కేంద్రాలలో ధాన్యం కొనుగోళ్లు
- రైతుల ఖాతాలో 2001.96 కోట్లు జమ
- కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలి
- అకాల వర్షాలతో రైతాంగం ఇబ్బందులు పడొద్దు
- తడిసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలింపు
- పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్, మే 04 (వుదయం ప్రతినిధి) :** అకాల వర్షాలు కురుస్తోన్న నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వర్షాలతో రైతులు ఇబ్బందులు పడకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సోమవారం రాష్ట్ర సచివాలయం నుండి ఆయన జిల్లాల ఇంచార్జ్ మంత్రులు ,కలెక్టర్లు ఇతర ఉన్నతాధికారులతో

మిగతా 2లో

## రైతుల మరణాలు ప్రభుత్వ హత్యలే




- ధాన్యం దళారుల పాలు చేయాలని చూస్తున్నారు
- కొనుగోలు చేసే వరకు ప్రభుత్వాన్ని నిలదీస్తాం
- మోసపూరిత ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తాం
- నెల రోజులైనా పంటను ఇప్పటి వరకు కొనుగోలు చేయలేదు : ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

2

### అట్లాంటిక్ క్రూయిజ్ నౌకలో
## హంటా వైరస్

- ముగ్గురు మృతి
- ఒకరి పరిస్థితి విషమం
- డబ్ల్యుహెచ్ఒ ఆందోళన



2

## వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు

- 'టీజీ ఆర్గానిక్స్' మొబైల్ యాప్ ఆవిష్కరణలో మంత్రి తుమ్మల
- కాంగ్రెస్ పాలనలో మరిన్ని రైతు సంక్షేమ కార్యక్రమాలు
- ఆధునిక విప్లవాత్మక విధానాలు అమలు చేస్తున్నాం
- రైతులు-వినియోగదారుల మధ్య ప్రత్యక్ష సంబంధంపై ఫోకస్



### మోడీమయమైన భారత్

## ఎక్స్‌పై బిజెపి మాప్

మొదటి పేజీ తరువాయి

మార్పు కొనసాగుతోందని, ఇప్పుడీ ప్రయాణంలో పశ్చిమ బెంగాల్ అనే అతిపెద్ద అధ్యాయం చేరిందని పేర్కొంది. మనందరం కలిసి 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మిద్దామని 'ఎక్స్' వేదికగా పిలుపునిచ్చింది. ఈ మేరకు బీజేపీ ఒంటరిగా, మిత్రపక్షాలతో కలిసి అధికారంలో ఉన్న రాష్ట్రాలతో మ్యాప్‌ను పంచుకుంది. హర్యానా, ఢిల్లీ, రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గోవా, పుదుచ్చేరి, ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గఢ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, త్రిపుర, అసోం, మణిపూర్, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయ, సిక్కిం, బీహార్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో బీజేపీ, మిత్రపక్షాలు అధికారంలో ఉన్నాయంటూ కాషాయం రంగుతో మ్యాప్‌ను ట్వీట్ చేసింది. దీని ప్రకారం, తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఝూర్ఖండ్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, జమ్ము కశ్మీర్, మిజోరాంలలో బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్నాయి.

### ఊహించీ ఊహించని

# విజయాలు

**వుదయం డెస్క్, మే 4 :** పశ్చిమ బెంగాల్, అస్సాం, తమిళనాడు, కేరళ అనే నాలుగు రాష్ట్రాలతో పాటు పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో, వెలువడుతున్న సరళులు దిగ్భ్రాంతికరమైన ఫలితాలను వెల్లడించాయి. ఎన్నికల సంఘం చేపట్టిన, వివాదాస్పదమైన 'ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణ (సర్) నీడలో అసెంబ్లీ ఎన్నికలు జరిగిన పశ్చిమ బెంగాల్‌లో, బీజేపీ దాదాపు 200 స్థానాలను గెలుచుకుని చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. 2021లో మొత్తం 294 స్థానాలకు గాను 215 స్థానాలను గెలుచుకున్న అధికార తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి), ఇప్పుడు కేవలం 88 స్థానాలకు పరిమితమైంది. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ సాధించిన అఖండ విజయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హర్షం వ్యక్తం చేశారు. కౌంటింగ్ ట్రెండ్స్‌లో బీజేపీ మ్యాజిక్ ఫిగర్ దాటి 200 స్థానాల దిశగా దూసుకుపోతుండటంతో, బెంగాల్ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. బెంగాల్ గడ్డపై "కమలం వికసించింది" అంటూ ఆనందం వ్యక్తం చేశారు. దశాబ్దాల తరబడి బెంగాల్‌ను పాలించిన శక్తులకు స్వస్తి పలికి, ప్రజలు అభివృద్ధికి (సోనార్ బంగ్లా) పట్టం కట్టారని ప్రధాని పేర్కొన్నారు. ప్రాణాలకు తెగించి బెంగాల్‌లో పార్టీ కోసం పోరాడిన ప్రతి బీజేపీ కార్యకర్తకు ఈ విజయం అంకితమని ఆయన కొనియాడారు. "మా మాతీ మానుష్" పేరుతో జరిగిన అన్యాయాలకు అంతం పలికి, బెంగాల్‌ను మళ్లీ దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ప్రధాని హామీ ఇచ్చారు.

**మే 4వ తేదీ - సరికొత్త రికార్డు..**

బెంగాల్ చరిత్రలో బీజేపీ సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి. తృణమూల్ కాంగ్రెస్ 15 ఏళ్ల సుదీర్ఘ పాలనకు ఈ ఫలితాలతో తెరపడింది. ప్రధాని మోడీ తన ప్రసంగాల్లో తరచుగా చెప్పే "ఆశల్ పరిబోర్తన్" (నిజమైన మార్పు) బెంగాల్ ప్రజలు నెరవేర్చారని జాతీయ నాయకత్వం సంబరాలు జరుపుకుంటోంది. త్వరలోనే ప్రధాని మోడీ బెంగాల్‌లో పర్యటించి, కొత్త ప్రభుత్వం ఏర్పాటు, ప్రమాణ స్వీకార కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉంది.

**తమిళనాడు**.. తమిళనాడు రాజకీయ చరిత్రలో ఒక కొత్త శకం మొదలైంది. వెండితెరపై దళపతిగా ముద్ర వేసుకున్న జోసెఫ్ విజయ్, ఇప్పుడు రాజకీయ రంగంలోనూ తన సత్తా చాటారు. తన సొంత పార్టీ తమిళగ వెట్రి కళగం (టీవీకే) తరపున తొలిసారి బరిలోకి దిగిన విజయ్, పోటీ చేసిన రెండు స్థానాల్లోనూ ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించారు. హోరాహోరీగా సాగిన ఈ పోరులో విజయ్ తన సమీప ప్రత్యర్థి, డీఎంకే అభ్యర్థులను మట్టికరిపించారు. కౌంటింగ్ ప్రారంభమైనప్పటి నుండి ఆధిక్యంలో కొనసాగిన విజయ్, చివరికి 20 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. 100కి పైగా స్థానాలను కైవసం చేసుకున్న ఈ పార్టీ, ఎప్పుడూ ద్రవిడ రాజకీయాలతోనే మమేకమై ఉన్న ఆ రాష్ట్ర చారిత్రక రాజకీయ ధోరణులనే తిరగరాసింది. డిఎంకె కూటమికి నాయకత్వం వహించిన ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ తన కంచుకోట అయిన కొలత్తూరులో ఓటమి పాలయ్యారు; కాగా, ఆ పార్టీ కేవలం మూడు స్థానాల్లో విజయం సాధించగా, మరో 55 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతోంది. పెరంబూరు, తిరుచ్చి తూర్పు నియోజకవర్గాలు రెండింటిలోనూ విజయ్ ముందంజలో ఉండగా, ఎఐఎడిఎంకె అధినేత ఎడప్పాడి కె. పళనిస్వామి ఎడప్పాడి నియోజకవర్గంలో ఆధిక్యంలో ఉన్నారు. అస్సాంలో, అధికారంలో ఉన్న బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ఆరు స్థానాలను గెలుచుకుని, మరో 94 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతూ అధికారాన్ని నిలబెట్టుకుంది. తమిళనాడు శాసనసభ ఎన్నికల చరిత్రలో కీలక పరిణామం చోటు చేసుకుంది. రాయపురం నియోజకవర్గంలో టీవీకే నుండి పోటీ చేసిన ఆటో డ్రైవర్ కె. విజయ్ ధాము అద్భుత విజయం సాధించాడు. తొలిసారిగా బరిలో దిగిన టీవీకే తరపున పోటీ చేసిన విజయ్ రాష్ట్రంలోని అత్యంత శక్తివంతమైన పార్టీలైన డీఎంకే, అన్నాడీఎంకే అభ్యర్థులను చిత్తుచిత్తుగా ఓడించాడు. విజయ్ ధాము 55వేలకు పైగా ఓట్లు సాధించగా తన సమీప ప్రత్యర్థిపై 14వేల ఓట్ల మెజారిటీతో విజయాన్ని కైవసం చేసుకున్నాడు. మరోవైపు ఇక్కడ అన్నాడీఎంకే పార్టీ నుండి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన జయకుమార్‌ను కూడా ఓడించడం ఆసక్తికరంగా మారింది. ఐదుసార్లు గెలిచిన జయకుమార్ కేవలం 18వేల ఓట్లను మాత్రమే సాధించి మూడో స్థానానికి పరిమితం అయ్యాడు. డీఎంకే నుండి దివంగత సీనియర్ మంత్రి రెహమాన్ ఖాన్ కుమారుడు సుబైర్ ఖాన్ పోటీ చేయగా రెండో స్థానంలో నిలిచాడు. ఇదిలా ఉంటే ఆటో డ్రైవర్ విజయ్ ధాము టీవీకే అధినేత విజయ్ అభిమానసంఘం అయిన విజయ్ మక్కల్ ఇయక్కంలో సభ్యుడుగా ఉన్నాడు. ఒక సామాన్యుడిగానే విజయ్ ధాము టీవీకే నుండి టికెట్ దక్కించుకున్నాడు. పార్టీ అభ్యర్థుల ప్రకటన కార్యక్రమంలో కన్నీళ్లతో పార్టీ అధినేత విజయ్ ని ఆలింగనం చేసుకోవడంతో ఆటో డ్రైవర్ వీడియో, ఫోటోలు నెట్టింట చక్కర్లు కొట్టాయి. ఇక ప్రచారంలో విజయ్ ధాము.. మీరు మమ్మల్ని కొత్త ముఖాలు అనుకోవచ్చు. కానీ అభిమాన సంఘాల ద్వారా మేము కొన్నేళ్ల నుండి క్షేత్రస్థాయిలో సేవ చేస్తున్నామని తెలిపి జనాలను తనవైపు తిప్పుకున్నాడు.

**అస్సాం, కేరళ**.. బీజేపీ ఐదు స్థానాల్లో విజయం సాధించి, 76 స్థానాల్లో ఆధిక్యంలో ఉండగా; దాని మిత్రపక్షాలైన అసోం గణ పరిషత్ (ఏజీపి), బోడోలాండ్ పీపుల్స్ ఫ్రంట్ (బిపిఎఫ్) 18 స్థానాల్లో ఆధిక్యంలో ఉన్నాయి. కాంగ్రెస్ 20 స్థానాల్లో, దాని మిత్రపక్షమైన రైజోర్ దళ్ ఒక స్థానంలో ఆధిక్యంలో ఉండగా, ఎఐయుడిఎఫ్ రెండు స్థానాల్లో ముందంజలో ఉంది. కేరళలో, వరుసగా రెండు పర్యాయాలు అధికారానికి దూరంగా ఉన్న యుడిఎఫ్, 100కి పైగా స్థానాలను గెలుచుకోవడం ద్వారా చారిత్రాత్మక పునరాగమనం చేసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన 41 స్థానాల నుండి ఇది భారీ ముందడుగు. పలువురు మంత్రులు తమ స్థానాలను కోల్పోవడం, సిపిఐ (ఎం) తన సంప్రదాయ కంచుకోటల్లోనే ఓటమి పాలవడం వంటి పరిణామాలతో ఎల్ డిఎఫ్ తీవ్ర ఎదురుదెబ్బను చవిచూసింది. ఇదే సమయంలో, తీవ్ర పోటీ నెలకొన్న మూడు స్థానాలను గెలుచుకోవడం ద్వారా బీజేపీ కేరళలో తన ఖాతాను తెరిచింది.

## తెలంగాణలోనూ ఎస్ఐఆర్ అమలు

**బెంగాల్ లో మాదిరిగానే అమలుకు కేంద్రం సన్నద్ధం**

**వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు పునాది వేసేందుకే మోడీ తెలంగాణ టూర్**

**నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్**



**హన్మకొండ, మే 04 (వుదయం ప్రతినిధి) :** బెంగాల్ లో మాదిరిగానే తెలంగాణలోనూ ఎస్ఐఆర్ అమలు చేయాల్సిన అవసరం ఉందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అభిప్రాయపడ్డారు. అందుకోసం కేంద్రం అన్ని రకాలుగా సిద్ధమవుతోందని చెప్పారు. సోమవారం హన్మకొండలో ఆయన మీడియాతో మాట్లాడారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ సాధించిన ఘన విజయం తర్వాత విపక్షాల్లో వణుకు మొదలైందని అన్నారు. 2028 అసెంబ్లీ ఎన్నికలకు పునాది వేసేందుకే ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 10న హైదరాబాద్ వస్తున్నారని చెప్పారు. లక్ష మందితో ఈ భారీ సభ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరగనుందన్నారు. వచ్చే రెండు రోజులు కేసీఆర్‌కు టీవీని దూరంగా ఉంచండి, లేదంటే ఆయనకు గుండెపోటు వచ్చే అవకాశం ఉంది. కొందరికి పార్టీలు పెట్టడం, డబ్బులు వసూలు చేయడం బిజినెస్‌గా మారింది. కేసీఆర్‌తో ఎలాంటి పొత్తులూ ఉండవు. కాళేశ్వరం ప్రాజెక్టుపై రెండేళ్లు నాన్చి సీబీఐకి అప్పగించారు.

# రైతుల మరణాలు ప్రభుత్వ హత్యలే

**సంగారెడ్డి, మే 04 (వుదయం ప్రతినిధి) :** రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని దళారుల పాలు చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ధాన్యం కొనుగోలు చేయవద్దని ఈ ప్రభుత్వం ఆలోచన అని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతును చచ్చే వరకు వేధిస్తోందని ఆయన మండిపడ్డారు. రాబోయే వారం రోజుల్లో అన్ని కొనుగోలు కేంద్రాలు తిరిగి రైతులకు ధైర్యం చెబుతామని స్పష్టం చేశారు. అవసరం అయితే తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపడతామన్నారు. ధాన్యం కొనుగోలు చేసే వరకు ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు. మోసపూరిత ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తామని హెచ్చరించారు. సోమవారం సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో ఆయన మీడియాతో మాట్లాడారు. శనగ పంట వచ్చి.. నెల రోజులైనా ఇప్పటి వరకు ఆ పంటను ప్రభుత్వం కొనుగోలు చేయలేదని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు భరోసా ఇప్పటి వరకు సరిగా ఇవ్వలేదన్నారు. అన్ని పంటలు కొనుగోలు చేస్తామని చెప్పి రైతులను ఈ ప్రభుత్వంలోని నేతలు పచ్చి మోసం చేశారని విమర్శించారు. మంత్రి దామోదర రాజనర్సింహ రాసిన లేఖతో రైతులపై ఈ ప్రభుత్వానికి ఎంత ప్రేమ ఉందో తెలుస్తోందని కేటీఆర్ చురకలంటించారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగడానికి కారణం సివిల్ సప్లై కార్పొరేషన్‌లో భారీ కుంభకోణం అనిధాన్యం కొనుగోళ్లు ఎలా జరుగుతున్నాయో తెలుసుకోవడానికి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎప్పుడైనా సందర్శించారా..? అని ప్రశ్నించారు. సీఎంకు భూముల కొనుగోళ్లు, రియల్ ఎస్టేట్‌పై ఉన్న శ్రద్ధ రైతు సమస్యలపై లేదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో వడదెబ్బ, పిడుగులు, గుండెపోటు కారణాలతో రైతులు చనిపోతుంటే ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏ పంట కూడా సరిగ్గా కొనుగోలు చేయడం లేదని మండిపడ్డారు. 95 లక్షల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేయాల్సి ఉండగా.. కేవలం 9 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యమే కొనుగోలు చేశారని తెలిపారు. కొనుగోలు కేంద్రాలు ఇప్పటికి ప్రారంభించ లేదన్నారు. సీఎం కేసీఆర్ హయాంలో 11 సార్లు రైతు బంధు వేశారని కేటీఆర్ గుర్తు చేశారు.

### ముగింపుకు దగ్గర్లో

## కాంగ్రెస్ శకం

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రధాని కావాలని సీఎం రేవంత్‌రెడ్డి కలలు కంటున్నారని అన్నారు. సీఎం ఎక్కడికి వెళ్తే.. అక్కడ కాంగ్రెస్‌కు ఓటమినేనన్నారు. కేరళంలో ప్రభుత్వంపై వ్యతిరేకత ఉండటంతోనే.. ఈ ఫలితాలు కాంగ్రెస్‌కు కొంత అనుకూలంగా ఉన్నాయని చెప్పారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ రావాలని ప్రజలు కోరుకున్నారన్న ఆయన బీజేపీకి అసలు ప్రచారకర్త రాహుల్ గాంధీనేనని బండి సంజయ్ ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ ని ఓ పరిపూర్ణ రాజకీయ నాయకుడిగా భావిస్తోన్న కాంగ్రెస్ నేతలు ఆయన్ను గుర్తించడం లేదని విమర్శనాస్త్రాలు సంధించారు. నాయకత్వ పటిమ లేని రాహుల్ తో కాంగ్రెస్ పాతాళానికి పడిపోతోందని అన్నారు.

# జవహర్ నగర్ డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం

**డంపింగ్ జేఏసీ**

**సభ్యులకు సీఎం రేవంత్ హామీ**

**ఈ నెల 15 వరకు పూర్తి**

**స్థాయి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు**

**అఖిలపక్ష సమావేశంలో ఏకాభిప్రాయం**



**హైదరాబాద్, మే 4 (ఎఎంఎస్) :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న జవహర్ నగర్ డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ నెల 15 వరకు పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. జవహర్ నగర్ డంపింగ్ జేఏసీ సభ్యులు మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ నేతృత్వంలో సోమవారం సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో జూబ్లీహిల్స్ లోని ఆయన నివాసంలో కలిసి సమస్య ను వివరించారు. వారి సమస్యలు విన్న సీఎం సానుకూలంగా స్పందించారు. మే 15 తర్వాత అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. నూతనంగా ఏర్పాటు చేయబోయే డంపింగ్ యార్డులపై అఖిలపక్ష సమావేశంలో అభిప్రాయాలు తీసుకోవాలని ఆదేశించారు. మారిన పరిస్థితులను బట్టి విదేశాల్లో చెత్త సేకరణ కోసం అవలంబిస్తున్న శాస్త్రీయ పద్ధతులను అధ్యయనం చేయాలన్నారు. అందుకు అవసరమైతే అఖిలపక్ష పార్టీల కమిటీలతో పాటు అధికారుల బృందాన్ని విదేశాలకు పంపుతామని తెలిపారు. ఎండ్ల తరబడి అపరిష్కృతంగా ఘటకేసర్ రైల్వే వంతెన నిర్మాణం లో జరుగుతున్న జాప్యంపై వజ్రేష్ యాదవ్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళగా అధికారులతో మాట్లాడిన సీఎం.. వెంటనే ఆ వంతెన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో మల్కాజిగిరి ఎంపీ ఈటేల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు హరి వర్ధన్ రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ శరత్ చంద్ర రెడ్డి,జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ, ముప్పు రామారావు, జేఏసీ ప్రతినిధులు శంకర్ నారాయణ, పద్మచారి, ఎనుగు సంజీవరెడ్డి, మారం సమ్మిరెడ్డి, గావిని స్వర్ణ శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

# 8న టీఆర్ఎస్ పాలమూరు శంఖారావం

**పాలమూరు**

**నుంచే కవిత తొలి అడుగు**

**కృష్ణా జలాల్లో తెలంగాణకు**

**జరిగిన అన్యాయంపై**

**గళమెత్తనున్న టీఆర్ఎస్ అధినేత్రి**

**పోస్టర్ ఆవిష్కరించిన**

**తెలంగాణ రక్షణ సేన నాయకులు**




**హైదరాబాద్, మే 04 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కవిత పాలమూరు గడ్డ మీది నుంచే రాజకీయంగా మొదటి అడుగు వేయనున్నారు. పార్టీ స్థాపించిన తర్వాత జోగులాంబ అమ్మవారి ఆశీస్సులు తీసుకుని ముందుకు సాగుతానని ప్రకటించిన ఆమె.. చెప్పినట్టే ఈనెల 8న ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నుంచి కృష్ణా జలాల సాధనకు శంఖారావం పూరించనున్నారు. 8న ఉదయం జోగులాంబ అమ్మవారిని దర్శనం చేసుకోనున్న కవిత అదే రోజు సాయంత్రం పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టులో ప్రతిపాదించిన కేపీ లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ సమీపంలోని చౌదరిగూడెం వద్ద ''పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు సాధన'' బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారని ఆ పార్టీ వర్గాలు ప్రకటించాయి. ఈ మేరకు సోమవారం బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో టీఆర్ఎస్ నాయకులు పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు సాధన పోస్టర్ ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు నవీన్ ఆచారి, గొంగళ్ల రంజిత్ కుమార్, సయ్యద్ ఇస్మాయిల్, నరేశ్ ప్రజాపతి, ఎదురుగట్ల సంపత్ గౌడ్, సీమ రమేశ్, బుచ్చిబాబు, ముస్తఫా పాల్గొన్నారు. ఇదిలా వుంటే ప్రత్యేక రాష్ట్రం సాధించుకుని 12 ఏళ్లు గడిచినా కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ వెనుకబడి ఉండటానికి పాలకుల లోపభూయిష్ట విధానాలే కారణమని పలు వేదికలపై నుంచి కవిత స్పష్టం చేశారు. కృష్ణా, గోదావరి నీళ్లను సమర్థవంతంగా వినియోగించుకుంటూ మన బీళ్లకు మళ్లించుకునేందుకు తమ వద్ద స్పష్టమైన విధానాలు ఉన్నాయని కూడా ప్రకటించారు. ఈ క్రమంలోనే కృష్ణా నీళ్ల సాధన కోసం ఉద్యమ కార్యాచరణ ప్రకటించే దిశగా అడుగులు వేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదట శంకుస్థాపన చేసిన పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు 11 ఏళ్లు గడిచిన తర్వాత కూడా 50 పనులు పూర్తి చేయకపోవడంపై ''జనంబాట'' కార్యక్రమంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచి ప్రాజెక్టుకు సత్వర అనుమతులు సాధించడంతో పాటు పనులు వేగంగా పూర్తి చేయించడానికి ఉద్యమ ప్రణాళిక ప్రకటించే దిశగా కవిత అడుగులు వేస్తున్నారు. తెలంగాణకు హక్కుగా దక్కే ప్రతి చుక్క నీటిని మన బీడు భూములకు మళ్లించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

## వేగవంతంగా ధాన్యం కొనుగోళ్లు

మొదటి పేజీ తరువాయి

సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్,వాకిటి శ్రీహరి లతో కలిసి అత్యవసర వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర,రవాణా శాఖ కమిషనర్ కె.ఇలంభర్తీ,కార్మిక ,ఉపాధి మరియు విపత్తు నిర్వహణ శాఖా కార్యదర్శి హరిచందన తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రబీ సీజన్ లో పెరిగిన ధాన్యం ఉత్పత్తికి అనుగుణంగా కొనుగోళ్ల ప్రక్రియను ప్రారంభించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ఇప్పటి వరకు 14.80లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు ఆయన వెల్లడించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి ఇప్పటి వరకు రైతుల ఖాతాలో రూ. 2001.96 కోట్లు జమ చేసినట్టు చెప్పారు. రాబోయే రోజుల్లో కొనుగోలు కేంద్రానికి భారీ ఎత్తున ధాన్యం తరలి రానున్నందున కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు అనుసరించాల్సిన పద్దతులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. నల్లగొండ, నిజామాబాద్ జిల్లాలో ఇబ్బడి ముబ్బడిగా ధాన్యం వస్తున్నందున అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ నెల 3న రాత్రి అకాల వర్షాలతో సూర్యాపేట,ఖమ్మం, మహబూబాబాద్ వంటి జిల్లాలో 299 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసిపోయినట్లు ప్రభుత్వ దృష్టికి సమాచారం వచ్చిందన్నారు. తడిసిన బియ్యాన్ని తక్షణమే బియ్యం మిల్లులకు తరలించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

## గత ప్రభుత్వ విద్యుత్ అక్రమాల విచారణ సీబీఐకి అప్పగింత

**హైదరాబాద్, మే 04 (వుదయం ప్రతినిధి) :** గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ కొనుగోలు, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ ప్రాజెక్టుల్లో జరిగిన అక్రమాలపై విచారణకు సంబంధించిన కమిషన్ నివేదికను కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు సోమవారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రివర్గ విస్తరణలో మంత్రివర్గం దీనికి ఆమోదం తెలిపింది. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ భేటీలో మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకున్నది. సమావేశం అనంతరం రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి మంత్రి వర్గ భేటీలో తీసుకున్న నిర్ణయాలను వెల్లడించారు. విద్యుత్తు కొనుగోళ్లతో పాటు భద్రాద్రి, యాదాద్రి విద్యుత్తు ప్లాంట్లలో జరిగిన అవకతవకలు, అక్రమాలపై ప్రభుత్వం విచారణ కమిషన్ ను ఏర్పాటు చేసినట్లు మంత్రి పొంగులేటి వెల్లడించారు. 2024 మార్చి 14వ తేదీన కమిషన్స్ ఆఫ్ ఇన్క్వైరీ చట్టం ప్రకారం రిటైర్డ్ జస్టిస్ ఎల్. నరసింహా రెడ్డి అధ్యక్షతన కమిషన్ ఏర్పాటు చేసిందని చెప్పారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు 2024 జులైలో ఆయన విచారణ నుంచి తప్పుకోవటంతో జస్టిస్ మదన్ బి. లోకూర్‌ను కమిషన్‌గా నియమించారన్నారు. 2024 అక్టోబర్లో కమిషన్ మొత్తం 114 పేజీల నివేదికను ప్రభుత్వానికి సమర్పించిందని తెలిపారు. అనంతరం గతేడాది జనవరి 4న జరిగిన కేబినేట్ సమావేశంలో ఈ నివేదికపై తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై అడ్వకేట్ జనరల్ అభిప్రాయం తీసుకోవాలని నిర్ణయించిందన్నారు. నివేదికను పరిశీలించిన అడ్వకేట్ జనరల్ తన సూచనలు, అభిప్రాయాలను తెలియజేశారనీ వాటన్నింటినీ ఈ రోజు కేబినేట్ చర్చించిందని మంత్రి వివరించారు.

2. రాష్ట్రంలో భూముల ధరలను సవరించాలని, కొన్ని ప్రాంతాల్లో వాస్తవ ధరలతో పోలిస్తే భారీగా హెచ్చుతగ్గులున్న భూముల ధరలను క్రమబద్ధీకరించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. మార్కెట్ విలువల రేషనలైజేషన్ చేయడానికి రిజిస్ట్రేషన్ శాఖకు అనుమతి ఇవ్వడం జరిగింది. ఈనెల చివరి వారంలో సవరించిన విలువలు అమల్లోకి వస్తాయి. వివిధ ప్రాజెక్టులు, అభివృద్ధి పనులు, రోడ్ల విస్తరణలో భూములు కోల్పోతున్న నిర్వాసితులు ఇప్పుడు ప్రభుత్వం చెల్లించే పరిహారం రేట్లపై అసంతృప్తితో ఉన్నారు. ధర పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తులు అందిస్తున్నారు. దీంతో పాటు వాస్తవంగా మార్కెట్ లో ఉన్న ధరలతో పోలిస్తే ప్రభుత్వం నిర్ణయించిన భూముల ధరలు భారీగా వ్యత్యాసమున్నాయి. అందుకు శాస్త్రీయ పద్ధతి అనుసరించి ఈ ధరలను సవరించేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. జిల్లాల్లో ఉండే మార్కెట్ విలువల రివిజన్ కమిటీలు అన్ని విషయాలను దృష్టిలో పెట్టుకుని విలువలను సవరిస్తుంది.

3. హిల్ట్ పాలసీలో దరఖాస్తు చేసుకునే వారికి కూడా ఒక అవకాశం ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. భూముల ధరలు పెరిగేలోపు దరఖాస్తు చేసుకున్న వారికి ముందుగా పది శాతం చెల్లించే వెసులుబాటు ఇచ్చేందుకు ఆమోదం తెలిపింది. వారికి ఇప్పుడున్న భూముల ధరలే వర్తిస్తాయి. మిగతా 90 శాతం 90 రోజుల్లో చెల్లించాల్సి ఉంటుంది.

4. అకాల వర్షాలతో వివిధ జిల్లాల్లో పంటలు, పంట ఉత్పత్తులకు నష్టం వాటిల్లిన వివరాలు జిల్లా ఇన్ ఛార్జీ మంత్రులు తెప్పించుకుని రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

5. నల్గొండ-రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సంఘాన్ని నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డుకు అప్పగించే ఎంవోయూకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో నల్గొండ- రంగారెడ్డి మిల్క్ ప్రొడ్యూసర్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ కు సంబంధించిన పాలు, పాల ఉత్పత్తులకు సంబంధించి డైరీ ప్లాంట్ నిర్వహణ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ ఎన్డీడీబీ నిర్వహిస్తుంది.

6. తెలంగాణలో 9 జిల్లాల్లో 33/11 కేవీ సబ్స్టేషన్ల వద్ద సోలార్ పవర్ జనరేషన్ ప్లాంట్ల ఏర్పాటుకు కేబినేట్ ఆమోదం తెలిపింది. పైలెట్ పద్ధతిన 18 చోట్ల ఈ సోలార్ జనరేషన్ ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. దాదాపు రూ.66.50 కోట్లతో 19 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులను అమలు చేసేందుకు ఆమోదం తెలిపింది.

7. క్యూర్ పరిధిలోని గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్లలో పెండింగ్ లో ఉన్న వివిధ ప్రభుత్వ కార్యాలయాలు పన్నులను క్లియర్ చేరుకునేందుకు వన్ టైమ్ సెటిల్ మెంట్ ( ఓటీఎస్) వెసులుబాటు కల్పించే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దాదాపు రూ. 5864 కోట్ల బకాయిలున్నాయి. జరిమానాలు, వడ్డీలన్నీ మినహాయించి వన్ టైమ్ సెటిల్మెంట్ ద్వారా రూ.1686 కోట్లు వస్తాయని అంచనా వేసింది. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల పరిధిలోనే వన్ టైమ్ సెటిల్మెంట్ పై ఈ బకాయిలు వసూలు చేసుకోవాలని మున్సిపల్ శాఖను ఆదేశించింది. హైదరాబాద్ జల మండలికి ఇవ్వాల్సిన నీటి బకాయిలను కూడా సర్దుబాటు చేయాలని నిర్ణయం తీసుకుంది.

8. ఖమ్మం జిల్లా కామేపల్లి వద్ద బుగ్గవాగు నుంచి లెఫ్ట్ ఫ్లడ్ ఫ్లో కాలువ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఖమ్మం జిల్లాలో మైనర్ ఇరిగేషన్ ట్యాంకులకు నీరు అందించనున్నారు.

# వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు

**వికారాబాద్, మే 04 (వుదయం ప్రతినిధి) :** రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. మున్ముందూ మరిన్ని రైతు సంక్షేమ కార్యక్రమాలకు కాంగ్రెస్ సర్కార్ శ్రీకారం చుడుతుందని చెప్పారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా వికారాబాద్ జిల్లా తాండూరులో ఈ నెల 9 వరకు నిర్వహించనున్న రైతు వారోత్సవాల కార్యక్రమానికి ఆయన సోమవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా 'టీజీ ఆర్గానిక్స్' మొబైల్ యాప్ ను ఆవిష్కరించిన ఆయన సేంద్రియ ఉత్పత్తుల ప్రదర్శన కేంద్రాన్ని ప్రారంభించి పరిశీలించారు. అనంతరం రైతులను ఉద్దేశించి మాట్లాడారు. అన్నదాతలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. ముందెన్నడూ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయంలో ఆధునిక విప్లవాత్మక విధానాలు అమలు చేస్తుందన్నారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి, రైతులు–వినియోగదారుల మధ్య ప్రత్యక్ష సంబంధాన్ని నెలకొల్పడానికి 'టీజీ ఆర్గానిక్స్' మొబైల్ యాప్ ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ యాప్ లో తెలంగాణ స్టేట్ సీడ్ అండ్ ఆర్గానిక్ సర్టిఫికేషన్ అథారిటీ ద్వారా ధృవీకరించబడిన రైతుల ఉత్పత్తులు మాత్రమే అందుబాటులో ఉంటాయని తెలిపారు. తద్వార కల్తీ లేని అసలైన ఆర్గానిక్ ఆహారం దొరుకుతుందన్నారు. మధ్యవర్తులు లేకుండా నేరుగా రైతుల నుంచి తాజా కూరగాయలు, పండ్లు, ధాన్యాలను కొనుగోలు చేయవచ్చన్నారు. వినియోగదారులు తమకు 50 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఆర్గానిక్ రైతులను వెతుక్కుని వారి ఉత్పత్తులను కొనుగోలు చేయవచ్చని తెలిపారు. ముఖ్యంగా మధ్యవర్తుల ప్రమేయం లేకపోవడంతో, రైతులు తమ పంటకు సరైన ధరను పొందవచ్చన్నారు. ఈ యాప్‌లో త్వరలో మరిన్ని సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. తాండూరులో కంది బోర్డు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. దేశానికే తెలంగాణ అన్నం పెడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం యూరియా విషయంలో రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందని పేర్కొన్నారు. తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయం దండుగ కాదు పండుగ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు సంబురంగా వ్యవసాయం చేసుకుంటున్నారని తెలిపారు. ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామన్నారు. తాండూరు నియోజకవర్గంలో కోట్పల్లి, జుంటుపల్లి ప్రాజెక్టుల ద్వారా సాగు నీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రాణహిత చేవెళ్ల–పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టులను త్వరితగతిన నిర్మించి రైతుల పొలాలకు నీరు అందిస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలా ఉత్తుత్తి శిలాఫలకలు వేయలేమని చెప్పారు. అభివృద్ధికి చక్కటి బాటలు వేస్తున్నామన్నారు. అనంతరం యాలాల మండలం జుంటుపల్లి సమీపంలోని ఆయిల్ ఫాం తోటను నేతలు, అధికారులు పరిశీలించారు. రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 2601 రైతు వేదికల్లో వ్యవసాయంలో మంచి లాభాలు, ఉత్పత్తులు తీసుకువచ్చేందుకు వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల ద్వార ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వడంతోపాటు రైతుల నుంచి కూడ సలహాలు స్వీకరిస్తామన్నారు. ప్రభుత్వ పథకాల ద్వార రైతులకు లాభాలు చేకూరే విధంగా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా డ్రోన్ల ద్వారా మందుల పిచికారి, ఆయిల్ ఫాం తోటల పై కూడా ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ ఆయిల్ ఫాం విస్తీర్ణంలో వికారాబాద్ జిల్లా మూడవ స్థానం, పండ్లు, కూరగాయల విస్తీర్ణంలో రెండో స్థానంలో ఉందని తెలిపారు. ఆయిల్ ఫాం, పండ్ల తోటలకు ప్రభుత్వం సబ్సిడీని కూడా ఇస్తుందన్నారు. రైతులు పండించిన పంటకు మద్దతు ధర లభించేందుకు రైతు కొనుగోళు కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. 'టీజీ ఆర్గానిక్స్' అనే ప్రత్యేక మొబైల్ యాప్ ప్లే స్టోర్ లో ఉందని తెలిపారు. రైతులకు ఈ యాప్ చాల మంచిగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్పర్సన్ కల్వ సుజాత, తాండూరు మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధారసింగ్, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# అట్లాంటిక్ క్రూయిజ్ నౌకలో హంటావైరస్ వ్యాప్తి

**వుదయం డెస్క్, మే 4 :** అట్లాంటిక్ మహాసముద్రంలో ఒక క్రూయిజ్ నౌకలో హంటావైరస్ వ్యాప్తి చెందడంతో కనీసం ముగ్గురు మరణించగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) ప్రకారం, ప్రస్తుతం అందులో ఉన్వార◌ికి పరీక్షలు జరుగుతుండగా, మరో ఐదుగురికి ఈ ఇన్ఫెక్షన్ సోకినట్లు అనుమానిస్తున్నారు. ఐరాస ఆరోగ్య సంస్థ నుంచి వెలువడిన ప్రకటన ప్రకారం, ఒక హంటావైరస్ కేసు ధృవీకృతం కాగా, మరో ఐదుగురికి ఉన్నట్టుగా అనుమానిస్తున్నారు. లాబొరేటరీ పరీక్షలు, సాంక్రమిక వ్యాధి పరిశోధనలు సహా వివరణాత్మక పరిశోధనలు జరుగుతున్నాయి. ప్రయాణీకులకు, సిబ్బందికి వైద్య సంరక్షణ, సహాయాన్ని అందిస్తున్నారు. వైరస్ సీక్వెన్సింగ్ కూడా కొనసాగుతోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ తన ప్రకటనలో పేర్కొంది.



**హంటావైరస్ వ్యాప్తి వివరాలు**.. నివేదికల ప్రకారం, అర్జెంటీనా నుండి ఆఫ్రికాలోని కేప్ వెర్డేకు ప్రయాణిస్తున్న ఎంవి హోండియస్ క్రూయిజ్ నౌకలో ఈ వ్యాప్తి నమోదైంది. డచ్ కంపెనీ నిర్వహించే ఈ క్రూయిజ్ నౌకను కేప్ వెర్డే తీరంలో లంగరు వేశామని, అయితే ఈ వ్యాధి కారణంగా ఎవరినీ కిందకి దిగనివ్వలేదని పేర్కొంది. కేప్ వెర్డే నుండి నెదర్లాండ్స్‌కు ఎంవి హోండియస్ నౌకలో వ్యాధి లక్షణాలు గల ఇద్దరు వ్యక్తులను స్వదేశానికి తిరిగి పంపే ప్రక్రియను నిర్వహించడంలో ఉమ్మడి ప్రయత్నానికి నాయకత్వం వహించడానికి డచ్ అధికారులు అంగీకరించారు. ఈ క్రూయిజ్ సంస్థ స్థానిక ఆరోగ్య అధికారులతో సమన్వయం చేసుకుంటూ, మృతుల భౌతిక కాయాన్ని స్వదేశానికి తిరిగి పంపే ప్రయత్నాలను చేపట్టింది. ఈ తిరిగి పంపే ప్రక్రియలో, మృతుని భౌతికకాయంతో పాటు, ఆ వ్యక్తితో సన్నిహిత సంబంధం ఉన్న మరో అతిథిని కూడా చేర్చాలని యోచిస్తున్నాం, అని నెదర్లాండ్స్‌లోని వ్లిస్సింగెన్‌కు చెందిన ఆ సంస్థ తెలిపింది. వ్యాధి లక్షణాలతో బాధపడుతున్న ఇద్దరు వ్యక్తులను వైద్యపరంగా తరలించే ప్రక్రియను కూడా డబ్ల్యుహెచ్ ఒ సులభతరం చేస్తోందని, ఐక్యరాజ్యసమితి ఆరోగ్య సంస్థ అధిపతి డాక్టర్ టెడ్రోస్ అధనోమ్ ఘెబ్రేయెసస్ తెలిపారు. ప్రస్తుతానికి, కనీసం ముగ్గురు వ్యక్తులు మరణించారు, మరొకరు దక్షిణాఫ్రికాలో అత్యవసర చికిత్స విభాగంలో ఉన్నారు.

**ఈ హంటా వైరస్ ఏమిటి?**.. హంటావైరస్ అనేది ఎలుకల ద్వారా వ్యాపించే ఒక రకమైన వైరస్. ఇది ఎలుకల ఎండిన మలంలోని రేణువులను పీల్చడం ద్వారా మానవులకు సంక్రమిస్తుంది. అమెరికాకు చెందిన సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సిడిసి) ప్రకారం, ఎలుకల మూత్రం, మలం లేదా లాలాజలం నుంచి వైరస్ గాలిలోకి చేరినప్పుడు హంటావైరస్ సంక్రమణలు సంభవిస్తాయి.

**రెండు తీవ్ర అనారోగ్యాలకు కారణమయ్యే వైరస్**

హంటావైరస్ పల్మనరీ సిండ్రోమ్ (హెచ్‌పిఎస్), ఇది అలసట, జ్వరం, కండరాల నొప్పులతో మొదలై, తరువాత తలనొప్పి, తలతిరగడం, చలి, కడుపు సంబంధిత సమస్యలకు దారితీస్తుంది. హెమరేజిక్ ఫీవర్ విత్ రీనల్ సిండ్రోమ్ (హెచ్ ఎఫ్ ఆర్ ఎస్) అనేది మరింత తీవ్రమైన ఇన్ఫెక్షన్, ఇది మూత్రపిండాలపై ప్రభావం చూపుతుంది. దీని లక్షణాలలో తక్కువ రక్తపోటు, అంతర్గత రక్తస్రావం, తీవ్రమైన మూత్రపిండాల వైఫల్యం ఉండవచ్చు. హంటావైరస్ ఇన్ఫెక్షన్‌కు నిర్దిష్టమైన చికిత్స ఏదీ లేదు, అందువల్ల చికిత్స సాధారణంగా విశ్రాంతి, ద్రవపదార్థాలు తీసుకోవడం వంటి సహాయక సంరక్షణపై దృష్టి పెడుతుంది. రోగులకు వెంటిలేటర్ వంటి శ్వాస సహాయం కూడా అవసరం కావచ్చు.



# గ్రేటర్ హైదరాబాద్




## ఘనంగా జన్మదిన వేడుకలు



**షాద్ నగర్, మే 04 (వుదయం):** షాద్ నగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ యువనాయకుడు వై. మురళీకృష్ణ యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా షాద్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో బీఆర్ఎస్ నాయకులు కొండ మల్లేష్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేసి సేవా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో కేక్ కట్ చేసి, నాయకులు తమ అభిమాన నాయకుడికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవ పట్ల ఆయన కట్టుబాటును కొనియాడుతూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పిల్లి శారద శేఖర్, నాయకులు చీపిరి రవి యాదవ్, నందిగామ శ్రీనివాస్, జుట్టు బాలరాజు, బిక్షపతి, చెర్క శివ, మంగ శ్రీశైలం, పిట్టల మల్లేష్, శేఖర్, కుమార్, వెంకటేష్, అనిల్, శీలం శ్రీకాంత్, ప్రవీణ్, సతీష్, వంశీ, అనిల్, చింటూ, సంతోష్, పవన్, డల్లు, నాని, లడ్డు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 55 ఫిర్యాదులు





**హైదరాబాద్, మే 04 (వుదయం):** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి ఫిర్యాదుల కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ (అడ్మిన్), అదనపు కమిషనర్ (హెల్త్), చీఫ్ సిటీ ప్లానర్, చీఫ్ ఇంజనీర్, ల్యాండ్ అక్విజిషన్ అధికారులు, డైరెక్టర్ (యూబీడీ), సీఎంఓహెచ్, చీఫ్ వెటర్నరీ ఆఫీసర్, జాయింట్ కమిషనర్ (అడ్మిన్), అదనపు సీసీపీ తదితర అధికారులు పాల్గొని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. జోన్ వారీగా అందిన ఫిర్యాదుల్లో శంషాబాద్ జోన్‌లో 02, రాజేంద్రనగర్ జోన్‌లో 06, చార్మినార్ జోన్‌లో 03, గోల్కొండ జోన్‌లో 00, ఖైరతాబాద్ జోన్‌లో 02, సికింద్రాబాద్ జోన్‌లో 06 ఫిర్యాదులు అందగా, హెడ్ ఆఫీస్‌లో 36 ఫిర్యాదులు స్వీకరించబడ్డాయి. మొత్తంగా 55 ఫిర్యాదులు ప్రజావాణి కార్యక్రమంలో అందినట్లు అధికారులు తెలిపారు. అందిన ఫిర్యాదులను సంబంధిత విభాగాలకు పంపించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.

## ఉమ్మింగ్లా శిఖరంపై వికారాబాద్ యువకుడు
## గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు






**వికారాబాద్ మే 4 (వుదయం ప్రతినిధి ):** వికారాబాద్ జిల్లా యువకుడి పేరు గిన్నిస్ బుక్ లో నమోదయింది. తాండూరుకు చెందిన నిఖిత్ శెట్టి అరుదైన ఘనత సాధించారు. లద్దాఖ్‌లోని ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన మోటార్ రహదారి ఉమ్లింగ్ లా (5,799 మీటర్లు) శిఖరాన్ని బైక్‌పై అధిరోహించి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ నెలకొల్పారు. నవీన్‌రాధిక దంపతుల కుమారుడైన నిఖిత్, తన యమహా 150సీసీ బైక్‌పై తాండూరు నుంచి ప్రయాణమై ఈ లక్ష్యాన్ని చేరుకున్నారు. ఈ అరుదైన ఫీట్‌ను సాధించి తెలంగాణ కీర్తిని చాటిన నిఖిత్‌ను జిల్లాకు చెందిన ప్రముఖులు, తాండూరు వాసులు అభినందించారు.

## ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం




**షాద్ నగర్, మే 04 (వుదయం):** షాద్ నగర్ మున్సిపాలిటీ 4వ వార్డు రాం నగర్ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ రిబ్బన్ కట్ చేసి, లబ్ధిదారులకు గృహ ప్రవేశం చేయించారు.

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ గారు మాట్లాడుతూ, పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కొప్పునూరి ప్రవీణ్, బచ్చలి నరేష్, మాజీ కౌన్సిలర్ రాజేందర్ రెడ్డి, రవి కుమార్ ముదిరాజ్, చందు లాల్, రవి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## దేవాలయాలు ఆధ్యాత్మిక చైతన్యానికి కేంద్రాలు

### ఎమ్మెల్యే జీఎంఆర్




**గుమ్మడిదల, మే 04 (వుదయం):** భారతీయ సంప్రదాయంలో దేవాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యం, భక్తి భావం పెరగాలంటే కొత్త ఆలయాల నిర్మాణం అవసరమని ఆయన తెలిపారు.

సోమవారం గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని అన్నారం ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న శ్రీ సుందర రామచంద్ర స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం రామ్‌నగర్ కాలనీలో శ్రీశ్రీశ్రీ పోచమ్మ అమ్మవారి ఆలయ భూమిపూజ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆలయాల నిర్మాణానికి తాను ఎల్లప్పుడూ సహకారం అందిస్తానని చెప్పారు. దేవాలయాలు వ్యక్తిగత ఆధ్యాత్మిక పురోగతికే కాకుండా సమాజంలో శాంతి, ఐక్యతను పెంపొందించే కేంద్రాలుగా నిలుస్తాయని వివరించారు.

## జిన్నారంలో 42 డిగ్రీలు



**జిన్నారం, మే 4 (వుదయం ప్రతినిధి) :** జిన్నారం మండలంలో ఎండలు దంచి కొడుతున్నాయి. పగటిపూట ఉష్ణోగ్రతలు ఏకంగా 43 డిగ్రీలకు చేరుకోవడం విశేషం. దీంతో మండలంలోని అన్ని గ్రామాల్లో నిప్పుల కొలిమిని తలపిస్తోంది. దీంతో మధ్యాహ్నం సమయంలో బయటకు వచ్చేందుకు జనం జంకుతున్నారు. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు గరిష్ట ఉష్ణోగ్రతలు 42.8 డిగ్రీలుగా నమోదయ్యాయి. భారీ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

## పోచమ్మ తల్లి వార్షికోత్సవం



**వట్టిపల్లి మే 4 (వుదయం ప్రతినిధి):** మండల పరిధిలోని పోతుల బొగుడ గ్రామంలో పోచమ్మ తల్లి ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ దంపతులు హాజరై బోనాలు సమర్పించారు మొక్కులు చెల్లించుకుని ప్రత్యేక పూజలు చేశారు క్రాంతి కిరణ్ మాట్లాడుతూ పోచమ్మ తల్లి దీవెనలు మనందరిపై ఉండాలి అందరూ సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో జీవించాలి అని తల్లిని ప్రార్థించారు వీరి వెంట పోతులబొగుడ సర్పంచ్ రాజు నాయకులు మాడవీరన్న శ్రీశైలం మాణిక్య శివయ్య శ్రీకాంత్ అనిల్ ప్రభు రాజు తదితరులు పాల్గొన్నారు.

## రైతు వేదికలో రైతు వారోత్సవాలు

### భూసార పరిరక్షణ, సమతుల్య ఎరువుల వినియోగంపై అవగాహన



**దౌల్తాబాద్, మే 4 (వుదయం):** దౌల్తాబాద్ మండలంలోని దొమ్మాట రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతుల వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి దొమ్మాట సర్పంచ్ అంజయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాసిం, సూరంపల్లి ఆత్మ కమిటీ డైరెక్టర్ రాజమణి, సిద్దిపేట భూసార పరీక్ష కేంద్ర వ్యవసాయ అధికారి శ్రీనివాస్, వ్యవసాయ విస్తరణ అధికారి సంతోష్ కుమార్ హాజరయ్యారు. రైతులు నర్రా రాజేందర్, కొమ్ము రాజు, కాస నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అధికారులు భూసార పరిరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. భూమి నమూనాలు సేకరించి పరీక్షలు చేయించుకోవడం ద్వారా మట్టిలోని పోషకాల స్థితి తెలుసుకొని, భూసార ఆరోగ్య కార్డు (సాయిల్ హెల్త్ కార్డ్) ఆధారంగా పంటలకు అవసరమైన ఎరువులను సరైన మోతాదులో వినియోగించాలని సూచించారు. నత్రజని (ఎన్), ఫాస్పరస్ (పీ), పొటాష్ (కే) వంటి ప్రధాన పోషకాలతో పాటు జింక్, ఐరన్ వంటి సూక్ష్మ పోషకాల అవసరాన్ని వివరించారు.

సమతుల్య ఎరువుల నిర్వహణలో భాగంగా “4ఆర్ విధానం” (సరైన ఎరువు, సరైన సమయం, సరైన మోతాదు, సరైన విధానం) పాటించడం ద్వారా ఎరువుల వృథా తగ్గి పంట దిగుబడులు పెరుగుతాయని తెలిపారు. రసాయన ఎరువులతో పాటు పశువుల ఎరువు, వానపాముల ఎరువు, జీవ ఎరువులు వంటి సేంద్రియ ఎరువులను వినియోగించడం వల్ల నేల సారవంతత మెరుగుపడుతుందని చెప్పారు.

అలాగే భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి పంట మార్పిడి విధానం (క్రాప్ రొటేషన్), పచ్చి ఎరువుల పంటలు, కవరింగ్ పంటలు సాగు చేయాలని సూచించారు. నీటి వనరులను సమర్థంగా వినియోగించేందుకు బిందు సేద్యం, తుంపర సేద్యం వంటి నీటి ఆదా పద్ధతులను పాటించాలని తెలిపారు.

నిగ్రాణి సమితుల పాత్రపై కూడా వివరించి, గ్రామాల్లో ఎరువుల సరఫరా, ధరల నియంత్రణలో రైతులు చురుకుగా పాల్గొని ఎలాంటి అక్రమాలు గమనించిన వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కార్యక్రమంలో రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, వారు తక్షణ పరిష్కార మార్గాలను సూచించారు. రైతులు ఈ కార్యక్రమాన్ని ఉపయోగకరంగా అభిప్రాయపడ్డారు.

## లబ్ధిదారుల ఇంటర్వ్యూలు

**దౌల్తాబాద్, మే 4 (వుదయం):** ఎస్సీ కార్పొరేషన్ 202526 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆన్లైన్ దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి అఫ్జలొద్దీన్ తెలిపారు. ఈ ఇంటర్వ్యూలు ఈ నెల 7వ తేదీ గురువారం ఉదయం 10:30 గంటలకు దౌల్తాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో జరుగనున్నాయని ఆయన పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన అర్హులైన అభ్యర్థులు తమ తమ గ్రామాల వారీగా సంబంధిత బ్యాంకు మేనేజర్ల సమక్షంలో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు తప్పనిసరిగా దరఖాస్తుతో పాటు అవసరమైన పత్రాలను వెంట తీసుకురావాలని తెలిపారు. ఈ ఇంటర్వ్యూల ద్వారా అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి, వారికి ఆర్థిక సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అభ్యర్థులకు సూచించారు.

ఇంటర్వ్యూకు గైర్హాజరైన వారికి తదుపరి అవకాశం ఉండకపోవచ్చని అందువల్ల ప్రతి అభ్యర్థి సమయానికి హాజరు కావాలని మండల అభివృద్ధి అధికారి స్పష్టం చేశారు.



## డిమాండ్ ఉన్న పంటను రైతులు సాగు చేయాలి



**దుబ్బాక,వుదయం (మే 04):** సిద్దిపేట జిల్లా లింగాపూర్ గ్రామ రైతులు పంట మార్పిడితో అధిక లాభాలు పొందుతున్నారు. దొడ్డు రకం నుంచి సన్న రకం వరి పంట పండించడంతో, మార్కెట్లో హాట్ కేకుల్లా ధాన్యం అమ్ముడుపోతుందన్నారు. రైతులను కలిసిన దుబ్బాక వ్యాపారవేత్త చింతరాజు, పంట మార్పిడే రైతుకు మేలని సూచిస్తూ, రైతులతో కలిసి పంట సాగు విషయాలను తెలుసుకున్నారు. దూల్మిట్ట మండలం లింగాపూర్ గ్రామం ఇప్పుడు సన్న వరి సాగుకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. గ్రామంలో ప్రతి రైతూ ఎన్ఎల్ఆర్, కెఎన్ఎం, ఆర్ఎన్ఆర్ రకం సన్న వరినే పండిస్తున్నారు. ఈ విత్తనాలు ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుంటాయని, తెగులు సమస్య ఉండదని రైతులు చెబుతున్నారు. రసాయనాలు, యూరియా వాడకం పంటకు తక్కువగా వాడుతామని అన్నదాతలు వెల్లడించారు. రైతులు పండించిన ధాన్యాన్ని నేరుగా క్షేత్ర స్థాయిలోకి వెళ్లి పరిశీలించడం సంతోషంగా ఉందన్నారు. "దొడ్డు రకం కన్నా సన్న రకానికే దిగుబడి ఎక్కువ వస్తోంది. ఒక ఎకరానికి 28 నుండి 35 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. మార్కెట్లో డిమాండ్ కూడా ఉందని ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేస్తున్నారని రైతులు వెల్లడించారు." గతంలో దొడ్డు రకం వరి పండించిన ఈ గ్రామ రైతులు, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా 2011 నుండి అందరూ రైతులు కలిసి సన్న రకానికి మారడం జరిగిందన్నారు. కొనుగోలు సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేవని తెలిపారు. 30 కేజీల సన్న వరి విత్తన బస్తాతో రెండు ఎకరాల వరకు పంట సాగు చేయవచ్చని అన్నారు. "ప్రతి రైతు మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంట మార్పు చేయాలి. సన్న వరికి డిమాండ్ పెరగడంతో పాటు అధిక లాభాలు వస్తాయి.

**సబ్సిడీపై విత్తనాలు అందిస్తా : చింతరాజు**

దుబ్బాక నియోజకవర్గంలో కూడా సన్న వరి సాగును ప్రోత్సహిస్తాం. 2500 విత్తన బస్తాలను రైస్ మిల్ అసోసియేషన్ ద్వారా బుక్ చేసి, ప్రతి బస్తాపై 200 రూపాయల సబ్సిడీతో రైతులకు పంపిణీ చేస్తామని ప్రముఖ వ్యాపారవేత్త చింతరాజు వెల్లడించారు." పంట మార్పిడితో రైతు బతుకు మారుతోందని, మార్కెట్ డిమాండ్ తెలుసుకొని సాగు చేస్తే నష్టాల బారి నుంచి బయటపడవచ్చని లింగాపూర్ రైతులు నిరూపించడంపై ఆనందం వ్యక్తం చేశారు.

## మిరుదొడ్డి తై బజార్ వేలం



**దుబ్బాక, వుదయం (మే 04) :** సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రంలో కూరగాయల మార్కెట్ తై బజార్ వేలంపాట ముగిసింది. 95 వేల రూపాయలకు గ్రామానికి చెందిన గొల్ల రాములు వేలం దక్కించుకున్నారు. మిరుదొడ్డి మండల కేంద్రంలోని కూరగాయల మార్కెట్ తై బజార్ వేలంపాటను సర్పంచ్ వెలుముల మహేశ్వరి దేవరాజ్, ఉపసర్పంచ్ కరుణాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేలంపాటలో గ్రామానికి చెందిన గొల్ల రాములు 95 వేల రూపాయలకు తై బజార్‌ను దక్కించుకున్నారు. గ్రామానికి చెందిన గొల్ల రాములుకు వేలం రావడం సంతోషంగా ఉందని, మార్కెట్ నిర్వహణ సక్రమంగా జరుగుతుందని ఆశిస్తున్నామని తెలిపారు. వేలం దక్కించుకున్న గొల్ల రాములు త్వరలో మార్కెట్ నిర్వహణ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఫహీం, వార్డు సభ్యులు , గ్రామ నాయకులు అంజిరెడ్డి పలువురు పాల్గొన్నారు.

## హనుమాన్ ఆలయంలో ఆధ్యాత్మిక వేడుకలు

### మాలధారణ అత్యంత శ్రేష్టం
### ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి



**గజ్వేల్, మే 04 (వుదయం ప్రతినిధి)** సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని ప్రసిద్ధ వాగుగడ్డ హనుమాన్ దేవాలయంలో హనుమాన్ మాలధారణ చేసిన స్వాముల పూజా కార్యక్రమాలు సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు ప్రతాప్ రెడ్డి నాయకులు శ్రీనివాస్ జయసింహారావు తదితరులు కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం వారు మాట్లాడుతూ భక్తిమార్గంలో హనుమాన్ మాలధారణ చేయడం అత్యంత శ్రేష్టమని ఆంజనేయ స్వామి అనుగ్రహంతో లోకమంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు వాగుగడ్డ ఆలయంలో గత అనేక సంవత్సరాలుగా దాతల సహకారంతో మాలధారణ చేసిన స్వాములకు నిరంతర అన్నప్రసాద వితరణ జరుగుతోందని తెలిపారు ప్రతి ఏటా శ్రీరామనవమి నుండి హనుమాన్ జయంతి వరకు ఆలయంలో విశేష పూజలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు యువత చిన్నతనం నుండే దైవభక్తి సేవాభావం పెంపొందించుకోవాలని నిరంతర నామస్మరణతోనే మానసిక ప్రశాంతత ముక్తి లభిస్తాయని పేర్కొన్నారు స్వామివారి కృపతో భక్తుల కోరికలు నెరవేరుతాయని ఈ సందర్భంగా వారు ఆశాభావం వ్యక్తం చేశారు దేవాలయ ప్రాంగణంలో జరుగుతున్న మహా అన్నప్రసాద కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.



## ధాన్యం కేంద్రాలపై నిరంతరం పర్యవేక్షించాలి



**సంగారెడ్డి, ఏప్రిల్ 04 (వుదయం):** వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అధికారులు కొనుగోలు కేంద్రాలను నిరంతరం సందర్శిస్తూ సమగ్ర పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మణ్ కుమార్ మరియు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, అకాల వర్షాల ప్రభావం నేపథ్యంలో వరి ధాన్యం కొనుగోలు అంశంపై సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యం వల్ల రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు కేంద్రాల వద్ద ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి, రైతుల ఖాతాల్లో సకాలంలో చెల్లింపులు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని, కొనుగోలు ప్రక్రియను ఎటువంటి ఆటంకాలు లేకుండా సజావుగా నిర్వహించాలని ఆదేశించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అనంతరం సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయా శాఖల అధికారులు కొనుగోలు కేంద్రాలను తరచూ సందర్శించి పరిస్థితులను సమీక్షిస్తూ నివేదికలు సమర్పించాలని తెలిపారు. రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే వివరాలను ఓపీఎంఎస్ లో నమోదు చేసి, వారికి సకాలంలో చెల్లింపులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అకాల వర్షాల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో తగిన సదుపాయాలు కల్పించి, ధాన్యం రక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, శాఖల మధ్య సమన్వయం పెంచి పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని సూచించారు. సరైన ప్రణాళికతో కొనుగోలు ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మాధురి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి, డి.ఆర్.డి.ఓ, డి.సి.ఓ మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





" మాకు ఇది ఒక చారిత్రాత్మక దినం. ఇది ఒక అద్భుత విజయం... మేము ఆశించిన దానికంటే కూడా ఎంతో గొప్పది. కేరళలో మేము ఒక అద్భుతమైన ఫలితాన్ని చూస్తున్నాము; కేరళ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని స్పష్టమైంది. రాష్ట్రంలో మార్పు తీసుకురావడం మా పార్టీ లక్ష్యం. నేను చాలా సంతోషంగా ఉన్నాను. మేం అనుకున్నదానికంటే మెరుగ్గా ఉన్నాం. సునాయాసంగా మెజారిటీ సాధిస్తామని భావిస్తున్నాం. ప్రస్తుతం మా దగ్గర తగినంతమంది పోటీదారులు ఉన్నారు. ఫలితాల తరువాత కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గెలిచిన ఎమ్మెల్యేలతో మాట్లాడ తారు. హైకమాండ్ నిర్ణయం తీసుకుంటుంది. "

* శశిథరూర్, కాంగ్రెస్ ఎంపి


## వే'మన'పద్యం

వేరుపురుగుచేరి వృక్షంబుజెరచును

చీడపురుగు జేరి చెట్టుజెరచు

కుత్సితుండుచేరి గుణవంతు జెరచురా

విశ్వదాభిరామ! వినురవేమ



## సంపాదకీయం

# మార్పు కోరిన తీర్పు

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కేవలం గెలుపు ఓటములను మాత్రమే నిర్ణయించడం లేదు, రాజకీయ సరళిని పునర్నిర్మిస్తున్నాయి. తమిళనాడు నుంచి పశ్చిమ బెంగాల్ వరకు, కేరళ నుంచి అస్సాం వరకు, ఈ ఫలితాలు రానున్న కాలంలో ప్రాంతీయ, జాతీయ రాజకీయాలను పునర్నిర్మించగల అనేక తొలి సంఘటనలకు సంకేతాలు ఇస్తున్నాయి. ఈ ఎన్నికలలో అధికార వ్యతిరేకత అనే సాంప్రదాయ సూత్రం కొన్ని పార్టీలకే వర్తించినట్లు కనిపించింది. దక్షిణ, తూర్పు రాష్ట్రాలకు చెందిన ప్రాంతీయ పార్టీల అధినేతలు, దీర్ఘకాలిక కూటములు ఓటర్ల వ్యతిరేకతను ఎదుర్కొని ఇబ్బంది పడుతుండగా, భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఈ ధోరణికి అతీతంగా ఒక ప్రత్యేకమైన శక్తిని ప్రదర్శించింది. ఇప్పటికే ఉన్న తన బలమైన కోటలను పటిష్ఠం చేసుకోవడం, సరిహద్దు ప్రాంతాల్లోకి దూకుడుగా విస్తరించింది. స్థిరపడిన అధికార వ్యవస్థలకు వ్యతిరేకంగా రాజకీయ పవనాలు మారినప్పుడు కూడా విజృంభించే పార్టీ గా ఈ కాషాయ పార్టీ తనను తాను నిలబెట్టు కుంది.2026 ఎన్నికలలో, అధికార వ్యతిరేకత అనేది పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళలలో స్పష్టంగా కనిపించింది. ఇక్కడ పాలనపై ప్రజల అసంతృప్తి అధికారంలో ఉన్నవారికి అడ్డంకులు సృష్టించింది. ఈ రాష్ట్రాలలో, ఓటర్లు కొత్త నాయకత్వం కోసం కోరికను ప్రదర్శించారు, అయితే, అస్సాం, పుదుచ్చేరిలలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ పనితీరును బట్టి చూస్తే, అది స్థానిక ప్రచారం, ప్రాంతీయ అసంతృప్తిని అధిగమించే జాతీయవాద కథనం కలయిక ద్వారా ప్రభుత్వ వ్యతిరేకతను తటస్థీకరించవచ్చని స్పష్టమవుతోంది. బీజేపీ దీనిని బాగా ఉపయోగించుకుంది. బీజేపీ విజయం కేవలం దాని సంస్థాగత యంత్రాంగం వల్ల మాత్రమే కాదని, రాష్ట్ర ఎన్నికలను జాతీయ ప్రగతి, వికసిత్ భారత్ దార్శనికతపై ప్రజాభిప్రాయ సేకరణగా మలచగల దాని సామర్థ్యం వల్ల కూడా సాధ్యమైందని పరిశీలకులు అంటున్న మాటలను కొట్టిపారేయలేం. అస్సాంలో, అభివృద్ధి హామీలను ప్రాంతీయ భద్రతతో సమతుల్యం చేస్తూ, మార్పు కంటే కొనసాగింపు సురక్షితమని ఓటర్లను ఒప్పించి, ఆ పార్టీ తన పట్టును నిలుపుకుంది. మరోవైపు, పశ్చిమ బెంగాల్‌లో కేవలం మూడు సీట్లతో ప్రారంభమై, అధికారం కోసం పోటీపడే ఒక బలమైన పోటీదారుగా మారింది. తృణమూల్ కాంగ్రెస్ విధానానికి ప్రధాన ప్రత్యామ్నాయంగా తనను తాను నిలబెట్టుకోవడం ద్వారా, పాలకవర్గం పట్ల ఉన్న వ్యతిరేకతను విజయవంతంగా తనకు అనుకూలంగా మలుచుకుని గెలుపును నమోదు చేసింది. పుదుచ్చేరిలో అధికారాన్ని నిలబెట్టుకుని, దక్షిణ తీరప్రాంతంలో తన ఉనికిని మరింత పటిష్ఠం చేసుకుంది.తమిళనాడులో నటుడు విజయ్ టీవీకే పార్టీ భారీ విజయంతో ఆశ్చర్యాన్ని కలిగించగా, కేరళలో వరుసగా అధికారాన్ని దక్కించుకోవాలన్న ఎల్‌డీఎఫ్ ప్రయత్నానికి యువతరం నుండి ఎదురుదెబ్బ తగిలింది. సాంప్రదాయ వామపక్ష ఆర్థిక విధానాలపై వారికి కలిగిన నిరాశ వారిని కాంగ్రెస్ వైపు చూసేలా చేసింది. ఈ మార్పు కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్‌కు తిరిగి పుంజుకోవడానికి, బీజేపీకి అక్కడ భవిష్యత్తులో పాగా వేయడానికి అవకాశం కల్పించింది. ప్రస్తుతానికి కేరళ విజయం, ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీని రాజకీయంగా బలోపేతం చేసేందుకు ఉపయోగపడనుంది.

## రచనలు పంపండి



వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# వ్యవసాయ పరిశోధనల్లో నిర్లక్ష్యం

పంటల మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలా లేదా అన్న అంశంపై నాలుగేండ్ల నాడు వేసిన కమిషన్ ఏం చేస్తోందో తెలియదు. వ్యవసాయం గిట్టుబాటు కావాలంటే మద్దతు ధరలతో పాటు దిగుబడి పెంపుదల, సాగు ఖర్చుల తగ్గింపు గురించి అనేక మంది చెప్పటం తెలిసిందే. పోనీ దానికైనా గడచిన పన్నెండేళ్లలో మోడీ సర్కార్ ఏమైనా చేసిందా ? వ్యవసాయ రంగంలో పరిశోధన మరియు అభివృద్ధి తీరుతెన్నులు, ప్రభుత్వాలు చేస్తున్న ఖర్చు గురించి రోమ్ నగరంలో ఉన్న ప్రపంచ ఆహార మరియు వ్యవసాయ సంస్థ(ఎఫ్ఏఓ) ఏప్రిల్ 30వ తేదీన ఒక నివేదికను విడుదల చేసింది. సభ్యదేశాల ప్రభుత్వాలు అందచేసే సమాచారం మేరకు 2023వరకు ఉన్న వివరాల ప్రకారం రూపొందించిన నివేదిక. గడచిన రెండు దశాబ్దాలలో ఏటా 1.8శాతం చొప్పున పరిశోధనకు ఖర్చు పెరుగుతూ 50.4 బిలియన్ డాలర్లకు చేరింది.వర్తమాన సహస్రాబ్ది తొలి పదేండ్లలో విస్తరణ మందకొడిగా ఉందని, 2009తరువాత పెరిగిందని గమనించారు.రైతే రాజు, దేశానికి వెన్నెముక, రైతులేనిదే రాజ్యం లేదు వంటి మాటలు ఎన్నో విన్నాం. ఏం జరిగింది, కడుపు చించుకుంటే కాళ్ల మీద పడుతుంది. ఇంటర్నేషనల్ జర్నల్ ఎన్విరాన్‌మెంటల్ అండ్ అగ్రికల్చర్ రిసర్చ్(ఐజెఓఇఏఆర్) 2026 మార్చినెల సంచిక, పేజీ 126లో దిగువ వివరాలు ఉన్నాయి. పంట ఉత్పత్తి అంకెలను మిలియన్ మెట్రిక్ టన్నులుగా, దిగుబడి హెక్టారుకు టన్నులుగా గమనించాలి.చైనాలో మనకంటే సాగుభూమి తక్కువ, అయినా మొత్తం 69.కోట్ల టన్నుల ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేస్తుంటే మనం 35.4కోట్ల టన్నులు చేసి చైనా కంటే మన జనాభా అదనంగా ఉన్నప్పటికీ అవసరానికి మించి పండిస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటున్నాం.

పిండికొద్దీ రొట్టె అన్న పెద్దలే కుండలో కూడు కుండలోనే ఉండాలి పిల్లాడు దుడ్డులా పెరగాలంటే కుదరదని కూడా చెప్పారు. జనాభా అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తిని పెంచటంతో పాటు రైతాంగానికి గిట్టుబాటు కావాలంటే దిగుబడులను కూడా అధికంగా సాధించాలి. అందుకు పెట్టుబడి, శాస్త్రవేత్తలు కావాలి. ప్రపంచంలో 2004లో 2,04,000 మంది వ్యవసాయ శాస్త్రవేత్తలు ఉంటే 2023నాటికి 3,16,000కు పెరిగారు. మనదేశంలో పరిస్థితి ఏమిటి ? పూర్తికాలం పని చేసే పరిశోధకుల సంఖ్య రెండువేల సంవత్సరంలో 11,154 మంది ఉంటే 2018లో 11,372 మంది ఉన్నారు. అదే చైనాలో ప్రస్తుతం 43వేల మంది పని చేస్తున్నారు.శాస్త్రవేత్తల సంఖ్యను బట్టే వారి మీద పరిశోధన ఖర్చుకూడా ఉంటుంది. అది అధిక దిగుబడి వంగడాలు, తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పండించటం మీద కూడా ప్రభావం చూపుతుంది.పారిశ్రామిక, ఐటి రంగాలకు అవసరమైన చౌక (కార్మికులు) ఇంజనీర్ల సృష్టి మీద చూపిన శ్రద్ధ అధికారంలో ఎవరున్నా వ్యవసాయం మీద పెట్టలేదు. ఎందుకంటే కోట్లాది మంది రైతుల కంటే లక్షల మంది పారిశ్రామిక, వాణిజ్యవేత్తల మీద ఉన్న శ్రద్ధ ఎక్కువ. అందుకే వ్యవసాయ రంగం ఇలా దిగజారిపోతున్నది, వ్యవసాయం గిట్టుబాటుగాక, అప్పులపాలైన రైతాంగ ఆత్మహత్యల గురించి వింటున్నాం.ఇతర రంగాల్లో అలాంటి పరిస్థితి లేనందుకు సంతోషమే గానీ ఇంకా ఎంతమంది రైతాంగాన్ని బలిపెట్టాలన్నదే ప్రశ్న.

దేశంలో జరిగిన అనర్థాలన్నింటికీ గాంధీ, నెహ్రూలే కారణం అని కాషాయ దళాలు నిరంతరం దుమ్మెత్తి పోస్తుంటాయి.వారి పూర్వీకులు బ్రిటీష్ వారి సేవకు బదులు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని నాయకత్వ స్థానాలకు వచ్చి ఉంటే పరిస్థితి వేరుగా ఉండేది కదా, ఎందుకు ఆ పని చేయలేదో చెప్పగలరా ? పోనీ వాజ్‌పాయి, ఇప్పుడు నరేంద్రమోడీ ఏలుబడిలో పరిశోధన అభివృద్ధి రంగాలకు నిధులు ఎందుకు కేటాయించలేదు, ఇతర దేశాలతో ఎందుకు పోటీపడటం లేదో అయినా చెప్పాలి.ఎవరు అడ్డుకున్నారు.వేదాల్లోనే అన్నీ ఉన్నాయిష అని లొట్టలు వేసుకుంటూ చెప్పుకొనేవారి ఒళ్లో కూర్చుని రెండువేల సంవత్సరాల నాడే భారత్‌లో ప్లాస్టిక్ సర్జరీ చేశారని, వినాయకుడికి ఏనుగు తల అమర్చటం దానికి నిదర్శనమని స్వయంగా ప్రధాని నరేంద్రమోడీ చెప్పిన సంగతి తెలిసిందే. అదే బాటలో గోమూత్రం తాగితే కాన్సర్ నయమౌతుందని బిజెపి ఎంపీ ప్రజ్ఞాసింగ్ సెలవిచ్చినదాన్నీ దేశం చూసింది. ఆంధ్రా విశ్వవిద్యాలయ ఉపకులపతిగా ఉన్న నాగేశ్వరరావు ఇంకా ముందుకు పోయి మహాభారత కాలంలోనే టెస్ట్ ట్యూబ్ బేబీ పరిజ్ఞానంతో 100 మంది కౌరవులు ఒకే తల్లికి జన్మించారని కూడా చెప్పారు. అదే నిజమైతే పాండవులు వేర్వేరు తండ్రులకు ఎలా పుట్టారని ఎవరైనా ప్రశ్నిస్తే హిందూ వ్యతిరేకులని చిత్రిస్తారు. ఇలాంటి మూఢనమ్మకాలు ఉన్నవారు శాస్త్రపరిశోధనలను ప్రోత్సహిస్తారా ? అమెరికాలోని లోవా విశ్వవిద్యాలయం చెప్పిన కొన్ని అంశాలను చూద్దాం.ఓయిసిడి సమాచారం(2022) ప్రకారం 2000-2002 మధ్య వ్యవసాయ పరిశోధనలకు అమెరికా, భారత్,బ్రెజిల దేశాలలో ఒక బిలియన్ డాలర్లకు అటూ ఇటూగా ప్రభుత్వాలు ఖర్చు చేశాయి.అదే 2019-21నాటికి చైనా ఖర్చు ఏడాదికి 1.3 నుంచి 6.6బిలియన్లకు పెరిగింది. అమెరికా,భారత్,బ్రెజిల్ చేసిన మొత్తం ఖర్చు కంటే చైనాలో ఎక్కువగా ఉంది.

దశాబ్దాల పాటు కొనసాగిన ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసి తన అజెండాకు అనుగుణంగా వ్యవహరించేందుకు నీతి అయోగ్‌ను నరేంద్రమోడీ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.పరిశోధన మరియు అభివృద్ధికి నిధులు కేటాయిస్తే గాంధీ, నెహ్రూలు



అడ్డుకొని ధర్నాలకు దిగిన ఉదంతాలేమీ లేవు.నీతి అయోగ్ 2025లో విడుదల చేసిన పదకొండవ పత్రంలో ఏం చెప్పిందో తెలుసా ! 1995-96లో కేంద్ర ప్రభుత్వం జిడిపిలో అన్ని రకాల పరిశోధనలకు కేటాయించిన మొత్తం 0.61 శాతం కాగా 2005-06లో అది 0.81కి పెరిగింది. నరేంద్రమోడీ అధికారానికి వచ్చిన తరువాత 2015-16లో 0.69శాతం, 2020-21లో 0.64శాతానికి పతనమైంది.వ్యవసాయ పరిశోధనలకూ ఇదే గతి అని వేరే చెప్పనవసరం లేదు.జిడిపిలో కనీసం రెండు శాతం కేటాయించాలని గతంలో ప్రణాళికా సంఘం సిఫార్సు చేసింది.దీని గురించి మోడీ ఎప్పుడైనా ఎక్కడైనా ఏ రూపంలో అయినా ఎందుకు మాట్లాడటం లేదు ? ప్రపంచ బ్యాంకు సమాచారం ప్రకారం 2020లో తలసరి పరిశోధన పెట్టుబడి ఇజ్రాయెల్ 2,438 డాలర్లతో ప్రపంచంలో అగ్రగామిగా ఉండగా, తరువాత 2,192 డాలర్లతో అమెరికా,తొమ్మిదవ స్థానంలో ఉన్న చైనా 250, పద్నాలుగవ స్థానంలో 13 డాలర్లతో మనం ఉన్నాం. వీటినే అదే ప్రపంచ బ్యాంకు మరోవిధంగా చెప్పింది. జిడిపిలో ఇజ్రాయెల్ 5.4, అమెరికా 3.5శాతం కేటాయించగా చైనా 2.4, మనదేశం 0.7శాతం కేటాయించింది.అంతేనా ప్రభుత్వ రంగంలో మొత్తం పరిశోధనా సంస్థలు అమెరికా 727, చైనాలో 353, భారత్‌లో 18 ఉన్నట్లు ప్రపంచ బ్యాంకు నివేదిక అంశాలను నీతి అయోగ్ తన పత్రంలో పేర్కొన్నది. ఇంత దరిద్రంగా ఉంటే మన పారిశ్రామిక, వ్యవసాయ ఉత్పత్తుల దిగుబడులు ఎలా పెరుగుతాయి, నాణ్యతలో ప్రపంచంలో ఎలా పోటీపడతాయి ? మోడీ విధానాలతో 2047నాటికి దేశం ఎక్కడికో పోతుందని నమ్మే వారు దేశంకోసం-ధర్మం కోసం బుర్రలు పెట్టి ఆలోచించాల్సిన అవసరం లేదా ! నరేంద్రమోడీ ఇజ్రాయెల్ పర్యటన జరిపి ఏం నేర్చుకొని వచ్చారు.ఇజ్రాయెల్ పితృస్వామికం, మనది మాతృస్వామికం అని చెప్పారు.దీని మీద సామాజిక మాధ్యమాల్లో జనాలు ఎంతగా అపహాస్యం చేశారో తెలిసిందే. అక్కడి నుంచి నేర్చుకున్నది ఏమిటి అంటే పాలస్తీనా ప్రాంతాలలో ఇజ్రాయెల్ యూదులను ఎలా ప్రవేశ పెట్టి జనాభా నిష్పత్తిని ఎలా మార్చివేసిందో, కాశ్మీరులో కూడా అలాగే చేయాలని ప్రయోగాలు చేసింది.పెగాసెస్ సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకు వచ్చి విమర్శనాత్మకంగా ఉండే మీడియా, రాజకీయంగా విభేదించే పార్టీల నేతల సమాచారాన్ని దొంగచెవులతో వినేందుకు చూసింది, వివిధ దేశాల్లో హంతక దళాలతో హత్యలు ఎలా చేయించవచ్చో నేర్చుకున్నది తప్ప మరొకటి కాదు.

చరిత్రలో నరేంద్రమోడీ ఏ ప్రధానీ వెళ్లనన్ని సార్లు చైనా వెళ్లారు, దాని నేతలతో భేటీ అయ్యారు.పోనీ చైనా నుంచి అయినా నేర్చుకున్నారా అదీ లేదు. ఓయిసిడి నివేదిక ప్రకారం 2019-21 సంవత్సరాలలో చైనా వ్యవసాయ ఉత్పత్తుల విలువ 1.6లక్షల కోట్ల డాలర్లు, అమెరికాలో 0.4,భారత్ విలువ 0.2లక్షల కోట్ల డాలర్లు మాత్రమే.మనదేశంతో పోలిస్తే చైనా విస్తీర్ణం చాలా ఎక్కువ, దానిలో 10.6శాతం 1.02మిలియన్ల చదరపు కిలోమీటర్లలో మాత్రమే వ్యవసాయం చేస్తున్నారు. అదే మనదేశంలో 52.8శాతం భూమి 1.69మిలియన్ చదరపు కిలోమీటర్లలో సాగు చేస్తున్నాం.అయినా మన ఉత్పత్తి విలువ తక్కువగా ఎందుకుందో చైనాలో ఎక్కువ ఎందుకో ఎప్పుడైనా మోడీ తెలుసుకున్నారా ! ప్రపంచం మొత్తంలో ఉన్న భూమిలో 11.6శాతం మాత్రమే సాగులో ఉంది,భారత్ అగ్రస్థానంలో ఉండగా అమెరికాలో 17.1, రష్యాలో 7.4శాతంలో వ్యవసాయం చేస్తున్నారు. ఇప్పటి వరకు వ్యవసాయ రంగంలో పరిశోధనలకు ప్రభుత్వ రంగం చేస్తున్న ఖర్చు గురించే మాట్లాడుకున్నాం. ప్రైవేటు రంగం కూడా ఇటీవలి సంవత్సరాల్లో పరిశోధనలకు ఖర్చు చేస్తున్నది.అది గుత్త సంస్థలకు మాత్రమే లాభాలు చేకూర్చుతున్నది తప్ప అందరికీ కాదు. దాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటే మొత్తం వ్యవసాయ పరిశోధనల్లో అమెరికా అగ్రస్థానంలో ఉంటుంది.అక్కడ ప్రభుత్వ ఖర్చు తగ్గుతున్నది. చైనాలో ప్రైవేటు పరిశోధనలు దాదాపు లేవు.భారత్,బ్రెజిల్, ఐరోపా యూనియన్‌లో పెరుగుతున్నాయి.

ప్రైవేటు రంగం కేంద్రీకరణ అంతా మార్కెట్లో గిరాకీ, లాభం ఉన్నవాటి మీదే ఉంటుంది. ప్రభుత్వ పెట్టుబడులు తగ్గటం వలన టిఎఫ్‌పి(టోటల్ ఫ్యాక్టర్ ప్రొడక్టివిటీ) సూచిక అమెరికాలో ఇటీవలి కాలంలో ఆరుశాతం తగ్గింది.దీని అర్థం ఏమిటంటే పదేండ్ల కాలంలో ఉత్పాదకత అమెరికాలో లాభసాటిగా లేదు.అందుకే పెద్ద ఎత్తున ప్రభుత్వం సబ్సిడీలు ఇచ్చి అక్కడి ఉత్పత్తులను ఇతర దేశాల మార్కెట్లలో గుమ్మరించేందుకు అదిరింపులు, బెదరింపులు చేస్తున్నది మనువాదులు, సనాతనులుగా చెప్పుకొనేందుకు గర్వపడుతున్నవారు ఇటీవలి కాలంలో వేదాల్లోనే అన్నీ ఉన్నాయష అనే వాదనలను ముందుకు తెస్తున్నారు.జర్మన్ హిట్లర్‌తో సహా పలువురు విదేశీయులు వివిధ రూపాల్లో వచ్చి మన పురాణాలు, వేదాలను తమ దేశాలకు తీసుకుపోయి వాటిలో ఉన్న విజ్ఞానాన్ని తస్కరించి తమవిగా చెప్పుకొని అనేక ఆవిష్కరణలు చేశారని చెప్పేవారి సంగతి తెలిసిందే.

అదే నిజమైతే మనం ఆ విజ్ఞానాన్ని ఆవిష్కరించటానికి బదులు సమాజానికి అజ్ఞానాన్ని ఎందుకు పంచినట్లు ?ఆంగ్లేయులు ఇతర ఐరోపా వారు మనదేశానికి రాకముందే ఐరోపాలో పారిశ్రామిక విప్లవం వచ్చింది, తరువాతే వారి అదనపు ఉత్పత్తులను అమ్ముకొనేందుకు మనతో సహా ప్రపంచాన్ని ఆక్రమించుకున్నారు. పురాణాల్లో ఉన్న కొన్నింటికి ఆధునిక గణిత, శాస్త్రసిద్ధాంతాలను అంటగడుతూ ఇవన్నీ గతంలోనే మనవారికి తెలుసని గతం గురించి గొప్పలు చెప్పుకుంటాయి కాషాయ దళాలు, వాటి తప్పుడు ప్రచారాన్ని తలకు ఎక్కించుకున్నవారు వింత వింతగా ప్రవర్తిస్తున్నారు. చైనా కమ్యూనిస్టు దేశం, అక్కడ ప్రజాస్వామ్యం లేదు, ఏక పార్టీ నియంతృత్వం, దాని విధానాలు మనకు పనికి రావు, చైనీయులు కాపీ కొడతారు అని సొల్లు కబుర్లు చెబుతారు.కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని, సోషలిస్టు వ్యవస్థను ఏర్పాటు చేయాలని కమ్యూనిస్టులు చెబుతున్నమాట నిజం. కానీ ఉత్పత్తులు ఎలా చేయాలో, పంటలు ఎలా పండించాలో నేర్చుకొనేందుకు ఆడలేక మద్దె ఓటిగా ఉందని సాకుచెప్పినట్లుగా సిద్ధాంతాలతో పనేముంది ?అన్నీ అందరికీ తెలియవని మన పురాణాలే చెబుతున్నాయి. కుమారిల భట్టు వేదపండితుడే అయినప్పటికీ మిగతా అంశాల గురించి తెలియదు.

బౌద్ధం, జైనుల తత్వశాస్త్రం గురించి అధ్యయనం చేయటానికి వారి ఆశ్రమాలకు మారువేషంలో వెళ్లి అధ్యయనం చేసి తరువాత వాదించాడని చెబుతారు.ఆదిశంకరుడు సైతం పరకాయ ప్రవేశ విద్య ద్వారా కామకళా శాస్త్రాన్ని నేర్చుకొని ఉభయ భారతీదేవితో వాదించి ఆమె భర్త మండన మిశ్రుని శృంగేరి మొదటి పీఠాధిపతిగా నియమించినట్లు చెబుతారు. ఇక్కడ సమస్య ఏమంటే మన ఘనాపాటీలు, సంస్కృత పండితులు ఇంతవరకు వాటిలో ఉందని చెబుతున్న విజ్ఞానాన్ని బయటకు తీయలేదు, నూతన ఆవిష్కరణలు చేయలేదు.ఇప్పటికైనా ఆదిశంకరుల మాదిరి పరకాయ ప్రవేశం చేసిన చైనా, ఇతర దేశాల నుంచి దేశం కోసం-ధర్మం కోసం దేశభక్తులుగా మారి ఆధునిక యుద్ధ విమానాల సాంకేతిక పరిజ్ఞానాలను సేకరిస్తారా ? పారిశ్రామిక,వ్యవసాయ రంగంలో వృద్ధికి తోడ్పడతారా ? పడక కుర్చీల కాలక్షేపపు కబుర్లు చెబుతూనే ఉంటారా ?

| పంటపేరు | ×× భారత ఉత్పత్తి | ×× చైనా ఉత్పత్తి | ××× భారత దిగుబడి | ×× చైనా దిగుబడి |
|---|---|---|---|---|
| వరి | ×× 147-150 | ×× 145 | ××× 4.3 | ×× 7.1 |
| గోధుమ | ×× 113-117 | ×× 140 | ××× 3.5 | ×× 5.5 |
| మొక్కజొన్న | × 35 | ×× 280 -290 | ××× 3.2 | ×× 6.1 |
| సోయాబీన్ | ×× 12-13 | ×× 20 | ××× 1.2 | ×× 1.9 |
| బంగాళ దుంప | ×× 60 | ×× 95 | ××× 24 | ×× 33 |



ఎం కోటేశ్వరరావు
8331013288

# సమ్మెతాడుకు ప్రాణం వేలాడవద్దు

సమ్మెలు వస్తుంటాయి, పోతుంటాయి. సమ్మె విజయమో, విరమణో జరగాలి తప్ప ప్రాణాలను కోరవద్దు. ఆ పరిస్థితిని యాజమాన్యాలు రానీయవద్దు. 2019 లో తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులు 52 రోజుల సమ్మె నడుస్తుండగా ఇద్దరు కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారు. గుండెపోటు, మతిస్థితి మితం తప్పి కొందరు చనిపోయారు. తెలంగాణ ఆవిర్భావం తరువాత ఓ పీడ కలలాంటి సమ్మె అది. పరిస్థితులను తట్టుకోలేక మొత్తం 36 మంది తమ సహోద్యోగులు చనిపోయారని ఆనాటి టీఆర్టీసి ఐకాస ప్రకటించింది. అయితే ఏది వద్దని అందరు అనుకున్నారో అదే సంఘటన ఈసారి సమ్మెలోనూ తప్పలేదు. సమ్మె రెండో రోజున నర్సంపేట డిపో డ్రైవర్ శంకర్ గౌడ్ ఎవరు లేని చోటుకెళ్ళి శరీరాన్ని అంటించుకొని ఆత్మాహుతికి పాల్పడ్డారు. సాధారణంగా ఎవరైనా ఇంట్లో గొడవ వల్లనో, వ్యసనాలతో చెడిపోయో, తప్పుడు పనులు చేసో, అప్పుల పాలయో ఆత్మహత్యకు సిద్ధపడతారు. యాజమాన్యపు వైఖరికి నిరసనగా, సామూహిక స్వప్నాన్ని సాకారం చేసే ఉద్దేశ్యమైనా ఒక ఉద్యోగి తన్నుతాను చంపుకోవడం అంటే అది తొందరపాటు చర్యనే. ప్రభుత్వానికి వణుకు పుట్టించినా ఆ నెత్తుటి కూడు ఎవరు కోరుకోరు.

దేశంలో ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు జరిగాయి. స్వాతంత్రోద్యమంలోను ప్రజలు నిరసనలు చేపట్టారు తప్ప ప్రాణాలు తీసుకోలేదు. గ్రామాల్లో భూస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఎదురు తిరిగారు తప్ప శరీరాల్ని కాల్చుకోలేదు. ఆందోళనలతో పాటు నిరాహార దీక్షలు ప్రభుత్వాలపై ఒత్తిడిగా పనికొస్తాయి. అయితే తీవ్ర నిర్ణయంతో ఒంటిపై పెట్రోలు పోసుకొని అంటించుకోవడం, ఉరి వేసుకోవడం అనేవి సరిదిద్దుకోలేని దారుణమైన సంఘటనలు. సమ్మెలు వస్తుంటాయి, పోతుంటాయి. కానీ పోయిన ప్రాణాలు తిరిగి రావు. డిమాండ్లను పరిష్కరించే ప్రభుత్వం ఆర్థిక భారాన్ని మోయగలదు కానీ మనిషిని తెచ్చివ్వలేదు.

*తెలంగాణ రాష్ట్ర సాధనలో తీవ్ర నిరాశలో యువత ఆత్మత్యాగాలు చేసుకున్నారు. ఆ గర్భశోకం తెలంగాణ తల్లులకు తెలుసు. ఈ సమ్మె ఆర్టీసీ సమ్మె డ్రైవర్ శంకర్ గౌడ్ ప్రాణబలిని తీసుకుంది. 2019 లోని వారి వైఫల్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ సమ్మె విషయంలో ప్రభుత్వం సామరస్యంగా వ్యవహరించి ఉండాల్సింది. ఒళ్ళంతా కాలిపోయినా శంకర్ గౌడ్ నిలబడి నడవగలిగాడు. బతుకుతాడనిపించింది. హాస్పిటల్ కు వెళ్ళాక మరణ వాంగ్మూలం కోసం పోలీసులు ప్రయత్నించారు. ఆయనకు గొంతు పెగలలేదు. పైకి గాయాలే కనిపించినా మంట వేడికి శరీరం లోపలి భాగాలు ఉడికిపోతాయి. 90 % కాలిపోయాడని డాక్టర్లు నిర్ధారించగానే అతను బ్రతుకుతాడన్న ఆశ పోయింది. అయితే ప్రభుత్వం దిగిరావడం వెనుక శంకర్ గౌడ్ అమరత్వం ఉన్నదనే కఠోర వాస్తవం ఒప్పుకోవాలి.*

తెలంగాణ రాష్ట్ర సాధనలో తీవ్ర నిరాశలో యువత ఆత్మత్యాగాలు చేసుకున్నారు. ఆ గర్భశోకం తెలంగాణ తల్లులకు తెలుసు. ఈ సమ్మె ఆర్టీసీ సమ్మె డ్రైవర్ శంకర్ గౌడ్ ప్రాణబలిని తీసుకుంది. 2019 లోని వారి వైఫల్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ సమ్మె విషయంలో ప్రభుత్వం సామరస్యంగా వ్యవహరించి ఉండాల్సింది. ఒళ్ళంతా కాలిపోయినా శంకర్ గౌడ్ నిలబడి నడవగలిగాడు. బతుకుతాడనిపించింది. హాస్పిటల్ కు వెళ్ళాక మరణ వాంగ్మూలం కోసం పోలీసులు ప్రయత్నించారు. ఆయనకు గొంతు పెగలలేదు. పైకి గాయాలే కనిపించినా మంట వేడికి శరీరం లోపలి భాగాలు ఉడికిపోతాయి. 90 % కాలిపోయాడని డాక్టర్లు నిర్ధారించగానే అతను బ్రతుకుతాడన్న ఆశ పోయింది. అయితే ప్రభుత్వం దిగిరావడం వెనుక శంకర్ గౌడ్ అమరత్వం ఉన్నదనే కఠోర వాస్తవం ఒప్పుకోవాలి. అసలైన మూడు డిమాండ్లు ఒప్పుకోలేమని చెప్పిన ప్రభుత్వం అన్నిటికి సరే అంది. ఏటా రూ. వేయి కోట్ల ఆర్థిక భారానికి సిద్ధపడింది. విలీనం, యూనియన్ గురించి చర్చించుకొని రమ్మంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనను ఆర్టీసీ నాయకులు కలిసే అవకాశం ఇచ్చారు. పీత కష్టాలు పీతవి అన్నట్లు ఆర్టీసీ నష్టాలకు వివిధ కారణాలు ఉన్నాయి. దానికి ఉద్యోగులు బాధ్యులు కారు. నష్ట ప్రభావం ఉద్యోగులపై పడితే వారి కుటుంబాలు గడిచేదెట్లా? రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాలతో పోల్చితే ఆర్టీసీ ఉద్యోగుల జీతాలు అందులో సగం కూడా ఉండవు. పెరిగిన ఇంటి ఖర్చులు, తప్పక చేసిన అప్పులు.. వాటికి తోడు సమ్మె కాలంలో యాజమాన్యపు నిర్లక్ష్యం కలగలిసి ప్రెషర్ కుక్కర్ లాంటి ఒత్తిడిని తెచ్చి ప్రాణాంతక స్థితికి తీసుకెళుతాయి. ఆర్టీసీ ఉద్యోగుల బతుకులు నిత్యం కష్టాల ఎదురీతలే. జీవితాల్లో సర్కారీ ఉద్యోగి ఆనవాలు ఒక్కటీ కనిపించదు. ఒకటికి రెండు డ్యూటీలు చేస్తూ గానుగెద్దులా బస్సు ఎక్కడం దిగడమే వారి బతుకు. పది మందిలో ఉన్నా దారి తెలియని అడవిలో చిక్కుకున్నట్లు ఎప్పుడూ ఆదరాబాదరా. శరీరం తట్టుకోలేని పని, కుటుంబానికి సరిపోని ఆదాయం. సుమారు ముప్పై అయిదు వేల మంది ఉన్నా బస్టాండుల్లో కలిసేది వన్ బై టు చాయ్ తాగే దాకానే. ఏ ఇద్దరు ఆర్టీసీ ఉద్యోగులు మధ్యనా చాలని జీతం ముచ్చటో, దొరకని లీవు సంగతో చర్చకు వస్తుంది. సగం తాగిన బీడీని విసిరేసినట్లు బాధల ఏకరువుని మధ్యలోనే వదిలేసి వారు గడియారంలో పోటీ పడక తప్పదు. పగలనక రాత్రనక విసిరేసినట్లు ఎవరిదారిన వారు వెళ్లే వీరు ఒక నిరసనకైనా ఒక్క మాట మీదికి రావడానికే ఎంతో కాలం పడుతుంది. అందరిని ఒప్పించి సమ్మె దాకా తీసికెళ్ళడమంటే నాయకులకు అదో భగీరథ ప్రయత్నం. ఉన్న అరకొర జీతంలో కోత తప్పదనే బెంగ వెనక్కి లాగుతుంది. అయినా టిఆర్టీసీ ఉద్యోగులు ఒక్కతాటిపైకి వచ్చి సమ్మెకు దిగారంటే వారి కష్టాలు భరింపలేనివి అయ్యాయన్నట్లే. రెండు సమ్మెల్లోనూ ఉద్యోగులు ప్రాణాల మీదికి తెచ్చుకున్నారంటే అన్ని సమ్మెలు వేరు ఆర్టీసీ సమ్మె వేరు అనుకోవాలి. అందుకే చర్చల్లో ఒప్పుకున్న ఉద్యోగుల డిమాండ్లను తాత్సారానికి ఆస్కారమివ్వకుండా సకాలంలో సాకారం చేయవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.



బి.నర్సన్
9440128169

# ప్రసూతిలో మంత్రసానుల పాత్ర

ప్రసూతి సమయంలో గర్భిణీ స్త్రీలకు సహాయం చేయడం గురించి ఆచరణాత్మక జ్ఞానం ఉన్న మహిళలను మంత్రసానులు (Midwives) అంటారు. ప్రాచీన కాలంలో ప్రపంచంలో ఆస్పత్రులు మరియు గర్భిణీ స్త్రీలకు తగిన ఆరోగ్య సదుపాయాలు లేనప్పుడు, తల్లులు ఇంట్లోనే శిశువులకు జన్మనివ్వడంలో మంత్రసానులు సహాయం చేసేవారు. మానవ మనుగడలో వారి సేవలకు తరతరాల చరిత్రే ఉంది. తొలుత పోర్చుగీస్ దేశీయులు నర్సుల వ్యవస్థను ఇండియాకు తెచ్చారు. 'ఈస్ట్ ఇండియా కంపెనీ' ఆధ్వర్యంలో మొదటి నర్సింగ్ స్కూలును 1871లో చెన్నైలో స్థాపించారు. కాలక్రమంలో వైద్యవృత్తిలో నర్సులు అంతర్భాగమయ్యారు. నర్సింగ్ వృత్తి స్థాపకురాలుగా, నర్సింగ్ వ్యవస్థకే మూలపుటమ్మగా బ్రిటిష్ సంఘ సంస్కర్త ఫ్లోరెన్స్ నైటింగేల్‌ను పరిగణిస్తారు. మంత్రసానులను గుర్తించడానికి, అభినందించడానికి ఒక రోజును గుర్తించాలనే ఆలోచన 1987 లో నెదర్లాండ్స్‌లో జరిగిన ఇంటర్నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ మిడ్‌వైవ్స్ సమావేశం నుండి వచ్చింది. 1992 నుంచి ప్రతి సంవత్సరం మే 05 వ తేదీన అంతర్జాతీయ మంత్రసాని దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ప్రస్తుతం ఈ వేడుకలో సుమారు 50 దేశాలు భాగంగా ఉన్నాయి. మంత్రసానుల పనిని గౌరవించటానికి రోజును ఆచరిస్తారు. శిశువులు సురక్షితంగా ప్రసవించడంలో సహాయపడే మంత్రసానుల సహకారంపై దృష్టి పెట్టడం, వారి స్థితిగతులపై అవగాహన పెంచడం, మంత్రసానుల వృత్తిని గౌరవించడం అంతర్జాతీయ మంత్రసాని దినోత్స వం ముఖ్య ఉద్దేశ్యం. నైపుణ్యం కలిగిన మంత్రసానిలు శతాబ్దాలుగా మహిళలకు, శిశువులకు అందిస్తున్న సేవలు అమూల్యాలు. స్వాతంత్ర్యానికి పూర్వమే దేశంలో 'మంత్రసానుల' వ్యవస్థ ప్రాచుర్యంలో ఉండేది. ఆధునిక ఆరోగ్య సదుపాయాలు లేని ఆ రోజుల్లో తల్లీబిడ్డల యోగక్షేమాలను మంత్రసానులే చూసేవారు. నేటికీ ఆదివాసీ, గ్రామీణ సమూహాల్లో పురుడు పోయడం, బాలింతల ఆరోగ్య సంరక్షణలో మంత్రసానుల పాత్ర అమోఘం. మంత్రసాని గర్భిణీ తల్లులకు సరైన సంరక్షణ ఇస్తూ, ప్రసవ సమయంలో సహాయం చేస్తూ, ఒక్కోసారి తమ అనుభవాలతో పునర్జన్మ ప్రసాదిస్తున్న సంఘటనలు చర్విత చర్వణం అవుతున్నాయి. మంత్రసానిలు ఎంతో నైపుణ్యాలు కలిగిన వారు. గర్భం, శ్రమ, ప్రసవ సమయంలో, అలాగే ప్రసవానంతర కాలంలో బాలింతలకు, నవజాత శిశువులకు ప్రధాన సంరక్షకులు. మంత్రసానులను గ్రామీణ ప్రాంతాలలో అపర దేవతా మూర్తులుగా భావించడం చూస్తున్నాం. ఆ వృత్తికి దక్కిన ఎనలేని గౌరవమది. ఇదంత సులువైన పని కాదు. వృత్తిపరమైన నైపుణ్యాలు అవసరం. చెదరని చిరునవ్వుతో ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొంటూ రకరకాల పరిస్థితులలో సేవలు అందజేయాలి. తోబుట్టువులు, రక్త సంబంధీకులు చేయలేని పనులను సైతం వీరు సహనంతో చేస్తూ వృత్తి ధర్మాన్ని పాటిస్తున్నారు. మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, "ప్రపంచ వ్యాప్తంగా, అన్ని సెట్టింగులలో, సంరక్షణ నాణ్యతను అందించడానికి మంత్రసానులు చాలా అవసరం." ఒక మంత్రసాని శిక్షణ పొందిన ప్రొఫెషనల్, గర్భిణీ తల్లులకు సరైన సంరక్షణ ఇస్తుంది, ప్రసవ సమయంలో వారికి సహాయం చేస్తుంది. అంతర్జాతీయ మంత్రసాని దినోత్సవం సందర్భంగా, మంత్రసానిల పనిని గురించి ప్రముఖుల అభిప్రాయాల గురించి మననం చేసుకోవాలి.



సంగనబట్ల
9440595494



# జాతీయం- అంతర్జాతీయం



## రాజకీయ యవనికపై నుంచి
# అదృశ్యమవుతున్న ఎర్ర పార్టీలు?

**వుదయం డెస్క్, మే 4 :**



కేరళలో ఎల్‌డిఫి ఓటమితో వామపక్ష పార్టీల అస్తిత్వం, ఉనికి కనుమరుగైపోయిందన్న భావన కలుగుతోంది. ఆదర్శ సిద్ధాంతంతో ఒక నాడు భారత రాజకీయాల్లో ఒక వెలుగు వెలిగిన వామపక్ష పార్టీలు నేడు ఏ రాష్ట్రంలోనూ అధికారంలో లేని పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. 1970, 80వ దశకాల్లో పలు రాష్ట్రాలలో అధికారాన్ని కలిగి ఉన్న వామపక్ష పార్టీలు ఇప్పుడు నిల్ అనే స్థాయికి చేరుకున్నాయి. నిజానికి ఈ ఐదు దశాబ్దాల్లో ఇటువంటి రాజకీయ శూన్యం ఏర్పడటం తొలిసారి అనవచ్చేమో. దాదాపు మూడు దశాబ్దాలు రాష్ట్రాన్ని పాలించి, 2011లో తృణమూల్ కాంగ్రెస్ చేతిలో పరాజయం పాలైన తర్వాత కూడా కేరళలో అధికారాన్ని నిలుపుకుంది. కానీ, దాని చివరి కంచుకోట అయిన కేరళలోనూ లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) అధికారం కోల్పోవడంతో కమ్యూనిస్టు పార్టీల భవిష్యత్తుపై చర్చ జరగడం సహజమే.

కేరళలో పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం వెనుకంజలో ఉండగా, కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) స్పష్టమైన ఆధిక్యంతో దూసుకుపోతోంది. ఈ ఫలితాలు ఇలాగే కొనసాగితే, వామపక్షాలు దేశంలో ఏ రాష్ట్రంలోనూ అధికారంలో లేని చారిత్రక ఘట్టం ఆవిష్కృతమవుతుంది. ఈ నేపథ్యంలో తిరువనంతపురంలోని కాంగ్రెస్ కార్యకర్తలు ఇప్పటికే సంబరాలు ప్రారంభించారు.

**నాడు దేశ రాజకీయాల్లో కీలకం..**
**నేడు అధికారం శూన్యం**

ఒకప్పుడు జాతీయ రాజకీయాల్లో వామపక్షాలు కీలక పాత్ర పోషించాయి. 1996లో సీపీఎం అగ్రనేత జ్యోతి బసు యునైటెడ్ ఫ్రంట్ తరపున ప్రధానమంత్రి అయ్యే అవకాశం వచ్చినా, పార్టీ పొలిట్‌బ్యూరో ఆ ప్రతిపాదనను తిరస్కరించింది. దీనిని ఆయన తర్వాత 'చారిత్రక తప్పిదం'గా అభివర్ణించారు. 2008లో మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వానికి వామపక్షాలు మద్దతు ఉపసంహరించుకోవడంతో ప్రభుత్వం పార్లమెంటులో విశ్వాస పరీక్షను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆ సమయంలో పశ్చిమ బెంగాల్, కేరళ, త్రిపురలలో మూడు రాష్ట్రాల్లో లెఫ్ట్ పార్టీలు అధికారంలో ఉన్నాయి.

**భారత రాజకీయాల్లో**
**సుదీర్ఘ చరిత్ర గల వామపక్షాలు**

భారత రాజకీయాల్లో కమ్యూనిస్టులది సుదీర్ఘ, ప్రభావవంతమైన చరిత్ర. 1957లో కేరళలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన తొలి కమ్యూనిస్టు ప్రభుత్వంగా ప్రపంచ రికార్డు సృష్టించారు. ఇక, పశ్చిమ బెంగాల్‌లో 1977 నుంచి 2011 వరకు ఏకధాటిగా 34 ఏళ్లు పాలించి, దేశంలోనే సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న పార్టీగా చరిత్రకెక్కారు. జ్యోతి బసు ఒక్కరే 23 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. అలాగే, త్రిపురలోనూ 1993 నుంచి మాణిక్ సర్కార్ నేతృత్వంలో వరుస విజయాలు సాధించి తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించారు.

**వామపక్షాల ప్రాభవం ఎందుకు తగ్గుతోంది**

అయితే, గత దశాబ్ద కాలంగా వామపక్షాల ప్రాభవం క్రమంగా తగ్గుతూ వచ్చింది. సింగూర్, నందిగ్రామ్ భూసేకరణ ఉద్యమాల నేపథ్యంలో 2011లో పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ చేతిలో లెఫ్ట్ ఫ్రంట్ అధికారాన్ని కోల్పోయింది. ఆ తర్వాత 2018లో బీజేపీ ప్రభంజనంలో త్రిపుర కోట కూడా బద్దలైంది. దీంతో కేరళ ఒక్కటే వామపక్షాలకు చివరి ఆశగా మిగిలింది. 2021లో రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చి పినరయి విజయన్ సంచలనం సృష్టించారు. అయితే, తాజా ఎన్నికల ఫలితాలు ప్రతికూలంగా ఉండటంతో వామపక్షాల పాలన శకం తాత్కాలికంగా ముగింపు దశకు చేరుకున్నట్లేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## అధికారులు తమను తాము సూపర్ సిజెఐలుగా
# భావించుకుంటున్నారని సుప్రీం వ్యాఖ్య

**ఈడీకి నోటీసు జారీ చేయనందుకు సుప్రీంకోర్టు రిజిస్ట్రీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ధర్మాసనం**

**న్యూఢిల్లీ, మే 4 (వుదయం) :**



తన సొంత బ్యాక్‌ఆఫీస్‌పై అరుదైన, తీవ్రమైన విమర్శలు చేస్తూ, సుప్రీంకోర్టు సోమవారం నాడు అత్యున్నత కోర్ట్ రిజిస్ట్రీపై విరుచుకుపడింది. వారి ప్రవర్తనను దుష్టమైనదిగా అభివర్ణిస్తూ, అక్కడి అధికారులు తాము సూపర్ చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియాలా వ్యవహరిస్తున్నామని భావిస్తున్నారని పేర్కొంది. దాదాపు రూ. 37వేల కోట్ల ఆరోపిత పెట్టుబడి మోసం కేసులో నిందితురాలైన ఆయుషీ మిట్టల్ అలియాస్ ఆయుషీ అగర్వాల్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ విచారిస్తున్న సమయంలో ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తి జోయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.

ఈ పిటిషన్ పై మార్చి 23న జారీ చేసిన ఉత్తర్వులను ప్రస్తావిస్తూ, ఆ పిటిషన్‌పై ధర్మాసనం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు ,ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేయలేదని రిజిస్ట్రీ అధికారులు ఏ విధంగా భావించారోనని ఆశ్చర్యకరంగా ఉందని పేర్కొంది. రిజిస్ట్రీ చాలా దుర్మార్గంగా ప్రవర్తిస్తోందని సిజెఐ అన్నారు. చాలా దుర్మార్గపు రిజిస్ట్రీ ఇది, ఇక్కడ కూర్చున్న ప్రతి ఒక్కరూ తమను తాము సూపర్ భారత్ ప్రధాన న్యాయమూర్తిగా పరిగణించుకుంటున్నారు అని ఆయన అన్నారు. అలాంటి ఉత్తర్వు ఏదీ జారీ చేయలేదని పేర్కొంటూ ఈడీ డైరెక్టర్‌కు నోటీసు జారీ చేయలేదు. మా మార్చి 23వ తేదీ ఉత్తర్వు ఈడీకి నోటీసు ఇచ్చినట్లు ఎలా కాదో తెలుసుకోవడానికి (సుప్రీంకోర్టు) రిజిస్ట్రార్ జ్యుడీషియల్ ద్వారా వాస్తవ నిర్ధారణ విచారణ చేపట్టాలి. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు నోటీసు జారీ చేయాలి బెంచ్ అని తన తాజా ఉత్తర్వులో ధర్మాసనం పేర్కొంది. పిటిషనర్ ఆయుషి మిట్టల్, ఆమె భర్త, వారి సంస్థ ఒక భారీ పెట్టుబడి మోసానికి సూత్రధారులుగా వ్యవహరించారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. నిధుల మొత్తంలో గణనీయమైన భాగాన్ని పెట్టుబడిదారులకు తిరిగి చెల్లించామని డిఫెన్స్ పేర్కొంటున్నప్పటికీ, ఈడీ ప్రస్తుతం స్తంభింపజేసిన బ్యాంకు ఖాతాలలో మాత్రం వందల కోట్ల రూపాయలు స్తంభింపచేసి ఉన్నాయి.

పిటిషనర్‌కు, ఆమె విస్తృత కుటుంబానికి చెందిన అన్ని చర, స్థిర ఆస్తులను సక్రమంగా జప్తు చేశారా లేదా అని నిర్ధారించడమే దీని ఉద్దేశ్యం. ఆస్తుల సమగ్ర వివరణ అందించే వరకు బెయిల్ పిటిషన్‌లోని యోగ్యతలను పరిగణనలోకి తీసుకోబోమని ధర్మాసనం పునరుద్ఘాటించింది.

పిటిషనర్, ఆమె భర్త, వారి పిల్లలు, తల్లిదండ్రులు, తోబుట్టువులు, అత్తమామలకు చెందిన స్థిరాస్తుల వివరాలను సమగ్రంగా అందిస్తూ ఒక వివరణాత్మక అఫిడవిట్‌ను దాఖలు చేయాలని ధర్మాసనం పిటిషనర్ న్యాయ ప్రతినిధిని ఆదేశించింది.

అంతేకాకుండా, కంపెనీ డైరెక్టర్లు, నిర్వాహకులు, కీలక సిబ్బందికి సంబంధించిన ఆస్తుల వివరాలను కూడా అది కోరింది.

అటువంటి పూర్తి వివరాలు అందించే వరకు, బెయిల్ పిటిషన్‌ను దాని యోగ్యతల ఆధారంగా మేం పరిగణించం, అని ధర్మాసనం పేర్కొంది. కోర్టు గత ఆదేశాలను ఎందుకు విస్మరించారో గుర్తించేందుకు, రిజిస్ట్రీలోని పరిపాలనా లోపంపై విచారణ జరిపే బాధ్యతను జ్యుడీషియల్ రిజిస్ట్రార్‌కు అప్పగించారు. ఈ పిటిషన్‌ను మే నెలలో ఎప్పుడో అప్పుడు విచారణకు జాబితా చేస్తామని ధర్మాసనం తెలిపింది.

# రాజకీయ సరళిని పునర్నిర్మిస్తున్న ఎన్నికలు

**వుదయం డెస్క్, మే 4 :**



ఈ అసెంబ్లీ ఎన్నికలు కేవలం గెలుపు ఓటములను మాత్రమే నిర్ణయించడం లేదు, రాజకీయ సరళిని పునర్నిర్మిస్తున్నాయి. తమిళనాడు నుంచి పశ్చిమ బెంగాల్ వరకు, కేరళ నుంచి అస్సాం వరకు, ఈ ఫలితాలు రాబోయే సంవత్సరాలలో ప్రాంతీయ, జాతీయ రాజకీయాలను పునర్నిర్మించగల అనేక తొలి సంఘటనలకు సంకేతాలు ఇస్తున్నాయి.

**అగ్రగామి ఏడు ఘట్టాలు ఇవి:**

**తమిళనాడులో ద్వంద్వాధిపత్యానికి విరామం**

ఐదు దశాబ్దాలకు పైగా, తమిళనాడు రాజకీయాలు డీఎంకే వర్సెస్ ఏఐఏడీఎంకే అనే స్థిరమైన ద్వంద్వ కూటమి చుట్టూ తిరిగాయి. ఆ వ్యవస్థ ఇప్పుడు మౌలికంగా దెబ్బతింది.

ఇప్పటివరకు ఉన్న గణాంకాలు చూస్తే, విజయ్‌కి చెందిన టీవీకే కేవలం పోటీ పడటమే కాకుండా, ఈ రెండు ప్రధాన ద్రావిడ పార్టీలను అధిగమించి, డీఎంకేను మూడవ స్థానానికి నెట్టివేస్తున్నట్లు కనిపిస్తోంది. ఇది ఇటీవలి వరకు దాదాపు ఊహించలేని ఒక పరిణామం.

కేవలం ఒక మూడవ శక్తి ఆవిర్భావం మాత్రమే కాదు, కేడర్ నెట్‌వర్క్‌లు, సంక్షేమ రాజకీయాలు, సైద్ధాంతిక వారసత్వంపై నిర్మించిన, లోతుగా పాతుకుపోయిన రాజకీయ నిర్మాణం కూలిపోవడం కూడా దీనిని గతంలో లేని, తొలిసారి జరుగుతున్న ఘటనగా నిలుపుతోంది . కొందరువిశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఇది ఒక విస్తృతమైన ప్రభుత్వ వ్యతిరేక కల్లోలాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ క్రమంలో ఓటర్లు తమ వారసత్వ విధేయతలను ఒక్కసారిగా వదులుకోవడానికి సిద్ధంగా ఉండటం కూడా తొలిసారే.

**2. అతి పిన్న వయస్కుడైన ముఖ్యమంత్రి కాగలరా? విజయ్ ఘట్టం**

విజయ్ ఇటీవలి దశాబ్దాలలో తమిళనాడుకు చెందిన అతి పిన్న వయస్కుడైన ముఖ్యమంత్రులలో ఒకరిగా నిలిచే అవకాశం ఉంది, కానీ దీని ప్రాముఖ్యత కేవలం వయసుకు మించినది.

పొత్తులు లేదా శాసనసభ అనుభవం ద్వారా క్రమంగా ఎదగకుండా, తొలిసారిగా రాజకీయాల్లోకి ప్రవేశించిన వ్యక్తి అధికారానికి చేరువవ్వడం ఇన్ని సంవత్సరాలలో ఇదే మొదటిసారి. ఆయన ఎదుగుదల ఎంజీఆర్, ఎన్టీఆర్‌లను పోలి ఉన్నప్పటికీ, ఒక కీలకమైన తేడా ఉంది: ఆయన దీనిని ఒక పరివర్తన దశలో కాకుండా, రద్దీగా, పోటీగా ఉన్న సంకీర్ణానంతర యుగంలో సాధిస్తున్నారు.

టీవీకే మూడు అంకెల ఆధిక్యానికి దూసుకుపోవడం, సెలబ్రిటీ పలుకుబడి, అధికార వ్యతిరేకతతో కలిసినప్పుడు, అది తక్షణమే రాజకీయ ఆధిపత్యంగా ఎలా మారగలదో స్పష్టం చేస్తోందని 'ది ఎకనామిక్ టైమ్స్' పేర్కొంది.

**3. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ముందడుగు**

చారిత్రాత్మకంగా పశ్చిమ బెంగాల్, మొదట వామపక్షాల హయాంలో, ఆ తర్వాత తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) హయాంలో బీజేపీని ప్రతిఘటించింది. ఆ ప్రతిఘటన ఇప్పుడు విచ్చిన్నమయింది.

అధికారంలో ఉన్న టీఎంసీపై బీజేపీ నిర్ణయాత్మక ఆధిక్యాన్ని సాధించింది. ఇది రాష్ట్రంలో ఆ పార్టీకి అత్యంత బలమైన ప్రదర్శనగా నిలవడమే కాదు, బెంగాల్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి దానికి లభించిన మొట్టమొదటి నిజమైన అవకాశం.

ఇది చాలా ముఖ్యమైనది, ఎందుకంటే బిజెపి ప్రాంతీయ కంచుకోటను ఛేదించని చివరి ప్రధాన రాష్ట్రాలలో బెంగాల్ ఒకటిగా పరిగణిస్తున్నారు. ఇక్కడ సాధించే ఈ ముందడుగు, కాషాయ పార్టీ తూర్పు భారతదేశంలోకి విస్తరించడాన్ని, ఒక శక్తివంతమైన ప్రాంతీయ నాయకురాలు (మమతా బెనర్జీ) బలహీనపడటాన్ని, జాతీయ రాజకీయ సమతుల్యతలో మార్పును సూచిస్తుంది.

**4. బెంగాల్‌లో హిందూ ఏకీకరణ**

బీజేపీ విజృంభణతో ముడిపడి ఉన్న మరో తొలి పరిణామం ఇది. వివిధ ప్రాంతాలలో హిందూ ఓట్లు స్పష్టంగా ఏకీకృతం కావడం.

ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రకారం, గుర్తింపు, సరిహద్దు సమస్యలు, స్థానిక ఉద్రిక్త ప్రాంతాల చుట్టూ అల్లిన ప్రచార కథనాలు మరింత ఏకీకృత ఓటింగ్ సరళికి దారితీసినట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా, గిరిజన ప్రాంతాలు, జిల్లాలలో పలు ఎన్నికలలో బీజేపీ చేసిన ప్రచారం ఊపందుకుని, ఈ ఏకీకరణ జరిగినట్టు స్పష్టంగా కనిపిస్తోంది.

ఈ రకమైన ఏకీకరణ చాలా ముఖ్యమైనది, ఎందుకంటే బెంగాల్‌లో సాంప్రదాయకంగా పెద్ద ఎత్తున మతపరమైన అనుసంధానం కంటే, వర్గం, ప్రాంతం, స్థానిక నెట్‌వర్క్‌ల ఆధారంగా చీలిపోయిన ఓటింగ్ సరళి కనిపించేది.

ఈ మార్పు, మరింత ధృవీకృతమైన ఎన్నికల ప్రవర్తన వైపు పయనిస్తున్నట్లు సూచిస్తోంది. ఇది రాష్ట్ర రాజకీయాలపై దీర్ఘకాలిక పరిణామాలను కలిగి ఉండవచ్చు.

**5. కేరళలో వామపక్షాల పతనం**

కేరళ రాజకీయాలు చాలా కాలంగా లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్), కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ మధ్య ఊహించదగిన మార్పులతో నిర్వచితమయ్యాయి. ఈసారి, ఆ లయ దెబ్బతిన్నట్లు కనిపిస్తోంది. ఇప్పటివరకు ఉన్న గణాంకాలు వామపక్షాలు, ముఖ్యంగా సీపీఎం గణనీయంగా క్షీణించాయని, కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ స్పష్టమైన ఆధిక్యాన్ని సాధించిందని చూపిస్తున్నాయి.

దీనిని మొట్టమొదటి సంఘటనగా మార్చేది కేవలం ఓటమి మాత్రమే కాదు, ఎల్‌డిఎఫ్ పతనపు స్థాయి కూడా. ఇది వామపక్షాలపై బలమైన ప్రభుత్వ వ్యతిరేకతను, పాలన కథనాలకు అనుకూలంగా సైద్ధాంతిక రాజకీయాలు బలహీనపడే అవకాశాన్ని, కేరళ చారిత్రాత్మకంగా స్థిరమైన ఎన్నికల చక్రంలో ఒక విఘాతాన్ని సూచిస్తుంది.

ఇంకా ముఖ్యంగా, చిన్న పార్టీలు, బీజేపీ కూడా ఎంపిక చేసిన ప్రాంతాలలో ప్రత్యామ్నాయాలుగా తమను తాము నిలబెట్టుకోవడానికి ప్రయత్నిస్తూ, కొత్త రాజకీయ అవకాశాలుగా ఆవిర్భవిస్తున్నాయని విశ్లేషకులు పేర్కొన్నారు.

**6. అస్సాంలో బీజేపీ ఏకపక్ష ఆధిపత్యం**

అస్సాంలో బీజేపీ పనితీరు మరో నిర్మాణాత్మక మార్పును సూచిస్తోంది: సంకీర్ణాలపై ఆధారపడటం నుండి స్వతంత్ర ఆధిపత్యం వైపు.

ఇది వరుసగా మూడోసారి అధికారం చేపట్టడంతో పాటు, రాష్ట్రంపై తన పట్టును మరింత బలపరుచుకుంటోంది. ఈ ఆధిపత్య స్వభావమే దీనిని ఒక మొదటి పరిణామంగా నిలుపుతోంది. రాయిటర్స్ ప్రకారం, గతంలో విజయాలు ప్రధానంగా ప్రాంతీయ మిత్రపక్షాలపై ఆధారపడి ఉండేవి. ఈసారి, బీజేపీ సంస్థాగత బలం స్వయంసమృద్ధిగా కనిపిస్తోంది. ఇది ఈశాన్యంలో సంకీర్ణయుగ రాజకీయాల నుండి ఏకపార్టీ ఏకీకరణ వైపు పరివర్తనను సూచిస్తోంది.

ఇది, తన సాంప్రదాయ హిందీ ప్రాబల్యానికి ఆవల తన ఉనికిని విస్తరించి, స్థిరపరచుకోవాలనే బీజేపీ విస్తృత వ్యూహాన్ని కూడా సూచిస్తోంది.

**7. రికార్డు స్థాయి ఓటింగ్, నిశ్శబ్ద ఓటింగ్ - ఒక వైరుధ్యం**

సాధారణంగా కలిసి ఉండని ఈ రెండు విషయాలైన అత్యధిక ఓటింగ్ శాతం, ఓటర్ల తీవ్రమైన మౌనం రెండూ ఒకేసారి చోటుచేసుకోవడం, ఇక్కడి అత్యంత ఆశ్చర్యకరమైన 'మొట్టమొదటి' పరిణామాలలో ఒకటి.

పశ్చిమ బెంగాల్‌లో సుమారు 9293 శాతం ఓటింగ్ నమోదైంది, ఇది ఇప్పటివరకు నమోదైన అత్యధిక ఓటింగ్ శాతాలలో ఒకటి. అదే సమయంలో, ఓటర్లు తమ ఎంపికలను వెల్లడించడానికి అపూర్వంగా నిరాకరించారని పోల్‌స్టర్లు నివేదించారు. దీంతో యాక్సిస్ మై ఇండియా వంటి కొన్ని ఏజెన్సీలు ఎగ్జిట్ పోల్స్‌ను కూడా నిర్వహించకుండా ఉండవలసి వచ్చింది.

ఇది ఒక కొత్త ఎన్నికల సరళిని సృష్టిస్తోంది: బహిరంగంగా తమ వైఖరిని స్పష్టంగా చెప్పకపోయినా, అంతర్గతంగా నిర్ణయాత్మకంగా ఉండే అత్యంత చురుకైన ఓటర్లు. అధిక ఓటింగ్ శాతం అనగానే, సాధారణంగా బహిరంగంగా ఒక రాజకీయ సమీకరణతో ముడిపడి ఉండే మునుపటి ఎన్నికలతో పోలిస్తే ఇది ఒక పెద్ద మార్పు.

# టిఎంసి ఓటమికి కారణాలేమిటి?

**న్యూఢిల్లీ, మే 4 (వుదయం) :**

టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీని గద్దె దించి, రాష్ట్రంలో తొలిసారిగా అధికారంలోకి రావడం ద్వారా చరిత్ర సృష్టించడానికి భారతీయ జనతా పార్టీ (బిజెపి) సర్వసన్నద్ధమైంది. ప్రస్తుతం కాషాయ పార్టీ 180స్థానాలలో ముందంజలో ఉంది. రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కావలసిన 148 స్థానాలను అది దాటిపోయింది.

రాష్ట్రంలో 2011 నుంచి అధికారంలో ఉన్న టిఎంసి నేడు ప్రతిపక్షంలో కూర్చునే పరిస్థితులు రావడానికి కీలక అంశాలలో ప్రధానమైనవి చూద్దాం.

**1. ఎస్ఐఆర్ ప్రభావం**

వివాదాస్పదంగా మారిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఓటర్ల జాబితా సవరణే రాష్ట్రంలో ఎన్నికల ఫలితాలను నిర్ణయించడంలో ప్రధాన పాత్రను పోషించింది. సర్ కింద దాదాపు 91 లక్షల ఓటర్లను జాబితా నుంచి తొలిగించారు. దాదాపుగా 20వేల పేర్లను తొలిగించిన 28 స్థానాలు ఉన్నాయి. వీరి పేర్లను తీర్పు అనంతరం తొలిగించారు. వీటిలో భారతీయ జనతా పార్టీ (బిజెపి) ఎనిమిది స్థానాలలో ముందంజలో ఉంది.

**2. హిందూ ఓట్ల స్థిరీకరణ**

బిజెపి నాయకుడు, ప్రతిపక్ష నేత సువేందు అధికారి ప్రకారం హిందూ ఓట్లు స్థిరీకరమయ్యాయని, కాషాయ పార్టీ మెజారిటీ మార్కును దాటడమే అందుకు కారణమన్నారు.



ఈసారి హిందువుల స్థిరీకరణ జరిగింది. ముస్లింలు టిఎంసికి ఓటు వేసేవారు, కానీ ఈసారి వారు ఆ పని చేయలేదు. కొన్ని ఓట్లు ముస్లిం అనుకూల పార్టీలకు పడ్డాయి. బిజెపికి కూడా కొద్ది మొత్తంలో పడ్డాయి. నందిగ్రామ్‌లోని ముస్లిం బూత్‌లో ఇంత మంచి ఫలితాన్ని నేను ఊహించలేదని ఆయన ఇండియా టుడే ఛానెల్‌కు చెప్పారు.

**3. ప్రభుత్వ వ్యతిరేకత**

నాలుగవసారి కూడా అధికారాన్ని చేజిక్కించుకోవాలనుకున్న తృణమూల్‌కు ప్రభుత్వ వ్యతిరేకత ఎదురైంది. దాన్ని ఎదుర్కోవడంలో పార్టీ ఘోరంగా విఫలమైంది. దీనితో ఓటర్లకు ప్రత్యామ్నాయంగా బిజెపి ఉద్భవించింది.

**4. క్షీణిస్తున్న శాంతి, భద్రతలు**

ఇక రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయన్న ఆరోపణలను టిఎంసి ప్రభుత్వం ఎదుర్కొంది. ఆర్‌జి కర్ అత్యాచారం, హత్య కేసు, కోల్‌కతా లా కాలేజీలో సామూహిక అత్యాచారం కేసు మమత ప్రభుత్వాన్ని ప్రతికూల దృష్టితో చూసేలా చేశాయి.

**5. సెక్యులర్ ఓట్ల విభజన**

కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం ఒక్క స్థానంలో కూడా ముందంజలో లేదు. కాగా, ఈ పాత పార్టీ 292 స్థానాల్లో పోటీ చేసింది. బహుశ సెక్యులర్ ఓటు విభజనకు ఇదే కారణం కావచ్చు. అయితే, అంతిమ గణాంకాలు వెలువడిన తర్వాతే స్పష్టత వస్తుంది. కాంగ్రెస్‌కు ఎన్ని ఓట్లు పడ్డాయి, టిఎంసి ఎన్ని ఓట్లతో ఓడింది అనే విషయాలు తెలియడానికి సమయం పడుతుంది.

## తమిళనాడులో ఎన్టీఆర్ ఎంజీఆర్ నమూనాను
# విజయ్ అనుసరించారా?

**వుదయం డెస్క్, మే 4 :**

వెండితెర దిగ్గజం తలపతి విజయ్ తుఫానులా రాజకీయాల్లోకి అడుగుపెట్టడంతో, తమిళనాడు 2026 అసెంబ్లీ ఎన్నికలు ఒక రాజకీయ నాటకంగా మారాయి. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న వేళ, విజయ్ ఎవరూ ఊహించని రీతిలో దూసుకుపోతున్నారు. ఆయన కొత్త పార్టీ, తమిళగ వెట్రి కజగం (టీవీకే), తొలి ట్రెండ్స్‌లోనే 100కు పైగా స్థానాల్లో ఆధిక్యంలోకి దూసుకెళ్లి, డీఎంకే, ఏఐఏడీఎంకేలను సైతం వెనక్కి నెట్టివేసింది. ఈ నేపథ్యంలో ఎం.జి. రామచంద్రన్ (ఎంజీఆర్), ఎన్.టి. రామారావు (ఎన్టీఆర్) ల రాజకీయ ప్రవేశాలలాగా చారిత్రాత్మకంగా విజయ్ ప్రవేశం నిలిచిపోనుంది.

**ఎన్టీఆర్ 1983 ప్రభంజనం: ఆత్మగౌరవ నినాదంపై నిర్మితమైన రాజకీయ విప్లవం**

ఇప్పుడు విజయ్ చూపుతున్న రాజకీయ ప్రభావాన్ని, 1983లో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఎన్.టి. రామారావు (ఎన్టీఆర్) తీసుకువచ్చిన పరివర్తనతో పోలుస్తున్నారు. అప్పట్లో తెలుగు సినిమా రంగంలో ఒక దిగ్గజంగా వెలుగొందిన ఎన్టీఆర్, తెలుగు వారి ఆత్మ గౌరవం అనే శక్తివంతమైన నినాదంతో తెలుగుదేశం పార్టీని (టిడిపి) స్థాపించారు.

ఢిల్లీలోని హైకమాండ్ రాష్ట్ర నాయకత్వాన్ని అవమానించిందని భావించిన ఎన్టీఆర్, ఆగ్రహానికి గురై భారీ క్షేత్రస్థాయి ప్రచారాన్ని ప్రారంభించారు. ఆయన తన చైతన్య రథం అనే ప్రత్యేక చేవ్రొలెట్ వ్యాన్‌లో రాష్ట్రమంతటా పర్యటించి, దాదాపు 75,000 కిలోమీటర్లు ప్రయాణించారు. ఆయన వ్యాన్‌లోనే నిద్రపోతూ, గ్రామాల్లోనే భోజనం చేస్తూ ప్రజలకు దగ్గరగా ఉంటూ, ఓటర్లతో బలమైన భావోద్వేగ బంధాన్ని ఏర్పరచుకున్నారు. ఇప్పుడు, అంటే, 202526 మధ్యకాలంలో విజయ్ కూడా తమిళనాడులో తన విస్తృతమైన రోడ్‌షోల ద్వారా ఇదే విధమైన ప్రచారాన్ని అనుకరించారని అంటున్నారు.



1983 జనవరి 9న, 294 స్థానాలకు గాను 201 స్థానాలను గెలుచుకోవడం ద్వారా ఎన్టీఆర్ ఒక చారిత్రాత్మక విజయాన్ని సాధించారు. తద్వారా రాష్ట్రంలో దాదాపు మూడు దశాబ్దాల కాంగ్రెస్ పాలనకు తెర దించారు. ఆయన విజయం ఎంత విశేషమైనదంటే, 1984 నాటికే టిడిపి లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్షంగా అవతరించింది. ఆ కాలంలో ఒక ప్రాంతీయ పార్టీకి ఇది అపూర్వమైన ఘనత.

**ఎంజీఆర్ తమిళనాడు వారసత్వం:**

తమిళనాడులో, సినిమా రంగం నుండి రాజకీయాల్లోకి ప్రవేశించి అత్యంత ప్రభావశీలమైన వ్యక్తిగా నిలిచిన ఉదాహరణ ఎం.జి.రామచంద్రన్ (ఎంజీఆర్) మాత్రమే. ఒక ప్రణాళికాబద్ధమైన రాజకీయ ప్రవేశంలా కాకుండా, డిఎంకె పార్టీలో ఏర్పడిన ఒక చీలిక కారణంగానే ఆయన రాజకీయ ఎదుగుదల సాధ్యమైంది. 1972లో, పార్టీ కోశాధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సమయంలోనే, పార్టీ మంత్రుల ఆర్థిక జవాబుదారీతనాన్ని ఎంజీఆర్ బహిరంగంగా ప్రశ్నించారు.

ఈ చర్య కారణంగా 1972 అక్టోబర్ 10న ఆయన సస్పెండ్ అయ్యారు; ఇది ఆయన రాజకీయ ప్రస్థానంలో ఒక కీలక మలుపుగా నిలిచింది. ఆ వెంటనే, ఆయన అన్నా ద్రవిడ మున్నేట్ర కళగం (ఎడిఎంకె)ను స్థాపించారు.

సి.ఎన్. అన్నాదురైకి నిజమైన రాజకీయ వారసుడిగా తనను తాను నిలబెట్టుకుంటూ, సినిమాల ద్వారా లభించిన తన బలమైన 'ప్రజా నాయకుడి' ఇమేజ్‌ను ఉపయోగించుకుని, ఎంజీఆర్ ప్రజల నుండి అపారమైన మద్దతును కూడగట్టుకున్నారు. ఆయన ప్రజాదరణ ఎన్నికల విజయంగా రూపుదాల్చింది; 1977 నాటికి, ఆయన ఎఐఎడిఎంకెను 144స్థానాలతో ఘన విజయపథంలో నడిపించి, తమిళనాడు రాజకీయాల్లో తన ఆధిపత్యాన్ని సుస్థిరం చేసుకున్నారు.

**విజయ్ ఆకస్మిక రాజకీయ ప్రభంజనం**

రాజకీయ విశ్లేషకులు ఇంతకుముందు విజయ్‌ను కేవలం ఓట్లను చీల్చి, అంతరాయం కలిగించేవాడు అని అభివర్ణించారు, కానీ 100కు పైగా అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీవీకే తొలి ట్రెండ్ ఆధిక్యాలు అంతకంటే పెద్ద ప్రభంజనాన్ని సూచిస్తున్నాయి. ముక్కోణపు పోటీలో విజయ్ టీవీకే తొలి ట్రెండ్స్‌లో దూసుకుపోయి 100కు పైగా స్థానాల్లో ఆధిక్యంలో నిలిచింది, అని ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పేర్కొంది. ఈ క్రమంలో ఏఐఏడీఎంకే నేతృత్వంలోని కూటమి 70లలో వెనుకబడి ఉండగా, అధికార డీఎంకే మరింత వెనకబడింది. ఇది ఇకపై కేవలం ఒక అభిమాన సంఘం ప్రయోగం కాదని, రాజకీయ క్రీడను సమూలంగా మార్చే తీవ్రమైన అంశమని ఇది ధృవీకరిస్తోంది.

**ఫ్యాన్ క్లబ్ నుంచి టివికె వరకు**

2024 ఫిబ్రవరి 2న విజయ్ టివికెని లాంఛనంగా ప్రారంభించినప్పుడు, విమర్శకులు దానిని ఒక అభిమానుల క్లబ్ ప్రయోగం అని కొట్టిపారేశారు. అయినప్పటికీ, 2024 లోక్‌సభ ఎన్నికలకు బదులుగా 2026 అసెంబ్లీ ఎన్నికలపై దృష్టి సారించడం ద్వారా, విజయ్ ఒక దీర్ఘకాలిక వ్యూహాన్ని అనుసరించారు. సుమారు 84.8%గా నమోదైన అధిక ఓటింగ్ శాతం, గతంలో స్టార్‌డమ్ ఆధారిత నాయకులు చేసినట్లే, అతని ర్యాలీలు సినిమా అభిమానులను ఓటు వేసే పౌరులుగా మార్చాయని నిరూపిస్తుంది. 41 మంది ప్రాణాలు కోల్పోయిన కరూర్ తొక్కిసలాట, ఆ తర్వాత ఢిల్లీలో సీబీఐ విచారణ వంటివి దాని ఊపును దెబ్బతీసినప్పటికీ, టివికె ప్రచార శైలి దానిని నిరంతరం వార్తల్లో నిలిపింది.

**ఓటర్లను ఆకట్టుకున్న సంక్షేమ వాగ్దానాలు**

డీఎంకే లోపాలను లక్ష్యంగా చేసుకుని, టీవీకే ఒక స్పష్టమైన సంక్షేమ నమూనాతో ప్రచారం చేశారు. డీఎంకే 'మగళిర్ ఉరిమై తొగై' కి దీటుగా, విజయ్ తన తల్లులకు నాయకత్వం పథకాన్ని అందించారు. దీని కింద మహిళా నేతృత్వంలోని కుటుంబాలకు నెలకు రూ. 2,500, సంవత్సరానికి ఆరు ఉచిత ఎల్‌పిజి సిలిండర్లను అందిస్తారు. ప్రతి ఇంటికీ ఉద్యోగం' అనే ఆయన వాగ్దానంలో, తిరుచి, సేలం, తిరునెల్వేలి వంటి టైర్2 నగరాల్లో ఏఐ ఆధారిత టెక్ హబ్‌లను ఏర్పాటు చేయడం కూడా భాగంగా ఉంది. తమిళనాడులో నీట్‌ను శాశ్వతంగా తొలగిస్తానని, వైద్య ప్రవేశాలు కేవలం 12వ తరగతి మార్కుల ఆధారంగానే ఉండాలని ప్రతిపాదిస్తూ ఆయన చేసిన వాగ్దానానికి అత్యధిక ప్రశంసలు లభించాయి.

**తమిళనాడు రాజకీయాల్లో కొత్త అధ్యాయం**

తుది ఫలితాలు తొలి ట్రెండ్‌లను ప్రతిబింబిస్తే, 1983లో ఎన్టీఆర్ సృష్టించిన ఆంధ్ర ప్రభంజనం, 1977లో ఎంజీఆర్ తమిళనాడును కైవసం చేసుకున్న తీరును గుర్తుచేస్తూ, విజయ్ ఆధునిక భారత రాజకీయాల్లోని విశిష్ట వ్యక్తుల జాబితాలో చేరతారని విశ్లేషకులు అంటున్నారు.




# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ ఉమ్మడి జిల్లాల వార్తలు

## యువత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



**– జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్.మహేందర్.జి.**

**ములుగు, మే 04(వుదయం ప్రతినిధి) :** జిల్లాలోని నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్.మహేందర్.జి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మే 8న ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరిగే మెగా జాబ్ మేళా పోస్టర్ ను అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి,ఆర్ డి ఓ వెంకటేష్,జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ సిద్ధార్థ రెడ్డి లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా మే 8న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సుమారు 100 ప్రముఖ కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొంటాయని తెలిపారు. ములుగు జిల్లాలోని లోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.జాబ్ మేళా సమాచారం ప్రతి ఒక్కరికీ చేరేలా వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియాను ఉపయోగిస్తూ ఉపాధి అవకాశాల కోసం ఎదురు చూసేవారికి సమాచారం చేరేలా చూడాలని, టాస్క్ లో నమోదు చేసుకున్న యువతకు కూడా సమాచారం అందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో యువజన క్రీడల శాఖ అధికారి బి.రామ్మోహన్,ఉపాధి కల్పన అధికారి కొమురయ్య,పౌర సంబంధాల అధికారి ఎండి రఫీక్ అధికారులు పాల్గొన్నారు.

## పిపిసి కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

### పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హమాలి, రవాణా ఏర్పాట్లు సమర్థవంతంగా ఉండాలి**
**రాష్ట్ర మంత్రులు హైదరాబాద్ నుండి నిర్వహించిన వీసీలో ఖమ్మం కలెక్టరేట్ పాల్గొన్న జిల్లా కలెక్టర్**




**ఖమ్మంజిల్లా, వుదయం బ్యూరో మే-04:** పిపిసి కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని సివిల్ సప్లైస్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.సివిల్ సప్లైస్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్ నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు వాకాటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొనగా, ఖమ్మం కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ పిపిసి కేంద్రాలకు మొత్తం 21.34 లక్షల మెట్రిక్ టన్నుల వరి చేరగా ఇప్పటి వరకు 13.32 లక్షల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేసినట్లు తెలిపారు. వరిని తక్షణమే కొనుగోలు చేయాలని, హమాలి, రవాణా ఏర్పాట్లు సమర్థవంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అకస్మాత్తుగా కురిసిన వర్షాల వల్ల తడిసిన వరిని వెంటనే కొనుగోలు చేసి బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. రైతులకు వాతావరణ హెచ్చరికలను నిరంతరం అందించాలని, జిల్లా స్థాయిలో తగినంత టార్పెలిన్లు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. అన్ని పిపిసి కేంద్రాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నీడ సౌకర్యాలు కల్పించడంతో పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో కొనుగోళ్లు వేగవంతం చేయాలని సూచించారు. . ప్రస్తుతం జిల్లాకు 49 లక్షల గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయని, మిగతా అవసరాలకు ఇప్పటికే ఆర్డర్లు ఇచ్చినట్లు తెలిపారు. ప్రతి పిపిసి కేంద్రంలో అవసరమైన నిల్వలు తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. హమాలీల సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, ట్రక్ షీట్లు సమయానికి జెనరేట్ చేయాలని, వరి నాణ్యతను నిరంతరం పరిశీలించాలని తెలిపారు. మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో ట్రాక్టర్, హమాలి చార్జీలపై పిపిసి కేంద్రాల ఇన్‌చార్జ్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సిపిఓ శ్రీనివాస్,డిఆర్డిఓ శ్రీరామ్, డిసిఓ, ఆర్టీఓ, వ్యవసాయ,మార్కెటింగ్,సంబంధిత శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## రైతుల అభివృద్ధియే ప్రభుత్వ లక్ష్యం

**జిల్లా కలెక్టర్ డా. సత్య శారద.**



**వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి మే 4.** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గీసుగొండ మండలం కోనాయిమాకుల గ్రామంలోని రైతు వేదికలో 'రైతు వారోత్సవం' కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ డా. సత్య శారద, మే 4 నుండి 9 వరకు రైతు వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతుల అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన సాంకేతిక పద్ధతులను రైతులు స్వీకరించి, అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. రైతు వేదికలు రైతులకు సమాచార మార్పిడి కేంద్రాలుగా మారాలని ఆకాంక్షించారు. భూసార పరీక్షల ప్రాముఖ్యతను వివరించిన కలెక్టర్, ప్రతి రైతు భూసార పరీక్షా నివేదిక ఆధారంగా ఎరువుల వినియోగం చేపట్టాలని సూచించారు. అనంతరం ప్రధాన శాస్త్రవేత్త ఎ. వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, యూరియాను సిఫారసు మేరకు మాత్రమే వినియోగించడంతో పాటు పచ్చిరొట్ట ఎరువుల వినియోగాన్ని పెంచి భూమి సారాన్ని కాపాడుకోవాలని రైతులకు సూచించారు. శాస్త్రవేత్త బి. మాధవి, వరి రకాల ఎంపిక, నీటి పొదుపు పద్ధతులు, పంట మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ అనురాధ మాట్లాడుతూ, రసాయనిక ఎరువులు, పురుగు మందుల అధిక వినియోగాన్ని నివారించి సేంద్రీయ వ్యవసాయం వైపు రైతులు దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీఓ నీరజ, హార్టికల్చర్ అధికారి శ్రీనివాసరావు, గీసుగొండ తహసీల్దార్ రియాజుద్దీన్, జిల్లా పశు వైద్య అధికారి డా. ఎం. బాలకృష్ణ, మత్స్యశాఖ అధికారి పి. శ్రీపతి, ఇరిగేషన్ ఈఈ ప్రశాంతి, మండల వ్యవసాయ అధికారి హరి ప్రసాద్, వి ఏ ఎస్ శ్రీనివాస్, కోనాయిమాకుల సర్పంచ్ వి. రాజు, మరియపురం సర్పంచ్ అర్పిత, బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు తన్మయి, షేక్ తస్లీమా తదితరులు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో అభ్యుదయ రైతులు, గ్రామ రైతులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## అకాల వర్షా లతో ధాన్యం సేకరణ సిబ్బంది, జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట జిల్లా మే: 04 (వుదయం ప్రతినిధి)** రానున్న 4రోజులలో అకాల వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయన్న వాతావరణ శాఖ సూచనలతో జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద క్షేత్రస్థాయిలో యంత్రాంగం అందుబాటులో ఉండాలని సూచించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మండల వ్యవసాయ అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీఓలు వచ్చే 4రోజుల పాటు కేంద్రాలలో ధాన్యం తడవకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ప్రత్యేక అధికారులు ప్రతి రోజు రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి కేంద్రాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలను చేపట్టాలన్నారు.లోతట్టు ప్రాంతాలు ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలలోని ధాన్యాన్ని ముందస్తుగా తరలించాలని సూచించారు. తప్పనిసరి పరిస్థితుల ప్రభావంతో వర్షంతో ధాన్యం తడిస్తే తడిచిన ధాన్యాన్ని తక్షణమే బాయిల్డ్ మిల్లుకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సూర్యాపేట డివిజన్ తోపాటు కొంత మునగాల, కోదాడ ప్రాంతాలలో అకాల వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున రైతులను అప్రమత్తం చేయాలని సూచించారు. అకాల వర్షాల కారణం గా రైతులను, కొనుగోలు కేంద్రాలా సిబ్బంది ని అప్రమత్తం చేయాలి కొనుగోలు కేంద్రాలలో హమాలిల కొరత లేకుండా చూసుకోవాలని, ధాన్యం తూకం అయినా వెంటనే మిల్లులకు తరలించెందుకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచాలని మిలలకు వెళ్లిన లారీలు ఆన్ లోడింగ్ పూర్తి చేసుకొని అయిన వెంటనే మిల్లులకు తరలించేందుకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచాలని. మిల్లుకు వెళ్లిన లారీ వెంటనే లోడింగ్ పూర్తి చేసుకొని తిరిగొచ్చే బాధ్యత అధికారులదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శిరీష, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగేశ్వర్ శర్మ, జిల్లా సహకార అధికారి ప్రవీణ్ కుమార్, జిల్లా మేనేజర్ సివిల్ సప్లై శ్రీధర్ రెడ్డి ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి వినతులను వారం రోజుల్లో పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**
**ప్రజావాణి కార్యక్రమానికి 143 వినతులు**



**హనుమకొండ, మే 04 (వుదయం జిల్లా ప్రతినిధి) :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన వినతులను వారం రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా రెవెన్యూ అధికారి సత్యపాల్ రెడ్డితో కలిసి ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు.ప్రజలు తమ సమస్యలను వివరించగా, కలెక్టర్ సంబంధిత అంశాలపై వెంటనే స్పందిస్తూ పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను అక్కడికక్కడే ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలు లేకుండా చర్యలు తీసుకోవాలని, వారం వారీగా వినతులను పరిష్కరించే విధంగా వ్యవస్థను బలోపేతం చేయాలని ఆదేశించారు. ఎక్కువ సంఖ్యలో వినతులు వచ్చే శాఖలు ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా పరిష్కారం చూపాలని తెలిపారు. ఈరోజు ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు మొత్తం 143 వినతులను సమర్పించారు.

ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ మేన శ్రీను, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

## అర్జీల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలి

**– జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**జనగామ, మే 04 (వుదయం ప్రతినిధి)** ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చే వివిధ సమస్యల అర్జీలను పరిష్కరించేందుకు అధికారులు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోంతో కలిసి ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. 151 అర్జీల స్వీకరణ: ఈరోజు నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ మొత్తం 151 దరఖాస్తులను స్వీకరించారు. వీటిని వెంటనే సంబంధిత శాఖల అధికారులకు బదిలీ చేసి, త్వరిత గతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రధాన విన్నపాలు:చీటకోడూరుకు చెందిన కె. గణేష్ యాదవ్ బీసీ సంక్షేమ పాఠశాలలో సీటు కోసం దరఖాస్తు చేసుకున్నారు.లింగాల ఘనపురం మండలం పటేల్ గూడెంకు చెందిన జె. సురేష్, విద్యుత్ తీగల సమస్య వల్ల ఆగిపోయిన తన ఇందిరమ్మ ఇంటి నిర్మాణంపై ఫిర్యాదు చేశారు.నిరుపేదలైన ఎస్. కొమ్రమ్మ (సిరిసన్నగూడెం), మామిడి అంజయ్య (వెంకిర్యాల) తమకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.చీటూరు ఎంపీపీఎస్ పాఠశాలకు అదనపు తరగతి గదులు, వంటశాల షెడ్ మంజూరు చేయాలని సర్పంచ్ బర్ల గణేష్ విన్నవించారు. ప్రజావాణి అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ.. అన్ని శాఖల సిబ్బంది స్వీయ గణన నమోదును తప్పనిసరిగా చేపట్టాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రంగారావు, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, హౌసింగ్ పీడీ మాత్రు నాయక్, డీఎంహెచ్ఓ మల్లికార్జున రావు, డీడబ్ల్యూఓ కోదండరాములు మరియు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సమర్థవంతంగా ధాన్యం కొనుగోలు చేయాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**భూపాలపల్లి మే 04 (వుదయం విలేకరి)** జిల్లాలో ధాన్యం కొతలు ముమ్మరంగా జరుగుతున్నాయని, ప్రస్తుతం పీక్ దశలో కొనసాగుతున్నందున ఎటువంటి అంతరాయాలు లేకుండా సమర్థవంతంగా ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులకు ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో పౌర సరఫరాలు శాఖ, సంస్థ, వ్యవసాయ, సహకార, డిఆర్డీఓ, పంచాయతీ రాజ్, వైద్య శాఖల అధికారులు, మిల్లర్లు, ట్రాన్స్ పోర్టర్లుతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు, సౌకర్యాలు పట్ల థర్డ్ పార్టీ పరిశీలనకు రెవెన్యూ, వ్యవసాయ అధికారులతో తనిఖీ నిర్వహించనున్నట్లు తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయొద్దని సూచించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. జిల్లాలో 185 కేంద్రాలు ఏర్పాటు లక్ష్యం కాగా ఇప్పటివరకు 130 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం అయ్యాని, మిగిలినవి సత్వరం ప్రారంభించాలని తెలిపారు. అవసరాన్ని బట్టి మరిన్ని కేంద్రాలు ప్రారంభించడానికి సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఐదు పారా బాయిల్డ్ రైస్ మిల్లులకు 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించినట్లు వెల్లడించారు. ముఖ్యంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, తాగునీటి, నీడ సౌకర్యం కల్పించాలని సూచించారు. అస్వస్థతకు గురైతే తక్షణమే వైద్యులను సంప్రదించి వైద్య సేవలు పొందాలని తెలిపారు. వాతావరణ శాఖ సూచన మేరకు రానున్న 4 రోజులు జిల్లాకు వర్ష సూచన ఉన్నందున ధాన్యం తడవకుండా టార్పాలిన్లు, గన్ని సంచులు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని తెలిపారు. కోతలు ప్రారంభమైన నేపథ్యంలో పెద్ద మొత్తంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు కొనుగోలుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. కొనుగోలుకేంద్రాల వారీగా పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించామని అన్నారు.వ్యవసాయ శాఖ ఏఈఓలు రైతు వేదికల వద్ద రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి సరైన విధానంలో ధాన్యం విక్రయానికి మార్గదర్శకాలు అందించాలని సూచించారు. పీక్ మూవ్‌మెంట్ కొనసాగుతున్నందున ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. రైతులకు టోకెన్లు జారీ చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రైస్ మిల్లర్లు తప్పనిసరిగా అంగీకార పత్రాలు సమర్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, పౌర సరఫరాల శాఖ అధికారి కిరణ్ కుమార్, డిఎం రాములు, వ్యవసాయ అధికారి బాబూరావు, సహకార అధికారి వాలియా నాయక్, డిఆర్డీఓ బాలకృష్ణ, డిపిఓ శ్రీలత, వైద్య శాఖ అధికారి డా మధుసూదన్, రైస్ మిల్లర్లు, ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ నోట్ల ముఠా గుట్టురట్టు.. ఎనిమిది మంది అరెస్టు

**వరంగల్ టాస్క్‌ఫోర్స్, నర్సంపేట పోలీసుల సంయుక్త ఆపరేషన్**



**వరంగల్ క్రైం, మే 04 (వుదయం ప్రతినిధి) :** నకిలీ కరెన్సీ నోట్లను ముద్రించి చలామణి చేస్తున్న ముగ్గురితో పాటు, 'బ్లాక్ మనీ' పేరుతో అమాయకులను మోసం చేస్తున్న మరో ఐదుగురు సభ్యుల ముఠాను వరంగల్ టాస్క్‌ఫోర్స్ మరియు నర్సంపేట పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు.ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ వెల్లడించిన వివరాల ప్రకారం.. నర్సంపేటకు చెందిన శాగంటి కిరణ్, నీరటి శివ, నీరటి రంజిత్ అనే ముగ్గురు వ్యక్తులు ల్యాప్‌టాప్, కలర్ ప్రింటర్ల సహాయంతో ₹100 నోట్లను ముద్రించి మార్కెట్లో చలామణి చేస్తున్నారు. మరో ముఠాకు చెందిన ఐదుగురు సభ్యులు (గుడికందుల రవి, పోరిక రాజ్‌కుమార్, తనమాల రాజశేఖర్, ముదురుకోల యాకంబరం, చేను సాయికిరణ్) వినూత్న రీతిలో మోసాలకు పాల్పడుతున్నారు. తక్కువ ధరకు ఎక్కువ కరెన్సీ (1:3 నిష్పత్తిలో) ఇస్తామని నమ్మించి, సాధారణ నల్ల కాగితాలను కరెన్సీ నోట్ల పరిమాణంలో కత్తిరించి బాధితులకు అంటగడుతున్నారు. అసలైన రూ.500 నోట్లను అయోడిన్ టింక్చర్‌తో నల్లగా మార్చి, ఆ తర్వాత 'హైపో' (సోడియం థయోసల్ఫేట్) ద్రావణంతో తిరిగి అసలు రూపానికి తెచ్చి బాధితులకు డెమో చూపిస్తారు.

అది నమ్మిన బాధితులకు నల్ల కాగితాల కట్టలను ఇచ్చి, అసలు నగదుతో పరారవుతారు. గతంలో వీరు ములుగు, సికింద్రాబాద్, ఖమ్మం, హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఇటువంటి మోసాలకు పాల్పడి జైలుకు కూడా వెళ్లారు. నగదు 1,48,000 (అసలు నోట్లు) నకిలీ నోట్లు.పరికరాలు ₹28 లక్షల విలువైన ల్యాప్‌టాప్‌లు, ప్రింటర్లు, 13 సెల్‌ఫోన్లు, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నారు.

ఈ ఆపరేషన్‌లో ప్రతిభ కనబరిచిన టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, నర్సంపేట ఏసీపీ రవీందర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు బాబులాల్, శ్రీనివాస్, సిబ్బందిని పోలీస్ కమిషనర్ (CP) ప్రత్యేకంగా అభినందించారు.

## ప్రజావాణికి భారీ స్పందన



**141 దరఖాస్తులు స్వీకరణ.**

**వరంగల్ జిల్లా మే: 04 (వుదయం ప్రతినిధి)** జిల్లా స్థాయి మరియు డివిజన్ స్థాయిలలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాలకు ప్రజల నుండి విశేష స్పందన లభించింది. మొత్తం 141 దరఖాస్తులు అందినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ స్వయంగా పాల్గొని ప్రజల వినతిపత్రాలను స్వీకరించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి నుంచి 101 దరఖాస్తులు, డివిజన్ స్థాయిలలో వరంగల్ నుంచి 26,నర్సంపేట నుంచి 14 దరఖాస్తులు వచ్చాయి. శాఖల వారీగా పరిశీలిస్తే రెవెన్యూ శాఖకు సంబంధించినవి 63, హౌసింగ్ 14,జీడబ్ల్యూఎంసీ 18,ఇతర శాఖలకు చెందినవి 46 దరఖాస్తులు నమోదయ్యాయి. వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు పంపిస్తూ, వాటిని సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పరిష్కరించిన వివరాలు ప్రజావాణి పోర్టల్‌లో సమయానికిఅప్డేట్‌చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యారాణి, లోకల్ బాడీస్ అధికారి వై.వి. గణేష్, జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, డీఆర్ఓ విజయలక్ష్మి, డీఆర్డీఓ నాగ పద్మజ, డీ ఎం అండ్ హెచ్ ఓ సాంబశివరావు తదితర అధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా స్థాయి తో పాటు డివిజన్ స్థాయిలలో కూడా ప్రజావాణి నిర్వహించడం వల్ల ప్రజలు తమ ప్రాంతంలోని ఆర్డీవో కార్యాలయాల్లోనే దరఖాస్తులు సమర్పించి సమస్యలను పరిష్కరించుకునే అవకాశాన్ని వినియోగించుకుంటున్నారని, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని కలెక్టర్ పేర్కొన్నారు.

## థర్డ్ డిగ్రీ ఆరోపణల బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

### మానవ హక్కుల వేదిక






**నల్గొండజిల్లా, మే04(వుదయంప్రతినిధి):** శాలిగౌరారం మండలం చిత్తలూరు గ్రామానికి చెందిన గిరగాని సురేష్‌పై పోలీసుల థర్డ్ డిగ్రీ ప్రయోగం జరిగిందని ఆరోపిస్తూ బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల వేదిక (HRF) డిమాండ్ చేసింది.ఈ ఘటనను ఖండిస్తూ ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి వీరస్వామి, రాష్ట్ర నాయకుడు జి. మోహన్, జిల్లా నాయకుడు జి. వెంకటరమణ సంయుక్త ప్రకటన విడుదల చేశారు.మే 1న జరిగిన గొడవ కేసులో భాగంగా పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించి, నిందితులను కొట్టడంతో పాటు మహిళలతో అసభ్యంగా ప్రవర్తించారని ఆరోపించారు. ప్రధాన నిందితుడు గిరగాని సురేష్‌ను స్టేషన్‌కు తీసుకెళ్లి థర్డ్ డిగ్రీ విధానాలు ప్రయోగించడంతో అతనికి తీవ్ర గాయాలు అయ్యాయని తెలిపారు. సురేష్ భార్య వేడుకున్నా పోలీసులు పట్టించుకోకుండా లాకప్‌లో పెట్టి దాడి చేశారని, ఈ ఘటనలో అతని చెవికి తీవ్రమైన నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. అనంతరం నిందితుడిని నకిరేకల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, స్టేషన్ బెయిల్ ఇవ్వాల్సిన కేసులో నేరుగా రిమాండ్‌కు తీసుకురావడాన్ని న్యాయమూర్తి అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిపారు. న్యాయమూర్తి ముందు గాయాల విషయాన్ని వెల్లడించకుండా నిందితుడిపై ఒత్తిడి తీసుకువచ్చారని కూడా ఆరోపించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ పేరుతో కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ, కొందరు పోలీసులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటూ సామాన్యుల హక్కులను ఉల్లంఘిస్తున్నారని విమర్శించారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు విచారణ జరిపి బాధ్యులైన ఎస్సై, కానిస్టేబుళ్లను సస్పెండ్ చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, గాయపడిన సురేష్‌కు ప్రభుత్వం వైద్యం అందించాలని మానవ హక్కుల వేదిక డిమాండ్ చేసింది.

## అకాల వర్షా లపై అప్రమత్తంగా ఉండాలి

**రైతులకు నష్టం లేకుండా కొనుగోళ్లు పూర్తి చేయాలి – ఉత్తంకుమార్ రెడ్డి**
**ప్రతి రైతుకు న్యాయం జరిగేలా కలెక్టర్లు కృషి చేయాలి**
**పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**
**ధాన్యం కొనుగోలు ప్రక్రియ పై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రులు**





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మే 04 (వుదయం ప్రతినిధి)** రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియపై హైదరాబాద్ నుండి పలువురు మంత్రులు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రిపొన్నం ప్రభాకర్, పశుసంవర్ధక శాఖ,పాడి పరిశ్రమాభివృద్ధి, క్రీడలు మరియు యువజన సర్వీసుల శాఖల మంత్రి వాకాటి శ్రీహరి,ఐటీ,పరిశ్రమలు , వాణిజ్యంశాఖల మంత్రి శ్రీధర్ బాబు, గృహ నిర్మాణం, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమ, వృద్ధుల సంక్షేమ, మరియు ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖల మంత్రి అట్లూరి లక్ష్మణ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ అకాల వర్షాల ప్రభావంతో ధాన్యం తడిచే పరిస్థితులు ఏర్పడుతున్నందున రైతులు నష్టపోకుండా ముందస్తు జాగ్రత్తలు అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని సూచించారు. వాతావరణ సూచనలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, వర్ష సూచనలు ఉన్నప్పుడల్లా వెంటనే రైతులకు సమాచారం చేరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామ స్థాయి వరకు వ్యవసాయ శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండి రైతులను ముందుగానే హెచ్చరించాలన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాల కలెక్టర్లు ధాన్యం కొనుగోలు ప్రక్రియను అత్యంత బాధ్యతతో, సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. . అకాల వర్షాల నేపథ్యంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని, ప్రతి అంశాన్ని నిరంతరం సమీక్షిస్తూ పరిస్థితిని అదుపులో ఉంచాలని అన్నారు .కొనుగోలు కేంద్రాల్లో ఏర్పడే చిన్న చిన్న సమస్యలను కూడా వెంటనే గుర్తించి పరిష్కరించేలా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏవైనా సమస్యలు తలెత్తిన వెంటనే సంబంధిత ఇంచార్జి మంత్రులకు తెలియజేసి తక్షణ చర్యలు తీసుకునేలా చూడాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఎటువంటి ఆటంకాలు లేకుండా సజావుగా కొనసాగాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని అన్నారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ధాన్యం రవాణాలో ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే స్పందించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు..

మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని, టార్పాలిన్ల కొరత లేకుండా చూసుకోవాలని, రైస్ మిల్లర్లతో సమన్వయం పెంచాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఐడీఓసీ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ అంకిత్ అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. . ధాన్యం కొనుగోలు పూర్తైన 24 గంటల్లోపే ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలని, ఎక్కడైనా సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు,

## వైభవంగా ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం



**చండూరు, మే 04 (వుదయం):** పట్టణం రెండో వార్డులో బుధవారం గృహప్రవేశ వేడుక వైభవంగా జరిగింది. గ్రామీణ బ్యాంకు సమీపంలో నూతనంగా నిర్మించుకున్న చెనగానీ రమేష్ ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు, వైస్ చైర్మన్ భూతరాజు దశరథ ముఖ్య అతిథులుగా హాజరై నూతన గృహాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు బుషిపాక వాసు, కోడి సుష్మ వెంకన్న, కటకం రమేష్‌లతో పాటు కోఆప్షన్ సభ్యులు కల్లెట్ల చంద్రకళ మారయ్య, షేక్ ఖలీల్, మొగుదాల సత్తమ్మ వెంకన్న పాల్గొన్నారు. గృహ యజమాని రమేష్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో వార్డు అధికారులు జి.శ్రీరాములు, ఎ.జగన్, బి.సాయిరాం, బిల్ కలెక్టర్ రమేష్ కూడా ఉన్నారు. ఈ సందర్భంగా తమ ఆహ్వానాన్ని మన్నించి విచ్చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులకు చెనగానీ రమేష్ కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# కరీంనగర్ | అదిలాబాద్ | నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వార్తలు

## ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

**- వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్**

**జగిత్యాల మే 04 (వుదయం ప్రతినిధి)**
ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ అదేశించారు సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు వినతులను అదనపు కలెక్టర్ లతో కలిసి స్వీకరించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణి కి వస్తారని అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు కాగా తేదీ 4 5 2026 సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 76 ఫిర్యాదులు వినతులు వచ్చాయని వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు అనంతరం జనాభా లెక్కల స్వీయ గణన 2027 పై జిల్లా స్థాయి అధికారులకు సోమవారం సాయంత్రం ప్రతి ఉన్నతాధికారి తమ కింది స్థాయి ఉద్యోగుల వరకు అందరు సెల్ఫ్ ఎన్యూమరేషన్ చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బిఎస్ లత స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి రాజ గౌడ్ సంబంధిత జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు



## ప్రజావాణికి 97 దరఖాస్తులు

**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**



**కామారెడ్డి, మే 4 (వుదయం ప్రతినిధి):**
జిల్లా కలెక్టరేట్ లోని సమావేశం మందిరంలో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో సోమవారం మొత్తం 97 దరఖాస్తులు అందినట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన వినతి పత్రాలను కలెక్టర్‌కు అందజేశారు. అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు పంపించి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## కొండగట్టులో పెద్ద హనుమాన్ జయంతికి మంత్రి అడ్లూరికి ఆహ్వానం



**ధర్మపురి,మే 04 (వుదయం ప్రతినిధి):**
ప్రముఖ పుణ్యక్షేత్రమైన జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయ స్వామి పెద్ద జయంతి ఉత్సవాలకు రావాలని కోరుతూ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు అర్చకులు,అధికారులు ఆహ్వాన పత్రికను సోమవారం హైదరాబాద్‌లో మంత్రి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎ లాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున, క్యూలైన్లలో వేచి ఉండే భక్తుల కోసం చలువ పందిళ్లను ఏర్పాటు,ఆలయ ప్రాంగణంలో భక్తు లకు తాగునీటి ఎద్దడి కలగకుండా తగినన్ని నీటి కేంద్రాలను అందు బాటులో ఉంచాలని,సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు తక్కువ సమయంలో స్వామి వారిని దర్శించుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక ఉట్టిపడేలా నిర్వహించాలని అధికారులను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశించారు. ఆలయ ప్రధాన అర్చకులు, ఈఓ పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

**నిర్మల్ జిల్లా (వుదయం ప్రతినిధి)**
ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తక్షణమే స్పందించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.





# మంత్రి కృషితో దళితవాడల్లో.. మారనున్న రూపురేఖలు

**- మంత్రి శ్రీధర్ బాబు చిత్రపటానికి ఘనంగా పాలాభిషేకం**
**- ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల మంజూరుపై దళిత సంఘాల హర్షం**

**మంథని, మే 04 వుదయం ప్రతినిధి:**
మంథని నియోజకవర్గంలోని దళిత వాడల అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు చేసినందుకు గాను, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మరియు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబుల చిత్రపటాలకు మంథని అంబేద్కర్ చౌరస్తాలో ఘనంగా పాలాభిషేకం చేశారు. ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మంథని రాకేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. దళితుల సంక్షేమానికి పెద్దపీటఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జనగామ నర్సింగారావు, డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షులు మంతెన సత్యంతదితర నాయకులు మాట్లాడుతూ.. CRR (SC Component) కింద మంథని మండలానికి 3.30 కోట్ల రూపాయలు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మంత్రి శ్రీధర్ బాబు గారు ప్రతి ఏటా కోట్లాది రూపాయల నిధులతో దళిత వాడల్లో సిసి రోడ్లు, సైడ్ డ్రైనేజీలు, వీధిలైట్ల వంటి మౌలిక వసతులను కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. రాజకీయ, ఆర్థిక గుర్తింపు స్వర్గీయ శ్రీపాదరావు గారి కాలం నుండి దుద్దిళ్ల కుటుంబానికి దళితులంటే ప్రత్యేక అభిమానం ఉందని, వారిని రాజకీయంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో మంత్రి గారు నిరంతరం కృషి చేస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. సమాజంలో దళితులకు సరైన గుర్తింపునిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి మంత్రి ఎల్లప్పుడూ అండగా ఉంటున్నారని తెలిపారు.మాజీ సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శంకర్, యూత్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు ఎరుకల ప్రవీణ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, వార్డు సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

# ధాన్యం సేకరణలో పకడ్బందీ చర్యలు





**- కలెక్టర్ ఇలా త్రిపాఠి - కొనుగోళ్లను పక్కాగా పర్యవేక్షణ జరపాలని అధికారులకు ఆదేశం**
**- మోర్తాడ్, దోన్పాల్ ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన**

**నిజామాబాద్, మే 04 వుదయం:**
కొనుగోలు కేంద్రాల ద్వారా వరి ధాన్యం సేకరణ వేగవంతంగా జరిగేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు గాను సంబంధిత అధికారులు కేంద్రాలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ ధాన్యం సేకరణ తీరును నిశితంగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. మోర్తాడ్ మండల కేంద్రంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ సోమవారం తనిఖీ చేశారు. ఇదే మండలంలోని దోన్పాల్ లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సైతం సందర్శించారు. రైతులు తరలించిన ధాన్యం నిల్వలను పరిశీలించారు. రైతుల నుండి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం నిల్వలు, మిల్లులకు తరలించిన ధాన్యం గురించి నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని ఆరా తీశారు. ధాన్యం కొనుగోళ్లలో ఒకింత జాప్యం జరుగుతోందని, ట్రక్ షీట్ వివరాలు తమకు అందించడం లేదని రైతులు కలెక్టర్ దృష్టికి తేగా, మోర్తాడ్ సహకార సంఘం ధాన్యం కొనుగోలు కేంద్రం ఇంచార్జి దిలీప్ పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ, షోకాజ్ నోటీసు జారీ చేయాలని డీసీఓను ఆదేశించారు. పూర్తి పారదర్శకంగా పని చేస్తూ రైతులు నష్టపోకుండా చూడాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచనలు చేశారు. పంట సాగు చేసిన ప్రతి రైతు వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని, వరుస క్రమంలో రైతుల వివరాలు నమోదు చేసుకుని, ఎఫ్.ఏ.క్యూ ప్రమాణాలకు లోబడి ఉన్న ధాన్యాన్ని వెంటవెంటనే తూకం వేయించాలన్నారు. మిల్లుల వద్ద ధాన్యం వేగంగా దిగుమతి చేసుకుని, సత్వరమే ట్రక్ షీట్లు అందించేలా చూడాలని తహసీల్దార్ ను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు ఇబ్బందులు పడకూడదని, కేంద్రాలకు ధాన్యం తెచ్చిన వెంటనే నాణ్యాతా ప్రమాణాలను పరిశీలించి తూకం జరిపించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కేంద్రాన్ని సందర్శిస్తూ, ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగా జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలన్నారు. కాగా, రైతులు నాణ్యతా ప్రమాణాలకు లోబడి, శుభ్రపరచి బాగా ఆరబెట్టిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తేవాలని సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, డీఆర్డీఓ సాయన్న, డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీఎం ప్రవీణ్, జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్, స్థానిక అధికారులు ఉన్నారు.

## కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ గా పర్వతాలు

**కామారెడ్డి, మే 4 (వుదయం ప్రతినిధి):**
శంషాబాద్ ఏఎంసీగా విధులు నిర్వహించి బదిలీపై కామారెడ్డికి వచ్చిన టి. పర్వతాలు సోమవారం కామారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. అలాగే నారాయణఖేడ్ మున్సిపల్ కమిషనర్‌గా పని చేసి బదిలీపై ఎల్లారెడ్డికి వచ్చిన జగ్జీవన్ ఎల్లారెడ్డి మున్సిపాలిటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.



## పశువుల వధ నియంత్రణకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు

**- జిల్లా ఎస్పీ శ్రీమతి నితిక పంత్**
**- జిల్లాలో 11 చెక్ పోస్టుల ఏర్పాటు**



**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)**
ఈ నెల లో నిర్వహించే బక్రీద్ పండుగ నేపథ్యం లో జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, పశువుల అక్రమ రవాణా మరియు చట్టవిరుద్ధ వధ నియంత్రణ కోసం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టినదని జిల్లా ఎస్పీ శ్రీమతి నితిక పంత్ ఐపీఎస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ మరియు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని సున్నిత ప్రాంతాలు, అంతర్రాష్ట్ర మరియు జిల్లా సరిహద్దు ప్రాంతాలలో మొత్తం 11 ప్రాంతాలలో ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేయడం జరిగినది. ఈ చెక్ పోస్టులు 24×7 పనిచేస్తూ పశువుల అక్రమ రవాణాపై నిఘా ఉంచనున్నయని తెలిపారు.పశువుల రవాణా, కొనుగోలు, విక్రయాలు, వధకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన చట్టాలు, నిబంధనలు మరియు అనుమతులు తప్పనిసరిగా పాటించాలని సంబంధిత వ్యాపారులు, రవాణాదారులు మరియు ప్రజలకు సూచించడమైనది. ఆవులను వధించడం చట్టరీత్యా నేరం అని, సంబంధిత చట్టాల ప్రకారం ఆవుల వధ, అక్రమ రవాణా లేదా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని ఎస్పీ హెచ్చరించారు. అదేవిధంగా, పశువుల రవాణా మరియు వధకు ముందు సంబంధిత వెటర్నరీ డాక్టర్ నుండి తప్పనిసరిగా అనుమతి/సర్టిఫికేట్ పొందాలి. వెటర్నరీ వైద్యులచే జారీ చేయబడిన సర్టిఫికేట్ లేకుండా పశువుల రవాణా చేయరాదని అన్నారు.జిల్లా ప్రజలకు ముఖ్య విజ్ఞప్తి ఏమనగా, పశువుల అక్రమ రవాణాకు సంబంధించిన ఏదైనా సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలి. సమాచారం అందించడానికి జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా కుమురంభీం ఆసిఫాబాద్ కంట్రోల్ నెంబర్ 8712670557అందు బాటు లో ఉంచడమైనది.ప్రజలు, సామాజిక సంస్థలు మరియు ఇతర వర్గాలు సమాచారం ఇవ్వడంలో మాత్రమే సహకరించాలి. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని స్వయంగా వాహనాలను అడ్డగించడం, తనిఖీలు నిర్వహించడం, లేదా వ్యక్తులపై చర్యలు తీసుకోవడం వంటి చర్యలు చేయరాదు. కొన్ని సంస్థలు లేదా వ్యక్తులు స్వచ్ఛందంగా వాహనాలను అడ్డగించడం లేదా జోక్యం చేసుకోవడం వలన శాంతిభద్రతల సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నది. అటువంటి చర్యలు చట్టపరమైన సమస్యలకు దారితీసే అవకాశం ఉన్నందున ప్రజలు పూర్తిగా నివారించాలి. సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారం, పుకార్లు లేదా రెచ్చగొట్టే పోస్టులు చేయరాదని హెచ్చరించడమైనది. ఎటువంటి అనుమానాస్పద పరిస్థితి గమనించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకునేందుకు జిల్లా ప్రజలు, మత పెద్దలు, వ్యాపార వర్గాలు మరియు సామాజిక సంస్థలు పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ తెలిపారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేపట్టాలి

**- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**పెద్దపల్లి, మే 04 (వుదయం ప్రతినిధి)**
రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యాసంగి వరి ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి పాల్గొన్నారు.జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సంబంధిత శాఖల అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అకాల వర్షాలు కురుస్తున్నందున కొనుగోలు కేంద్రాలలో తగిన రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. టార్పాలిన్ కవర్లు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని, రైతులు తమ ధాన్యాన్ని ఎత్తైన ప్రదేశాల్లో నిల్వ చేసుకోవాలని సూచించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి కాళిందిని, జిల్లా సహకార శాఖ అధికారి శ్రీమాల, మార్కెటింగ్ శాఖ అధికారి ప్రవీణ్ రెడ్డి, పౌర సరఫరాల శాఖ అధికారులు శ్రీనాథ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగాలి

**-మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ మిట్టపల్లి సరిత**

**మంచిర్యాల /రామకృష్ణాపూర్ మే 04 (వుదయం ప్రతినిధి)**



రామకృష్ణాపూర్ భగత్‌సింగ్ నగర్ 22వ వార్డులో చేపట్టిన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు వర్షం కురుస్తున్నప్పటికీ నిరంతరాయంగా కొనసాగుతున్నాయని, వార్డులో రోడ్ల దుస్థితిని దృష్టిలో ఉంచుకుని మున్సిపాలిటీ చేపట్టిన పనులను వైస్ చైర్ పర్సన్ మిట్టపెల్లి సరిత స్వయంగా పర్యవేక్షించి అన్నారు. ఎలాంటి అంతరాయం కలగకుండా పనులు వేగంగా, నాణ్యతతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు, సిబ్బందికి ఆమె సూచించారు.ప్రజలకు త్వరగా మెరుగైన రహదారి సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో సిబ్బంది వర్షాన్ని లెక్కచేయకుండా కృషి చేస్తున్నారని ఆమె తెలిపారు. దీంతో వార్డు ప్రజలకు త్వరలోనే నూతన సిమెంట్ రోడ్డు అందుబాటులోకి రానుంది. ఈ కార్యక్రమంలో వార్డు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## సన్న వడ్ల సాగు తోనే రైతులకు మేలు

**కోరుట్ల మే 04 (వుదయం ప్రతినిధి)**
ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా సోమవారం కోరుట్ల మున్సిపాలిటీలో విలీన గ్రామమైన ఏకిన్ పూర్ 6 వ వార్డులో నిర్వహించిన వ్యవసాయ అవగాహన సదస్సు విజయవంతంగా నిర్వహించడం జరిగింది రైతు వారం కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ ఉద్యానవన అధికారులు రైతులతో ముఖాముఖి మాట్లాడి రాబోయే సీజన్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై దిశా.నిర్దేశం చేశారు ఏఓ నాగమణి సమావేశంలో వ్యవసాయ అధికారి నాగమణి మాట్లాడుతూ రైతులు మార్కెట్ డిమాండ్ కు అనుగుణంగా పంటలు



వేయాలని సూచించారు ముఖ్యంగా సన్న వడ్ల సాగుపై ఆమె ప్రత్యేకంగా ఫోకస్ చేశారు ప్రభుత్వం సన్న వడ్లకు క్వింటాలుకు అదనంగా బోనస్ ప్రకటించిన విషయాన్ని గుర్తు చేస్తూ. సన్న రకాలు పండిస్తే రైతులకు ఆర్థికంగా గొప్ప వెసులుబాటు కలుగుతుందని తెలిపారు అనంత స్థానిక కౌన్సిలర్ మేడిపల్లి శిరీష శేఖర్ రెడ్డి మాట్లాడుతూ వార్డు పరిధిలోని రైతులు అధికారుల సూచనలను పద్ధతులను పాటించి ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు ఈ కార్యక్రమంలో ఏఈఓ నరేష్ అలాగే ఏఎంసీ అధికారులు వార్డు ప్రతినిధులు ఏకిన్ పూర్ గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## పీఏంజే జువెలర్స్ ఘటనలో గాయపడ్డ బాధితులను పరామర్శించిన కేంద్ర మంత్రి

**కరీంనగర్ మే 4(వుదయం ప్రతినిధి):**
పీఏంజే జువెలర్స్ ఘటనలో గాయపడ్డ బాధితులను సోమవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పరామర్శించారు. మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్ బోయినిపల్లి ప్రవీణ్ రావుతో కలిసి నగరంలోని వెంకటాద్రి, రేనే ఆసుపత్రులకు వెళ్లిన కేంద్ర మంత్రి బాధితులను పరామర్శించారు. వారితో నేరుగా మాట్లాడారు. వారి ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లను ఆరా తీశారు. వారికి ప్రాణాపాయం ఏమీ లేదని డాక్టర్లు చెప్పారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడుతూ నగరంలో నిన్న జరిగిన జువెలరీ షాపు ఘటనలో గాయపడ్డ బాధితులకు ప్రాణాపాయం లేదని డాక్టర్లు తెలిపారని చెప్పారు. ఇది దారుణమైన, అనుకోని సంఘటన ఇట్లాంటి ఘటనలో గాయపడ్డ వారికి ఆందోళనలో ఉన్న వారిని ఓదార్చడం మానవత్వం ఉన్నవాళ్లు చేసే పని. కానీ బీఆర్ఎసోళ్లు నిన్న మాట్లాడిన తీరు సిగ్గు చేటన్నారు. పీఎంజే దోపిడీ ఘటనపై బీఆర్ఎస్ నేతల మాటలను చూసి జనం నవ్వుకుంటున్నారన్నారు. దొంగతనం చేసే వాడు పక్కన మంత్రి ఇల్లుందా ? అని చూస్తారా? అదే నిజమైతే వాళ్లు ఎమ్మెల్యే ఇంటి మీదుగానే జువెలరీ షాప్ వద్దకు రావడం జరిగిందన్నారు. ఘటన జరిగిన సమీపంలో జిల్లా కోర్టు కూడా ఉంది అంత మాత్రాన వాళ్లకు అంటగడతామా ? ఇదేం పద్దతి? అడ్డగోలుగా మాట్లాడటం సరికాదన్నారు. ఈ ఘటనపై డీజీపీతో మాట్లాడటం జరిగిందని హైదరాబాద్ నుండి ప్రత్యేక టీమ్స్ రంగంలోని దిగాయని దుండగులను పట్టుకుంటామని డీజీపీ వెల్లడించినట్లు చెప్పారు. జరిగిన ఘటనను పరిశీలిస్తే భద్రతా వైఫల్యం కన్పిస్తోందన్నారు.ఈ ఘటనకు బాధ్యత వహించి తనను రాజీనామా చేయాలని బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం హాస్యాస్పదంగా



ఉందన్నారు.దేశంలో శాంతి భద్రతల అంశం రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోనిదనే విషయం కూడా తెలియని వాళ్లను ఎమ్మెల్యేగా ఎన్నుకున్న హుజూరాబాద్ ప్రజలు ఆలోచించుకోవాలన్నారు.

# మహబూబ్ నగర్ | మెదక్ ఉమ్మడి జిల్లాల వార్తలు



## గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా పోచమ్మ తల్లికి బోనాలు

**మెదక్, వుదయం ప్రతినిధి :**
నిజాంపేట మండల కేంద్రంలో ప్రసిద్ధి గాంచిన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవంలో భాగంగా మొదటి రోజు గౌడ కులస్తుల ఆధ్వర్యంలో పోచమ్మ తల్లికి బైండ్ల రాజుల నృత్య ప్రదర్శనల మధ్య ఊరేగింపుగా తరలి అమ్మవారికి ధూప దీప నైవేద్యాలతో బోనాలను సమర్పించారు. అమ్మవారి అనుగ్రహం గ్రామ ప్రజలపై ఉండాలన్నారు. అలాగే మరసటి రోజు ఎల్లమ్మ తల్లి కి బోనాలు ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందని కళ్యాణ మహోత్సవాన్ని గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట గౌడ కులస్తులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వనమహోత్సవంను విజయవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల, మే 04 (వుదయం ప్రతినిధి):**
వన మహోత్సవంలో భాగంగా వర్షాకాలంలో తమ లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు ఆయా శాఖల అధికారులు ఇప్పటి నుంచే సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఐడిఓసి సమావేశపు మందిరంలో సోమవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవానికి సంబంధించి జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ సంవత్సరం జోగులాంబ గద్వాల జిల్లాకు 11 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిందని చెప్పారు. లక్ష్యానికి అనుగుణంగా నర్సరీలలో మొక్కలను సిద్ధం చేయాల్సి ఉంటుందన్నారు. ఆయా శాఖల అధికారులు మొక్కలు పెంచడానికి తమ పరిధిలో ఎక్కడెక్కడ అవకాశం ఉంది, ఎన్ని మొక్కలు అవసరమనే నివేదికలను అందజేస్తే అందుకు అనుగుణంగా వర్షాకాలంలో మొక్కలను నాటడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ సంవత్సరము అన్ని గ్రామ పంచాయతీల లో కూరగాయల విత్తనాలను కూడా రైతులు సాగు చేసేలా ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

**జోగులాంబ గద్వాల జిల్లాకు 11 లక్షల మొక్కలు నాటే లక్ష్యం**




జిల్లా అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తే వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయవచ్చని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, జిల్లా అటవీ శాఖ అధికారి ఆశీస్ సింగ్, కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కొత్త కమిషనర్ కు సన్మానం

- సమస్యలు విన్నవించిన కాకర్ల

**నారాయణపేట, మే04 (వుదయం ప్రతినిధి):**



నారాయణపేట నూతన కమిషనర్ శంకర్ ను సోమవారం మూడో వార్డు కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ భీమయ్య కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మూడో వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రధానంగా 15 ఇళ్లకు గత 5 ఏళ్లుగా పైప్ లైన్ లేక నీటి సమస్యను ప్రజలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆ ఇళ్లకు వెంటనే మిషన్ భగీరథ పైప్ లైన్ ఏర్పాటు చేసి వార్డులో బోర్లు మరమ్మతు చేసి నీటి సమస్య పరిష్కరించాలని కోరారు.

## అక్రమ కేసులకు భయమే లేదు

- హామీలు అమలు చేసే వరకు పోరాటం ఆగదు: కేటీఆర్

**సంగారెడ్డి, వుదయం జిల్లా ప్రతినిధి:**



రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని, కాంగ్రెస్ ప్రభుత్వం కేసులతో వేధింపులకు దిగుతోందని, ఆ వేధింపులకు తాము భయపడబోమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. సోమవారం కంది సెంట్రల్ జైలులో ఉన్న బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌ను పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కంది సెంట్రల్ జైలుకు రావడం ఇది రెండోసారి అని, గతంలో ముఖ్యమంత్రి నియోజకవర్గంలో గిరిజనులను అక్రమ కేసులతో అరెస్టు చేసిన సందర్భంలో వచ్చినట్లు తెలిపారు. ఇప్పుడు మన్నె క్రిశాంక్‌పై కూడా అక్రమ కేసులు నమోదు చేసి జైలులో ఉంచారని ఆరోపించారు.
తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన క్రిశాంక్‌పై 35కు పైగా కేసులు నమోదు చేయడం అన్యాయమని కేటీఆర్ అన్నారు. స్టేషన్ బెయిల్ వచ్చే కేసుల్లోనూ అరెస్టు చేసి జైలుకు పంపుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం చేస్తున్న అవినీతి, అరాచకాలపై ప్రశ్నించడమే ఆయన చేసిన “తప్పు” అని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులపై అవినీతి ఆరోపణలు చేస్తే కేసులు పెడుతున్నారని కూడా ఆరోపించారు. బీఆర్ఎస్ సోషల్ మీడియాపై చూపుతున్న శ్రద్ధలో కొంతైనా అభివృద్ధిపై చూపిస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని కేటీఆర్ పేర్కొన్నారు. హామీలు అమలు చేసే వరకు పోరాటం కొనసాగుతుందిప్రభుత్వం ఇచ్చిన 420 హామీలు, 13 డిక్లరేషన్లను అమలు చేసే వరకు తమ పోరాటం ఆగదని కేటీఆర్ స్పష్టం చేశారు. ఎంత వేధింపులు చేసినా, ఎన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గబోమని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో పోలీసులు ముఖ్యమంత్రి ప్రైవేట్ ఆర్మీలా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. బెంగళూరు నుంచి ప్రైవేట్ హ్యాకర్లను తీసుకువచ్చి బీఆర్ఎస్ నాయకుల ఫోన్లు, ఇళ్ల వద్ద ఉన్న సీసీ కెమెరాలను హ్యాక్ చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, సబితా ఇంద్రారెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, వివేకానంద గౌడ్, శంభిపూర్ రాజు, పట్నం మాణిక్యం, కాసాల బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతులు నేల సంరక్షణ, ఎరువుల వాడకం పై అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి మే 4 (వుదయం ప్రతినిధి)**
వనపర్తి మండలం చిమనగుంటపల్లి క్లస్టర్ రైతు వేదికలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక రైతు వారోత్సవాల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రైతులు నేల ఆరోగ్యంపై, సమతుల ఎరువుల వాడకంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి విజ్ఞప్తి చేశారు.
సోమవారం వనపర్తి మండల పరిధిలోని చిమనగుంటపల్లి క్లస్టర్ అంకురు గ్రామం పరిధిలోని రైతు వేదికలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక రైతు వారోత్సవాల్లో భాగంగా జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు నేల సంరక్షణ, ఎరువుల వాడకం తదితరాంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి ముందుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశాన్ని రైతులకు చదివి వినిపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు నేల ఆరోగ్యంపై, సమతుల ఎరువుల వాడకంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. తరచుగా మట్టి పరీక్షలు చేయించుకుని నేల ఆరోగ్యాన్ని ఆధారంగా ఎరువుల వాడకం కొనసాగించడం ఎంతో కీలకమని తెలిపారు. తమ భూమి యొక్క మట్టి నమూనాల పరీక్షలు చేయించుకుని రైతులు మట్టి ఆరోగ్య కార్డును పొందాలని తెలియజేశారు. ను ఆరోగ్యం పై అవగాహన లేకుండా అధికంగా యూరియా వాడకం వల్ల భూమి ఆరోగ్యానికి చాలా అనర్థాలు, ముప్పు పరిణమిస్తాయని తెలిపారు. కాబట్టి భూమిపై పంటల కోసం ఎరువుల వాడకం కోసం హెల్త్ కార్డు అనేది చాలా ముఖ్యమని తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో ఐదు మంది రైతులకు మట్టి నమూనాల పరీక్షల అనంతరం భూమి ఆరోగ్య కార్డులను పంపిణీ చేయడం జరుగుతుందని, మిగతా రైతులు కూడా త్వరలోనే భూమి ఆరోగ్య కార్డులను పొందాలని తెలియజేశారు. ఈ భూమి ఆరోగ్య కార్డులను వినియోగించుకుని రైతులు నేలను కాపాడుకునే ప్రయత్నాలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కె వి కె మదనాపురం సీనియర్ శాస్త్రవేత్త రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు నేల సంరక్షణపై అవగాహన కలిగి ఉండాలని, ఎరువులను తగినంత మోతాదులోనే వాడాలని సూచించారు. భూమికి ఏం అవసరమో దానినే మనం అందించాలని, మోతాదుకు మించి ఏది ఎక్కువగా భూమికి అందించిన అది ప్రమాదకరమైన అని తెలిపారు. యూరియా వాడకాన్ని తగ్గించాలని, జిలుగా జనుమును, పచ్చి రొట్టెను వాడాలని సూచించారు. రెండు నెలలకోసారి నేల యొక్క మట్టి నమూనాలను పరీక్షించుకొని భూమి ఆరోగ్య కార్డులను పొంది దానికి తగిన విధంగా పంటల కోసం ఎరువుల వాడకండి కొనసాగించాలన్నారు. అదేవిధంగా సమతుల్య ఎరువుల వినియోగం పైన రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. నేలను, మట్టిని, సంరక్షించుకొని భావితరాలకు మంచి వాతావరణాన్ని అందజేయాలని సూచించారు.
ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు రైతులకు భూమి ఆరోగ్య కార్డులను కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు, మార్కెటింగ్ శాఖ డిడి ప్రసాదరావు, మార్కెటింగ్ డిఎం స్వరణ్ సింగ్, తహసిల్దార్ రమేష్ రెడ్డి, సర్పంచులు, రైతులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణికి మొత్తం 47 ఆర్జీలు

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల, మే 04 (వుదయం ప్రతినిధి)**



ప్రజావాణి ఫిర్యాదులను పెండింగ్ లో ఉంచకుండా సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా ఐడిఓసి సమావేశపు మందిరంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరించారు. మండల స్థాయిలోనే ఫిర్యాదులను పరిష్కరిస్తే చిన్న చిన్న సమస్యలకే ప్రజలు కలెక్టరేట్ వరకు రావాల్సిన అవసరం ఉండదన్నారు. ప్రభుత్వం డివిజన్ స్థాయిలోనూ ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల నాలుగవ తేదీ నుంచి ప్రతి సోమవారం నిర్వహిస్తోందని ప్రజలు అక్కడ కూడా తమ ఆర్జీలను సమర్పించవచ్చన్నారు. కలెక్టరేట్ ప్రజావాణికి ఈ సోమవారం మొత్తం 47 ఆర్జీలు వచ్చాయని పేర్కొన్నారు. ప్రజావాణి అనంతరం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ జనాభా గణనలో భాగంగా ఏప్రిల్ 26 నుంచి మే 10వ తేదీ వరకు సెల్ఫ్ ఎన్యూమరేషన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో ప్రతి గ్రామపంచాయతీ నుంచి కనీసం వంద మంది పాల్గొనేలా సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. సర్పంచులు, వార్డు సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు తమ వివరాలను సంబంధిత పోర్టల్ లో నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలని, ఈ విషయంలో సంబంధిత మండలాల ప్రత్యేక అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు షెడ్యూల్ ప్రకారం సంబంధిత శాఖల అధికారులు తమ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించండి

- నేటి ప్రజావాణికి 35 ఫిర్యాదులు
- అదనపు కలెక్టర్ అమరేందర్

**నాగర్ కర్నూల్, మే 04 (వుదయం ప్రతినిధి):**
ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అమరేందర్ అధికారులకు సూచించారు. నాగర్ కర్నూల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్ తో కలిసి అదనపు కలెక్టర్ అమరేందర్ ప్రజల నుంచి 35, అర్జీలు స్వీకరించారు. అదనపు కలెక్టరు మాట్లాడుతూ..... ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని అదనపు కలెక్టరు తెలిపారు.. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్ అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి వినతుల సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టండి

- జిల్లా కలెక్టర్ కె. హైమావతి

**సిద్దిపేట, మే 04 (వుదయం ప్రతినిధి)**



ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వాటిని సత్వరమే పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదేశించారు సోమవారం సిద్దిపేటలోని సమీకృత జిల్లా కార్యాలయ సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల వినతులను కలెక్టర్ స్వయంగా స్వీకరించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలు పరిష్కారమవుతాయన్న గొప్ప నమ్మకంతో ఈ కార్యక్రమానికి వస్తారని వారి ఆశయాలకు అనుగుణంగా అర్హత కలిగిన ప్రతి దరఖాస్తును సానుకూలంగా పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు నేటి కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా మొత్తం 69 దరఖాస్తులు వచ్చినట్లు ఆమె వెల్లడించారు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లా కేంద్రంతో పాటు సిద్దిపేట హుస్నాబాద్ గజ్వేల్ ఆర్డీవో కార్యాలయాల్లో కూడా ప్రజావాణి నిర్వహించి ప్రజల నుండి వినతులు స్వీకరించినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో ఏఓ రాజ్ కుమార్ తో పాటు వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేట యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యం

- 8న సంగారెడ్డిలో భారీ జాబ్ మేళా

**సిద్దిపేట, మే 04 (వుదయం ప్రతినిధి):**




రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈనెల 8వ తేదీన సంగారెడ్డి పట్టణంలో నిర్వహించనున్న ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి జాబ్ మేళాను జిల్లాలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె హైమావతి పిలుపునిచ్చారు సోమవారం సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్లను వివిధ శాఖల అధికారులతో కలిసి ఆమె ఆవిష్కరించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రైవేట్ రంగంలో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఈ మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేస్తోందని తెలిపారు సంగారెడ్డిలోని తార డిగ్రీ కళాశాల వేదికగా ఉదయం 8 గంటల నుండి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో దాదాపు 250కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొని అభ్యర్థుల విద్యా అర్హతల ఆధారంగా ఎంపిక ప్రక్రియ చేపడతాయని వెల్లడించారు పదవ తరగతి ఉత్తీర్ణులైన వారి నుండి మొదలుకొని ఇంటర్మీడియట్ ఐటిఐ డిప్లొమా డిగ్రీ ఇంజనీరింగ్ ఫార్మసీ వంటి అన్ని రకాల విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వాడుకోవాలని సూచించారు జిల్లా నుండి యువత పెద్ద ఎత్తున హాజరై తమ నైపుణ్యంతో ఉద్యోగాలను సాధించాలని కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా యువజన సర్వీసుల అధికారి శ్రీనివాస్ రెడ్డి జెడ్పీ సిఇఓ రమేష్ డీపీఆర్ఓ రవికుమార్ సిపిఓ దశరథ్ జిల్లా పరిశ్రమల అధికారి గణేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.



## జాలిగామ చెరువు కట్టపై పిచ్చి చెట్లు తొలగించాలి

- అధికారులకు రైతుల విజ్ఞప్తి

**గజ్వేల్, మే 04 (వుదయం ప్రతినిధి) :**
సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం జాలిగామ గ్రామంలోని నల్లచెరువు కట్టపై పిచ్చి చెట్లు సర్కార్ తుమ్మలు విపరీతంగా పెరిగిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు సోమవారం గ్రామ రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తూ కట్ట వెంబడి పెరిగిన ముళ్ల పొదలు రహదారిని కమ్మేయడంతో పంట పొలాల్లోకి వెళ్లడానికి వీలు లేకుండా పోయిందని తెలిపారు. ఈ చెట్లు కోతులకు ఆవాసాలుగా మారాయని పంటలను ధ్వంసం చేస్తున్నాయని రైతులు భిక్షపతి ముదిరాజ్ కురుమ నర్సింలు స్వామి పేర్కొన్నారు. ఈ సమస్యపై ఇటీవల సర్పంచ్‌కు విన్నవించగా చెట్లను తొలగించే ప్రయత్నం చేశారని అయితే గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు కొందరు పనులను అడ్డుకొని నిలిపివేయించారని వారు ఆరోపించారు అధికారులు స్పందించి తక్షణమే తుమ్మ చెట్లను తొలగించి తమకు న్యాయం చేయాలని కోరారు ఈ విషయంపై గ్రామ సర్పంచ్ తాళ్ళ సునీత ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ తాము గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని రైతుల విన్నపం మేరకు చెట్ల తొలగింపు చేపట్టగా కొందరు అడ్డుకోవడం సరికాదని అన్నారు. అభివృద్ధి పనులకు ఆటంకం కలిగించకుండా మంచి సలహాలు సూచనలు ఇవ్వాలని ఆమె సూచించారు.

## జగదేవ్‌పూర్ రైతు వేదికల్లో రైతులకు ఆధునిక వ్యవసాయ సాగు పద్ధతులపై అవగాహన



- విరివిగా నేల ఆరోగ్య కార్డుల పంపిణీ

**సిద్దిపేట/జగదేవ్‌పూర్, మే 04 (వుదయం ప్రతినిధి) :**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సిద్ధిపేట జిల్లాలో జగదేవ్‌పూర్ మండలంలోని పలు రైతు వేదికల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం విస్తృత స్థాయి అవగాహన సదస్సులు నిర్వహించారు. చాట్లపల్లి ఇటిక్యాల జగదేవ్‌పూర్ మునిగడప తీగుల్ మరియు తిమ్మాపూర్ గ్రామాల్లోని రైతు వేదికల్లో జరిగిన ఈ కార్యక్రమాల్లో రైతులు ప్రజా ప్రతినిధులు మరియు అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి వసంత రావు మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి నేల పరీక్షల ఆధారంగా సాయిల్ హెల్త్ కార్డుల ద్వారా సూచించిన మోతాదులోనే ఎరువులు వాడాలని సూచించారు. దీనివల్ల సాగు ఖర్చు తగ్గడమే కాకుండా భూసారం దెబ్బతినకుండా ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యంగా నానో ద్రవ ఎరువుల వినియోగం 4R సూత్రాల ప్రాముఖ్యత మరియు సమగ్ర పోషక యాజమాన్యంపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత కోసం నిగ్రాణి సమితులు క్రియాశీలకంగా వ్యవహరించాలని కోరారు. భవిష్యత్తులో మార్కెట్ డిమాండ్ ఉన్న తెలంగాణ సోనా బిపిటి జైశ్రీరామ్ వంటి సన్న రకాలను సాగు చేయడం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని సూచించారు సహజ సిద్ధమైన జీవామృతం బీజామృతం వంటి పద్ధతులను అవలంబించి రసాయన రహిత సాగు వైపు రైతులు మొగ్గు చూపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు వ్యవసాయ విస్తీర్ణ అధికారులు మరియు కృషిసఖిలు పాల్గొని రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని రైతులందరూ ఆర్థికంగా ఎదగాలన్నదే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని వసంతరావు పునరుద్ఘాటించారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను

**నారాయణపేట టౌన్ ,మే04 (వుదయం ప్రతినిధి):**



ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత నిస్తూ ఫిర్యాదు లను సత్వరమే పరిష్కరిం చాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను అధికారులకు సూచించారు. సోమవారం ప్రజావాణి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా వాణి కార్యక్రమానికి హాజర య్యారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలను అదనపు కలెక్టర్ కు సమర్పించగా, ప్రజల ఫిర్యాదులను సమస్యలను సావధానంగా విన్న అదనపు కలెక్టర్ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా సోమవారం నాటి ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 19 ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అసాధ్యం సాధ్యం చేసిన బీజేపీ

- ఐదు రాష్ట్రాల ఫలితాల్లో జోరు... బింగి దొడ్డిలో సంబరాలు

**గద్వాల, మే 04 (వుదయం ప్రతినిధి):**
దేశ రాజకీయాల్లో చర్చనీయాంశమైన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడగా, భారతీయ జనతా పార్టీ ప్రభంజనం సృష్టించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. సాధ్యం కాదని భావించిన పశ్చిమ బెంగాల్‌లో కూడా బీజేపీ గణనీయంగా దూసుకెళ్లడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీసింది. “చరిత్రను రాయాలన్నా, తిరగరాయాలన్నా అది బీజేపీకే సాధ్యం” అని పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మండలం బింగి దొడ్డి గ్రామంలో బీజేపీ శ్రేణులు సంబరాల్లో మునిగిపోయాయి. మండల అధ్యక్షులు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో కార్యకర్తలు గ్రామంలో స్వీట్లు పంచుతూ విజయోత్సాహాన్ని పంచుకున్నారు. నినాదాలతో గ్రామం మార్మోగింది



## కలెక్టర్ ప్రియాంకను మర్యాద కలిసిన
# గోల్కొండ సదానందం



హైదరాబాద్, మే 04 (వుదయం ప్రతినిధి) :

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలాను రాహుల్ దళిత అవుట్ సోర్సింగ్ మేనేజింగ్ డైరెక్టర్ గోల్కొండ సదానందం సోమవారం నాడు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఈ భేటీ జరిగింది.

ఈ సందర్భంగా గోల్కొండ సదానందం జిల్లా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి హార్థిక శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా అభివృద్ధిలో భాగంగా కలెక్టర్ చేపడుతున్న వివిధ కార్యక్రమాలను వారు కొనియాడారు.కీలక అంశాలపై చర్చసుమారు కొంతసేపు జరిగిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలు చర్చకు వచ్చాయి. ప్రధానంగా ప్రస్తుతం ఉన్న సామాజిక పరిస్థితులు, ప్రజల సమస్యలపై చర్చించారు.అవుట్ సోర్సింగ్ రంగంలో చోటుచేసుకుంటున్న మార్పులు, కార్మికుల సంక్షేమం, ఈ రంగంలోని తాజా పరిణామాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.అట్టడుగు వర్గాల అభివృద్ధి, దళిత, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి సంస్థ తరపున అందిస్తున్న సహకారం గురించి వివరించారు.జిల్లా కలెక్టర్‌ను కలిసిన వారిలో గోల్కొండ సదానందంతో పాటు సంస్థకు చెందిన ప్రతినిధులు, ముఖ్య సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమంలో
# 11 ఫిర్యాదులు స్వీకరణ

- సత్వర పరిష్కారానికి ఆదేశాలు
- జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు

గద్వాల ,మే 04 (వుదయం ప్రతినిధి):

జోగుళాంబ గద్వాల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన బాధితుల నుండి ఫిర్యాదులను స్వీకరించినట్లు జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ రోజు నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి మొత్తం 11 ఫిర్యాదులు స్వీకరించి, సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తున్నామని తెలిపారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వారి వినతులను స్వీకరించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి, చట్టప్రకారం న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, ఫిర్యాదుదారుల్లో పోలీస్ శాఖపై నమ్మకం, భరోసా పెంపొందేలా వ్యవహరించాలని తెలిపారు. గ్రీవెన్స్ డేలో స్వీకరించిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటి పరిష్కార స్థితిని నిరంతరం సమీక్షిస్తూ, ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. సోమవారం స్వీకరించిన ఫిర్యాదుల్లో మొక్కజొన్న పంట కాలిపోయిన అంశం - 01, భర్తల వేధింపులకు సంబంధించినవి - 02, గొడవలకు సంబంధించినవి - 02, భూ వివాదాలకు సంబంధించినవి - 02, ఇతర అంశాలకు సంబంధించినవి - 04, మొత్తం - 11 ఫిర్యాదులు స్వీకరించబడినవి.





## ధాన్యం కొనుగోలు కేంద్రాలపై పర్యవేక్షణ అవసరం

- జిల్లా కలెక్టర్ బాషా షేక్

గద్వాల మే 04 (వుదయం ప్రతినిధి)

వరి ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి అవకతవకలకు చోటు లేకుండా విజిలెన్స్ అండ్ ఇన్ఫోర్స్మెంట్ అధికారులు తరచూ కేంద్రాలపై పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. అకాల వర్షాల కారణంగా తడిసిన వరి ధాన్యం కొనుగోలు, ఇతర అంశాలపై సోమవారం హైదరాబాద్ నుంచి మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. గద్వాల ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వీసీ అనంతరం మాట్లాడారు. విజిలెన్స్ అధికారులు తమ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి ఎప్పటికప్పుడు నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. రైతులతో ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే వివరాలు ఓపీఎంఎస్ (ఆన్లైన్ ప్రొక్యూర్మెంట్ మేనేజ్మెంట్ సిస్టం)లో ఎంట్రీ చేసి సకాలంలో వారికి డబ్బులు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి అక్రమాలకు పాల్పడిన తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి స్వామి కుమార్, మేనేజర్ విమల, డిఆర్డిఎ ఎపిడి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



## భూసార పరీక్షలు తప్పనిసరి

- మార్కెట్ కమిటీ చైర్మన్ కనకయ్య

దౌల్తాబాద్, మే 4 (వుదయం):

రైతులు పంటల దిగుబడులను పెంచుకోవాలంటే తప్పనిసరిగా మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేయించుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లపల్లి కనకయ్య యాదవ్, వ్యవసాయ అధికారి ఆర్. నరేష్ సూచించారు. సోమవారం రాయపోల్ మండల కేంద్రంతో పాటు ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక రైతు వారోత్సవాల సందర్భంగా రాయపోల్, చిన్నమాసాన్‌పల్లి, ఆరేపల్లి, వడ్డేపల్లి గ్రామాల రైతు వేదికల్లో అవగాహన సమావేశాలు నిర్వహించారు.ఈ సందర్భంగా కనకయ్య రైతులకు భూసార పరీక్ష కార్డులను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ రసాయన ఎరువుల అధిక వినియోగం వల్ల నేల సారం తగ్గిపోతుందని, దాంతో పంట దిగుబడులు ఆశించిన స్థాయిలో రావడం లేదన్నారు. కాబట్టి వ్యవసాయ అధికారులు సూచించిన పద్ధతులను పాటిస్తూ సాగు చేయాలని సూచించారు. మట్టి నమూనాల సేకరణ విధానం, భూసార పరీక్షల ప్రాముఖ్యత, ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగం వంటి అంశాలపై అధికారులు వివరించారు. నేల ఆరోగ్య పరిరక్షణపై వీడియోల ద్వారా రైతులకు అవగాహన కల్పించారు.సన్న వరి రకాల సాగు చేస్తే ప్రభుత్వం అందించే బోనస్ పొందవచ్చని తెలిపారు. అలాగే రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి పశువులు, కోళ్ల, గొర్ల ఎరువులు, వానపాముల ఎరువులు వంటి సేంద్రియ ఎరువులను వినియోగించాలని సూచించారు. వేపనూనె, గణ జీవామృతం, పంచగవ్య, వెస్ట్ డికంపోజర్, బ్రహ్మాస్త్రం, అగ్నిహస్త్రం వంటి ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై కూడా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు మాసంపల్లి రాజు, సత్తు అశోక్ రెడ్డి, వాసుదేవ్, ఉప సర్పంచులు, ఆత్మ డైరెక్టర్లు, ఏఎంసీ డైరెక్టర్లు, సాయిల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# వనపర్తిలో మినుముకుంట కట్ట ధ్వంసం



వనపర్తి, మే 4 (వుదయం ప్రతినిధి):

మినుము కుంట కట్టను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ డిమాండ్ చేశారు.

రైతులతో కలసిన ధ్వంసం అయిన ప్రదేశాన్ని సందర్శించి రైతులకు సంఘీభావం తెలిపారు.ఇరిగేషన్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.వనపర్తి మండలం కాశీంనగర్ గ్రామానికి సంబంధించిన మినుము కుంట కట్టని కాంగ్రెస్ నాయకుడు ధ్వంసం చేసిన విషయాన్ని తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు రైతులతో కలిసి అక్కడికి వెళ్లి పరిశీలించారు. ఈ కుంట కట్టను పునారవతం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని బీఆర్ఎస్ నాయకులు, రైతులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా రైతు రాము మాట్లాడుతూ..... కాశీంనగర్ గ్రామానికి చెందిన మినుముకుంట, పుల్లయ్య కుంట అనే కట్టని గ్రామంలోని ఓ కాంగ్రెస్ నాయకుడు తన పట్ట పొలంలో ఉందని ధ్వంసం చేస్తున్నాడు. ఈ కుంటకి గత 20 సంవత్సరాల నుండి పనికహార పథకం, మిషన్ కాకతీయ పథకం కింద సంబంధించిన పనులు చేయడం జరిగిందని అన్నారు. అదేవిధంగా కట్టకి తూము, అలుగు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కట్ట తొలగించడం వల్ల రైతులు పొలం దగ్గరికి వెళ్లడానికి, కింది భాగంలో ఉన్న బోర్లకి భూగర్భ జలం సంబంధించిన ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకుడు అని వచ్చిన అధికారులను కూడా బెదిరించడం జరిగిందని, కట్టని మళ్లీ పునరుద్ధం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా వర్ష కాలంలో వరదలు రావడంతో వరదలో పంట పోలాలు కొట్టుకుపోతాయని దానితో రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు.ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ...... 100 సంవత్సరాలుగా తాతా ముత్తాతల నుండి పొలాల దగ్గరికి కట్టపై నుండి నడుచుకుంటూ వెళ్తున్నామని, ఈ కట్ట తీసివేయడం ద్వారా వందల ఎకరాలకి సంబంధించిన రైతులకు నష్టం జరుగుతుందన్నారు. ఈ కట్టకు సంబంధించిన మట్టిని పక్కనే ఉన్న బావిని పూడ్చి వేయడం జరిగిందని, ఈ బావని పూడ్చడంతో గ్రామదేవతకు సంబంధించిన పూజ వస్తువులను కడగడానికి గ్రామ దేవత దగ్గరికి వెళ్లడానికి బాట నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా కట్టని యధావిధిగా పునరావతం చేయాలని అధికారులని కోరుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో గట్టు యాదవ్ వాకిటి శ్రీధర్ కే మాణిక్యం రఘు వర్ధన్ రెడ్డి దేగ మహేశ్వర్ రెడ్డి చిట్యాల రాము,ఉల్లెందులరాములు.ఉల్లెందుల ఎర్రన్న. ఉల్లెందుల తిరుపతయ్య. గుండె మోని మధు. గుండె మోని బాలరాజు. గుండెముని,హనుమంతు.గుండె మౌని ఆనంద్.నక్క మోని చిన్న రాము నక్క ముని మహేష్. నక్క మౌని నరేష్. రేవల్లి వెంకటయ్య. నక్క బుడ్డమ్మ. నక్క మోని శివకుమార్. సంఘం మౌని కురుమూర్తి. పెద్దగూడెం రాములు. తదితరులు పాల్గొన్నారు.



## రైతు వేదికలో రైతు వారోత్సవాలు

మెదక్ జిల్లా వుదయం ప్రతినిధి

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులు కార్యక్రమంలో భాగంగా నిజాంపేట మండల కేంద్రంలోని రైతువేదికలో రైతు వారోత్సవాలను మంగళవారం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొనడం జరిగింది. ముఖ్యంగా ఈ సమావేశంలో రైతులకు నేల ఆరోగ్య పరిరక్షణ కు చేపట్టవలసిన చర్యలను వివరించడం జరిగింది. అదేవిధంగా వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గు చూపవలసిందిగా చెప్పడం జరిగింది. ఆయిల్ పామ్ పంట కు సంబంధించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న ప్రోత్సాహాలు మరియు ఆయిల్ పామ్ పంట యొక్క ప్రాముఖ్యత గురించి రైతులకు వివరించడం జరిగింది. అలాగే ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రతి రైతు కూడా చేసుకోవాల్సిందిగా విన్నవించడం జరిగింది. రాబోయే వానాకాలంలో యూరియా యాప్ గురించి రైతులకు మరింత అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోబడతాయని చెప్పడం జరిగింది. రైతులు కూడా అధిక మొత్తంలో రసాయన ఎరువులను వాడకం తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు ముగ్గు చూపవలసిందిగా సూచించడం జరిగింది. ఈ సందర్భంలో కల్వకుంట గ్రామానికి చెందిన అభ్యుదయ రైతు రాజేశ్వర్ రెడ్డి గారు సేంద్రియ వ్యవసాయంలో తమ అనుభవాలను రైతులతో పంచుకోవడం జరిగింది .ఈ కార్యక్రమంలో కొంతమంది రైతుల కు వారి నేలలకు సంబంధించి పరీక్షా ఫలితాల పత్రాలను మండల స్థాయి అధికారులు చేతుల మీదుగా అందించడం జరిగింది .తదనుగుణంగా రైతులు ఎరువుల వాడకాన్ని అవలంబించవలసిందిగా కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ శ్రీనివాస్ గారు ,ఎంపీడీవో రాజి రెడ్డి గారు, ఎస్సై రాజేష్ గారు ,నిజాంపేట్ సర్పంచ్ నరేందర్ గారు ,ఉపసర్పంచ్ బాబు గారు, ఆయిల్ పంప్ కంపెనీ మేనేజర్ ప్రశాంత్ గారు అలాగే అవివిధ గ్రామాలకు చెందిన ఆకుల రమష్, విటల్ ,రాజ్యం మరియు ఇతర రైతులు పాల్గొనడం జరిగింది.

## తాండూరులో కంది బోర్డుఏర్పాటు



- ప్రజా పాలనలో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు..
- టీజీ ఆర్గానిక్ మొబైల్ యాప్ ఆవిష్కరణ.
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు....

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు సంబురంగా వ్యవసాయం చేస్తారు


- కేంద్ర ప్రభుత్వం యూరియా విషయంలో రైతులకు ఇబ్బంది గురిచేస్తుంది...
- తాండూరు నియోజకవర్గానికి జుంటుపల్లి కోట్ పల్లి ప్రాజెక్టుల నుండి సాగునీరు అందిస్తాం...
- ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి

తాండూర్ న్యూస్ వుదయం ప్రతినిధ మే 4 :-

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం ఎస్వీఆర్ గార్డెన్ లో రైతు వారోత్సవాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం నుండి 9వ తేదీ రాష్ట్రంలో వారోత్సవాలు నిర్వహిస్తారని తెలిపారు 'టీజీ ఆర్గానిక్' యాప్‌ను ఆవిష్కరించారు సేంద్రియ ఉత్పత్తుల మార్కెటింగ్‌కు టీజీ ఆర్గానిక్ యాప్ దోహదపడుతుందని పేర్కొన్నారు.

తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలనలో రైతులు వ్యవసాయం చెయ్యడానికి ఎంతో సహాయం చెబుతున్నారని రైతులకు అన్ని విధాలుగా ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలను ఇవ్వకుండా నిషేధించిందని వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం మరల సబ్సిడీపై వ్యవసాయ రైతులకు ఆధునిక యంత్రాలను అందిస్తుందని గుర్తు చేశారు గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం అడ్డగోలుగా నిధులు వేచించి రాష్ట్రాన్ని అప్పలపాలు చేసిందని గుర్తు చేశారుకార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారిచేవెళ్ల ఎమ్మెల్యే కాలేయాదయ్య, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, డిసిసి అధ్యక్షులు దారా సింగ్, తాండూర్ మున్సిపల్ చైర్మన్ నీరజ బాలిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బొట్టు నర్సింలు, కాంగ్రెస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ అనిల్ తుపాకుల, మండల పార్టీ అధ్యక్షులు నాగప్ప, కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షులు వివిధ గ్రామాల సర్పంచులు కౌన్సిలర్లు పాల్గొన్నారు



# అంతర్రాష్ట్ర వాహన దొంగల ముఠా బస్టర్

- సంగారెడ్డి పోలీసుల కీలక ఆపరేషన్

సంగారెడ్డి ,వుదయం జిల్లా ప్రతినిధి :

సంగారెడ్డి జిల్లా పోలీసులు మరోసారి తమ చాకచక్యాన్ని చాటుతూ అంతర్రాష్ట్ర వాహన దొంగల ముఠాను చేదించారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా ఇద్దరు ప్రధాన నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి ఆయుధాలు, నగదు, వాహనం సహా కీలక సాక్ష్యాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాలను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ మీడియాకు వెల్లడించారు.జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఎస్పీ మాట్లాడుతూ, నారాయణఖేడ్ పరిధిలోని మనూర్ ఎక్స్ రోడ్ వద్ద ఏప్రిల్ 9, 2026న డీసీఎం వాహనం దొంగతనం జరిగినట్లు వివరించారు. నాగల్‌గిద్ద గ్రామానికి చెందిన మాలిపాటిల్ దత్తు ఫిర్యాదు మేరకు నారాయణఖేడ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పడి సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాల ఆధారంగా అనుమానితులను గుర్తించాయి. మే 3న నారాయణఖేడ్ పట్టణంలోని పంచగామ కమాన్ వద్ద వాహన తనిఖీల సమయంలో ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించగా, వారు మహమ్మద్ ఖుర్షీద్ అహ్మద్ (53), మహమ్మద్ జాఫర్ అలీ (55)గా గుర్తించారు.వారి వద్ద నుంచి ఒక పిస్టల్ (2 రౌండ్స్), ఎయిర్ గన్, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ఈ ఇద్దరూ పెద్ద గ్యాంగ్‌కు చెందినవారని, నదీమ్ ఖాన్, షేక్ ఐజాజ్, సయ్యద్ సయీద్, షేక్ నిజాం తదితరులతో కలిసి తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల్లో వాహన దొంగతనాలు చేస్తున్నట్లు ఒప్పుకున్నారు.

**గ్యాంగ్ ఆపరేషన్ విధానం ఇలా...**

ఒక రాష్ట్రంలో వాహనాలను దొంగిలించి, మరొక రాష్ట్రంలో విక్రయించడం ద్వారా పోలీసులను తప్పుదోవ పట్టించడం ఈ ముఠా ప్రత్యేకతగా వెల్లడైంది. మొత్తం 11 కేసుల్లో (తెలంగాణలో 5, కర్ణాటకలో 1, మహారాష్ట్రలో 5) తమ ప్రమేయం ఉన్నట్లు నిందితులు అంగీకరించారు.



అరెస్టులు & పరారీలో ఉన్నవారు

పోలీసులు మహమ్మద్ ఖుర్షీద్ అహ్మద్, మహమ్మద్ జాఫర్ అలీతో పాటు సయ్యద్ సయీద్, షేక్ నిజాం, మహమ్మద్ సలీం, మహమ్మద్ ఇర్షాద్ అహ్మద్‌లను అరెస్ట్ చేశారు. నదీమ్ ఖాన్, షేక్ ఐజాజ్, గులాం రబ్బానీ, సలావుద్దీన్, బాబా, మొహ్సిన్ షా, రేహాన్ పరారీలో ఉన్నారు.

స్వాధీనం చేసిన సొత్తు

పిస్టల్ (2 రౌండ్స్)

ఎయిర్ గన్

కత్తులు - 2

నగదు రూ. 2 లక్షలు

సెల్‌ఫోన్లు - 6

టిప్పర్ వాహనం

నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును విజయవంతంగా ఛేదించిన సిసిఎస్ సంగారెడ్డి బృందం, నారాయణఖేడ్ పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

ఈ ప్రెస్‌మీట్‌లో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



## రైతులను వంచించిన రేవంత్ ప్రభుత్వం

- వర్గల్‌లో బిఆర్ఎస్ శ్రేణుల భారీ నిరసన

సిద్దిపేట/వర్గల్ మే 04 (వుదయం ప్రతినిధి):

కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిద్దిపేట జిల్లా వర్గల్ మండల కేంద్రంలోని రైతు వేదిక సాక్షిగా బిఆర్ఎస్ నాయకులు మరియు స్థానిక రైతులు కదం తొక్కారు ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న రైతు వారోత్సవాలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించిన నిరసనకారులు ప్రభుత్వం రైతులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులకు ఇప్పటివరకు రైతుబంధు జమ చేయలేదని సాగునీరు మరియు ఎరువుల సరఫరాలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ జిల్లా యువజన అధ్యక్షుడు దేవగనిక నాగరాజు మరియు స్థానిక సర్పంచ్ జయభారతి మాట్లాడుతూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతుల నడ్డి విరుస్తోందని ధ్వజమెత్తారు.

**డిమాండ్లు మరియు ఆరోపణలు:**

పండించిన వరి ధాన్యంతో పాటు మొక్కజొన్న పొద్దుతిరుగుడు పంటలను తక్షణమే మద్దతు ధరతో కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కొండపోచమ్మ సాగర్ నుండి వర్గల్ పరిధిలోని కుంటలకు కెనాల్ ద్వారా సాగునీటిని విడుదల చేయడంలో జాప్యం జరుగుతోందని దీనివల్ల పంటలు ఎండిపోయి రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తిస్థాయి రుణమాఫీ చేయకుండా రైతు వారోత్సవాల పేరిట సంబరాలు చేసుకోవడం రైతులను అవమానించడమేనని వారు విమర్శించారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో సాగునీరు ఎరువులు సకాలంలో అందించి తెలంగాణను అన్నపూర్ణగా మార్చారని నేడు కాంగ్రెస్ పాలనలో నిరుద్యోగులు వృద్ధులు మహిళలతో పాటు రైతాంగం కూడా వంచనకు గురవుతున్నారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి సర్పంచ్ రాజ్ కుమార్ వేలూరి కిష్ట రెడ్డి రవీందర్ రెడ్డి జూపల్లి స్వామి భరత సింహా రెడ్డి రామచంద్ర రెడ్డి పరశురాములు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా మొండివైఖరి వీడి రైతుల సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని రైతాంగం హెచ్చరించింది.

## ప్రజా వాణి లో వచ్చిన దరఖాస్తుల తక్షణమే పరిష్కారించాలి

- అధికారులకు ఆదేశాలు జారీ చేసిన ఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి

నారాయణఖేడ్, మే 04(వుదయం):

నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ ఉమా హారతి, ఐఏఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా వాణి కార్యక్రమంలో ప్రజల నుండి మొత్తం 24 దరఖాస్తులు స్వీకరించరు స్వీకరించిన దరఖాస్తులను సంబంధించిన అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు ఎం పి డి ఓ లు, తహసీల్దార్లు , ఇరిగేషన్, ఆర్ డబ్ల్యు ఎస్, వ్యవసాయ అధికారులు, ఆరోగ్య & వైద్య, విద్య, సివిల్ సప్లైస్, సోషల్ వెల్ఫేర్ తదితర శాఖల అధికారులు పాల్గొని, ప్రజల నుండి స్వీకరించబడిన వినతులను పరిశీలించారు.

సంబంధిత శాఖల అధికారులు స్వీకరించిన వినతులపై తక్షణ చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ ఉమా హారతి ఆదేశించారు.ఈకార్యక్రమంలో అధికారులు అనధికారులు తదితరులు పాల్గొన్నారు.






## ప్రజావాణిలో మార్పులు

- కుర్చీలతో ప్రజలకు ఉపశమనం

సంగారెడ్డి, వుదయం:

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రజావాణి కార్యక్రమంలో పలు కీలక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజావాణికి వచ్చే వారికి ప్రత్యేకంగా కుర్చీలు ఏర్పాటు చేయించడం ముఖ్యంగా నిలిచింది.ఇప్పటి వరకు ఫిర్యాదులు ఇవ్వడానికి వచ్చిన ప్రజలు గంటల తరబడి నిలబడి ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యేవారు. ఈ సమస్యను గుర్తించిన కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకుని కుర్చీలు ఏర్పాటు చేయించారు.ఈ మార్పుతో ప్రజలకు గణనీయమైన ఉపశమనం లభించిందని చెప్పాలి. ప్రజావాణికి వచ్చిన వారు ఇప్పుడు సౌకర్యంగా కూర్చొని తమ వంతు కోసం వేచి ఉండగలుగుతున్నారు. కలెక్టర్ తీసుకున్న ఈ నిర్ణయంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ప్రజల సమస్యలను వినేందుకు ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమం మరింత సౌకర్యవంతంగా మారడంతో ప్రజల్లో విశ్వాసం పెరుగుతోంది.



## ఫలితాల వేళ.. భారీ లాభాల్లో స్టాక్ మార్కెట్లు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారాన్ని భారీ లాభాలతో ప్రారంభించాయి. నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతానికి జరిగిన శాసనసభ ఎన్నికల ఫలితాలు సోమవారం వెల్లడయ్యాయి. ఇందులో అస్సాం, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరీలో భాజపా జోరు చూపిస్తుండటం సూచీలపై సానుకూల ప్రభావం చూపిస్తోంది. దీనికితోడు అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను బలపర్చింది. సూచీలు ఉత్సాహంగా కదలాడుతున్నాయి. సెన్సెక్స్ 900పాయింట్లు పెరగ్గా.. నిఫ్టీ 24,200మార్క్ దాటి ట్రేడ్ అయ్యాయి.




# సన్‌టీవీ షేర్లు 10% పతనం

తమిళనాడు ఎన్నికల ఫలితాల్లో సినీ నటుడు విజయ్ టీవీకే పార్టీ అనూహ్యంగా దూసుకురావడం, అధికార డీఎంకే ఘోర వైఫల్యం నేపథ్యంలో సన్‌టీవీ నెట్‌వర్క్ షేర్లు పతనమయ్యాయి. ఓ దశలో సన్‌టీవీ షేరు విలువ బీఎస్ఈలో 9.5 శాతం మేర పతనమై రూ.547.55 వద్ద కనిష్ఠాన్ని తాకింది. మధ్యాహ్నం 12.45 గంటల సమయానికి 6.43 శాతం నష్టంతో రూ.566.40 వద్ద కొనసాగుతోంది. తమిళనాడులో గత కొన్ని దశాబ్దాలుగా అధికార పీఠం డీఎంకే, అన్నాడీఎంకే మధ్య చేతులు మారుతూ వస్తోంది. కానీ, ఈసారి ఎన్నికల్లో మాత్రం విజయ్ పార్టీ అనూహ్యంగా తెర పైకి వచ్చింది. 100కు పైగా స్థానాల్లో ఆ పార్టీ దూసుకెళుతోంది. అన్నాడీఎంకే రెండో స్థానంలో ఉండగా.. డీఎంకే ఏకంగా మూడో స్థానానికి పరిమితమైంది. దీంతో సన్‌టీవీ షేర్లు క్షీణించాయి. సన్‌టీవీ యజమాని అయిన కళానిధి మారన్ స్టాలిన్‌కు దగ్గరి బంధువు కావడం గమనార్హం.



మరోవైపు దేశీయ స్టాక్ మార్కెట్ సూచీల ఆరంభ లాభాలు ఆవిరయ్యాయి. ఉదయం భారీ లాభాల్లో ప్రారంభమై ఓ దశలో దాదాపు వెయ్యి పాయింట్లు లాభపడిన సెన్సెక్స్.. దాదాపు 700 పాయింట్లు కోల్పోయింది. మధ్యాహ్నం 12.50 గంటలకు 319 పాయింట్ల లాభంతో 77,232 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 96 పాయింట్ల లాభంతో 24,094 వద్ద కొనసాగుతోంది. సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, హిందుస్థాన్ యునిలివర్, ఎల్అండ్‌టీ, రిలయన్స్, బజాజ్ ఫైనాన్స్ స్టాక్స్ లాభాల్లో కొనసాగుతుండగా.. కోటక్ మహీంద్రా బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ట్రెంట్, టీసీఎస్, ఐటీసీ స్టాక్స్ నష్టాల్లో కొనసాగుతున్నాయి.

# జూన్‌లో ముడి చమురు ఉత్పత్తి పెంపు



ఒపెక్+ దేశాలు ముడి చమురు ఉత్పత్తి పెంపునకు ప్రణాళికలు రూపొందించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే అమెరికా–ఇరాన్ యుద్ధ పరిణామాల్లో, గల్ఫ్ చమురు సరఫరాలకు అంతరాయం కలుగుతున్నంత కాలం.. ఈ పెంపు కాగితాలకే పరిమితమవుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. 7 ఒపెక్+ దేశాలు జూన్‌లో చమురు ఉత్పత్తి లక్ష్యాన్ని రోజుకు సుమారు 1,88,000 బ్యారెళ్ల మేర పెంచడానికి సూత్రప్రాయంగా అంగీకరించినట్లు సమాచారం. ఉత్పత్తి పెంపునకు ఒపెక్+ దేశాలు అంగీకరించడం ఇది వరుసగా మూడో నెల. యుద్ధం ఆగాక, చమురు సరఫరా పెంచడానికి ఈ దేశాలు సిద్ధంగా ఉన్నాయని ఈ చర్య సూచిస్తోంది. గత వారం కూటమి నుంచి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) వైదొలగినప్పటికీ.. ఉత్పత్తి లక్ష్యాలను పెంచే ప్రణాళికలతో ఒపెక్+ ముందుకు సాగుతోంది. సౌదీ అరేబియా, ఇరాక్, కువైట్, అల్జీరియా, కజకస్థాన్, రష్యా, ఒమన్ దేశాలు ఆదివారం సమావేశమయ్యాయి. యూఏఈ వైదొలగడంతో, ఇరాన్‌తో పాటు ఒపెక్+లో ప్రస్తుతం 21 సభ్య దేశాలున్నాయి. ఇటీవల కొన్నేళ్లుగా చూస్తే 7 దేశాలు, యూఏఈ మాత్రమే నెలవారీ ఉత్పత్తి నిర్ణయాల్లో పాలుపంచుకుంటున్నాయి. ఫిబ్రవరి28న ప్రారంభమైన ఇరాన్ యుద్ధం, దాని ఫలితంగా హర్మూజ్ జల సంధి మూసివేత కారణంగా ఒపెక్+ సభ్య దేశాలైన సౌదీ అరేబియా, ఇరాక్, కువైట్‌లతో పాటు యూఏఈ నుంచి చమురు ఎగుమతులు కుంటుపడ్డాయి. ఈ కూటమిలో ఉత్పత్తిని పెంచగలిగిన దేశాలు ఇవే. హర్మూజ్ జల సంధిలో నౌకా రవాణా ప్రారంభమయ్యే వరకు, చమురు ఉత్పత్తి పెంపు ప్రభావం చాలా వరకు నామమాత్రంగానే ఉంటుందని, ఆ తర్వాత కూడా సాధారణ స్థితికి రావడానికి కొన్ని వారాలు పడుతుందని అంచనా. చమురు సరఫరాల్లో అంతరాయం కారణంగా 1–2 నెలల్లో విమాన ఇంధన కొరత ఎదురవ్వొచ్చని, ప్రపంచ ద్రవ్యోల్బణం అధికమవుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. గత వారం చమురు బ్యారెల్ ధర, నాలుగేళ్ల గరిష్ఠమైన 125 డాలర్లకు చేరిన సంగతి విదితమే. అన్ని ఒపెక్+ సభ్య దేశాల ముడి చమురు ఉత్పత్తి.. మార్చిలో సగటున రోజుకు 35.06 మిలియన్ బ్యారెళ్లుగా ఉంది. ఫిబ్రవరితో పోలిస్తే ఇది రోజుకు 7.7 మి.బ్యారెళ్లు తక్కువ అని ఒపెక్ గత నెలలో తెలిపింది.

## మారుతీకి దేశీయ విపణిలో 42% వాటా



కార్ల తయారీలో దేశీయ అగ్రగామి సంస్థ మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ), గత ఆర్థిక సంవత్సరం (2025–26)లో మన విపణిలో 42% వాటా సాధించింది. 2024–25 కార్ల విపణిలో సంస్థ వాటా 39 శాతమే. నూతన ఆర్థిక సంవత్సరం (2026–27)ప్రారంభ నెల (ఏప్రిల్)లో రికార్డు స్థాయిలో దేశీయంగా 1,91,122 కార్లను సంస్థ టోకుగా విక్రయించి.. మార్కెట్ వాటాను మరో 3% పెంచుకుంది. ఎంఎస్ఐ మార్కెటింగ్, సేల్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి పార్థో బెనర్జీ మాట్లాడుతూ, కంపెనీ మార్కెట్ వాటా పెరుగుదలకు కార్లు ప్రధాన కారణమైనప్పటికీ, స్పోర్ట్స్ వినియోగ వాహనాలు (ఎస్‌యూవీ) గణనీయ తోడ్పాటు అందించాయని తెలిపారు. ఇప్పటివరకు 2025 డిసెంబరులో విక్రయించిన 1,82,165 కార్లు రికార్డుగా ఉండగా, గత నెల విక్రయాలు తాజా రికార్డుగా నిలిచాయి. 2025 ఏప్రిల్‌తో పోలిస్తే, గత నెలలో ప్రయాణికుల కార్ల విక్రయాలు 68,244 నుంచి 96,725కు చేరాయి. ఎస్‌యూవీల విక్రయాలు 141.6% వృద్ధితో 55,066కు చేరాయి. చిన్న కార్లలో ఆల్టో, ఎస్–ప్రెసో, సెలెరియో, వ్యాగన్‌ఆర్‌ల విక్రయాలు 74.4% పెరిగాయి. కార్ల తయారీ సంస్థలు కొత్త ఆర్థిక సంవత్సరాన్ని బలంగా ప్రారంభించాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో మారుతీ సుజుకీ తయారు చేస్తున్న సెడాన్ కారు డిజైర్, ఎస్‌యూవీల్లో టాటా పంచ్.. అత్యధికంగా విక్రయమైన మోడళ్లుగా నిలిచాయని పరిశ్రమ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. డిజైర్ కార్లు ఏప్రిల్‌లో 23,580, గత ఆర్థిక సంవత్సరం 2,29,130 విక్రయమయ్యాయి. పంచ్ ఎస్‌యూవీలు గతనెలలో 19,107, 2025–26లో 1,83,980 అమ్ముడైనట్లు సమాచారం.

# డీమార్ట్ లాభం రూ.656 కోట్లు




డీమార్ట్ పేరిట విక్రయశాలలను నిర్వహిస్తున్న అవెన్యూ సూపర్‌మార్ట్స్ లిమిటెడ్, గత ఆర్థిక సంవత్సరం (2025–26) జనవరి–మార్చిలో రూ.656.42 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2024–25 ఇదే కాల లాభం రూ.550.79 కోట్లతో పోలిస్తే ఇది 19.17% అధికం. కార్యకలాపాల ఆదాయం రూ.14,871.86 కోట్ల నుంచి 18.9% పెరిగి రూ.17,683.86 కోట్లకు చేరింది. మొత్తం వ్యయాలు 18.5% శాతం పెరిగి రూ.16,797.86 కోట్లకు చేరాయి. ఇతర ఆదాయంతో కలిపి కంపెనీ మొత్తం ఆదాయం 18.83% పెరిగి రూ.17,702.03 కోట్లకు చేరింది. 2025–26 పూర్తి ఆర్థిక సంవత్సరానికి అవెన్యూ సూపర్ మార్ట్స్ నికర లాభం 9.7% పెరిగి రూ.2,969.86 కోట్లకు, మొత్తం ఏకీకృత ఆదాయం 15.8% పెరిగి రూ.68,894.84 కోట్లకు చేరింది.

# ఐటీ వ్యయాలు పెంచుదాం..ప్రభుత్వ రంగ బ్యాంకులు

ప్రభుత్వ రంగ బ్యాంకులు తమ ఐటీ వ్యవస్థలను పటిష్ఠం చేయడానికి, ఖాతాదారుల డేటాను కాపాడేందుకు ఐటీ వ్యయాల పెంపునకు సిద్ధమవుతున్నాయి. ఆంథ్రోపిక్ సంస్థకు చెందిన క్లాడ్ మిథోస్ ఏఐ టూల్ వల్ల ఆర్థిక డేటా భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందన్న ఆందోళనలే ఇందుకు నేపథ్యం. ఐటీ వ్యవస్థల సైబర్ సెక్యూరిటీ బలహీనతలను గుర్తించి, బయటపెట్టడంలో మిథోస్ అధునాతన సామర్థ్యాలు బలంగా ఉన్నందున.. బ్యాంకింగ్ వ్యవస్థలకు ముప్పు ఏర్పడుతుందనే ఆందోళనలు పెరుగుతున్నాయి. సాఫ్ట్‌వేర్ లోపాలు బయటపడిన తర్వాత, వాటిని ఆయుధంగా మార్చుకునే సమయం గతంలో 19 రోజులుగా ఉండగా, ప్రస్తుతం అది 72 గంటల కంటే తక్కువకు పడిపోయింది. ఈ నేపథ్యంలోనే బ్యాంకులు అప్రమత్తమయ్యాయి. సైబర్ దాడులను నిరోధించేందుకు ఐటీ వ్యవస్థలను మరింత పటిష్ఠం చేయడానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఐటీపై ఖర్చు పెంచనున్నట్లు పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ ఎండీ, సీఈఓ స్వరూప్ కుమార్ సాహా తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం కంటే ఈ సారి ఐటీ వ్యయాలు ఎక్కువగా ఉంటాయని, అందులో ప్రధాన భాగం సైబర్ భద్రతకే కేటాయిస్తామని యూకో బ్యాంక్ ఎండీ, సీఈఓ అశ్వనీ కుమార్ స్పష్టం చేశారు. ప్రభుత్వ చర్యలు ఇలా: మిథోస్ వల్ల కలిగే ముప్పు అంచనా వేయడానికి, నివారణ చర్యలను సూచించడానికి ఎస్‌బీఐ ఛైర్మన్ సి.శ్రీనివాసులు శెట్టి నేతృత్వంలో ఒక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఐటీ వ్యవస్థలను సురక్షితం చేసుకోవడానికి అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. ఏప్రిల్ 7న క్లాడ్ మిథోస్ పైలట్ సేవల ప్రారంభం.. హ్యాకింగ్ సామర్థ్యాలపై ఆందోళనను రేకెత్తించింది. ఈ మోడల్ సైబర్ భద్రత, హ్యాకింగ్‌ల్లో మనుషుల కంటే నైపుణ్యాన్ని చూపించిందని ఆంథ్రోపిక్ పేర్కొంది. ప్రతి ప్రధాన ఆపరేటింగ్ సిస్టమ్, వెబ్ బ్రౌజర్‌ల్లో భద్రతా లోపాలను గుర్తించిందని తెలిపింది.







## లక్ష్మి మిత్తల్ చేతికి రాజస్థాన్ రాయల్స్

రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం మారబోతోంది. ఉక్కు దిగ్గజం లక్ష్మి మిత్తల్.. రాయల్స్‌ను కొనుగోలు చేశాడు. తన కొడుకు ఆదిత్య మిత్తల్, సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సీఈఓ అదర్ పూనావాలాతో కలిసి లక్ష్మి మిత్తల్ రూ.15,660 కోట్లకు రాయల్స్‌ను సొంతం చేసుకోనున్నాడు. పార్ల్ రాయల్స్, బార్బడోస్ రాయల్స్ కూడా ఈ ఒప్పందంలో భాగంగా కొత్త యజమానుల చేతికి వెళ్తాయి. ఈ అమ్మకాన్ని బీసీసీఐ ధ్రువీకరించాల్సివుంది. ఇకపై రాయల్స్‌లో మిత్తల్ కుటుంబానికి 75 శాతం, పూనావాలాకు 18 శాతం వాటా ఉంటుంది. మిగతా ఏడు శాతం వాటాను ప్రస్తుత యజమానులు అట్టిపెట్టుకున్నారు. నిజానికి కల్ సోమాని నేతృత్వంలోని కన్సార్షియం.. రాజస్థాన్ రాయల్స్ కోసం మార్చిలో విజయవంతంగా బిడ్ వేసింది. కానీ ఆ తర్వాత వివిధ కారణాల వల్ల వెనక్కి తగ్గింది. ఒప్పందం కుదరలేదు.

# ఆ ఆరుగురిలో నేనూ ఉన్నా...


వినేశ్ ఫొగాట్

భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ తమపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడంటూ ఫిర్యాదు చేసిన ఆరుగురు మహిళల్లో తాను కూడా ఉన్నానని రెజ్లర్ వినేశ్ ఫొగాట్ వెల్లడించింది. ఈ నెల 10న మొదలయ్యే జాతీయ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నీలో పాల్గొనడంలో తన అసౌకర్యం గురించి చెప్పింది. ఈ టోర్నీ ఉత్తర్ ప్రదేశ్‌లోని గొండాలో జరగనుంది. గొండా.. బ్రిజ్‌భూషణ్ సొంత ఊరు. ''అతడిపై ఫిర్యాదు చేసిన ఆరుగురిలో నేను ఒకదాన్ని. కేసు ఇంకా కోర్టులో ఉంది. అతడికి పట్టున్న ప్రాంతంలో పోటీపడడం నన్ను మానసిక ఒత్తిడి గురి చేస్తుంది. అక్కడి వ్యక్తుల్లో చాలా మంది అతడికి సన్నిహితులే అయ్యుండొచ్చు. అలాంటి పరిస్థితుల్లో నేను సరైన ప్రదర్శన చేయగలనని అనుకోవట్లేదు'' అని సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఓ వీడియోలో వినేశ్ పేర్కొంది. పోటీల సందర్భంగా తనకు లేదా తన జట్టు సభ్యులకు ఏం జరిగినా భారత ప్రభుత్వానిదే బాధ్యత అవుతుందని ఆమె హెచ్చరించింది. పారిస్ ఒలింపిక్స్ అనంతరం ఆటకు గుడ్‌బై చెప్పిన వినేశ్.. పునరాగమనం చేస్తున్నట్లు ఇటీవలే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆమె 57 కిలోల విభాగంలో పోటీపడనుంది. అయితే 1400పైగా క్రీడాకారులు జాతీయ టోర్నీలో ఆడుతున్నారని.. ఇప్పటికిప్పుడు వేదికను మార్చడం సాధ్యం కాదని డబ్ల్యూఎఫ్ఐ అధికారులు స్పష్టం చేశారు.

# ఐపీఎల్‌లో 'గర్ల్‌ఫ్రెండ్' కల్చర్పై బీసీసీఐ ఫోకస్!




ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌లో కొందరు ఆటగాళ్లు తమ గర్ల్ ఫ్రెండ్స్‌తో చక్కర్లు కొడుతోన్న వీడియోలు వైరల్‌గా మారాయి. దీనిపై బీసీసీఐ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు వార్తలు వస్తున్నాయి. హార్దిక్ పాండ్య, యశస్వి జైస్వాల్, ఇషాన్ కిషన్, అర్ష్‌దీప్ సింగ్.. లాంటి ఆటగాళ్లు తమ స్నేహితురాళ్లతో ఐపీఎల్ మ్యాచుల సమయంలోనూ ప్రయాణిస్తుండటంపై బీసీసీఐ చర్యలు తీసుకొనేందుకు సిద్ధమైంది. కొంతమంది ఆటగాళ్ల భాగస్వాములు 'ఇన్‌ఫ్లుయెన్సర్' హోదా కలిగిఉన్నారు. వీరిలో కొందరు గతంలో తమ సోషల్ మీడియా ఖాతా ద్వారా బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసినట్లు పలు రిపోర్ట్స్ చెబుతున్నాయి. అదే సమయంలో కొందరికి తమ పార్టనర్స్‌తో విభేదాలు తలెత్తాయి. పోలీసులకు ఫిర్యాదులు చేయడం వరకూ వెళ్లడంతో ఐపీఎల్‌తోపాటు బీసీసీఐ ప్రతిష్ఠకు ఇబ్బంది ఎదురైందని క్రికెట్ వర్గాలు అభిప్రాయపడ్డాయి. ''ఇప్పుడు ఈ సంస్కృతికి అడ్డుకట్ట వేయకపోతే.. మున్ముందు ఇది మరింత ప్రమాదకరంగా మారే అవకాశం లేకపోలేదు. జట్టు బస్సులో క్రీడాకారులు తమ ప్రేయసిల కోసం వేచి ఉండే సందర్భాలనూ మేం గమనించాం. క్రికెటర్లతోపాటు ఒకే హోటల్‌లో బస చేస్తున్నారు. ప్లేయర్లు అధికారికంగా తమ భాగస్వాములను ప్రకటించడంతో కొందరు యాంటీ కరప్షన్ యూనిట్ అధికారులు అనుమతి ఇస్తున్నట్లు తమకు సమాచారం వచ్చింది. అయితే, ఇలాంటి 'అఫీషియల్ గర్ల్‌ఫ్రెండ్' రూల్ ఎక్కడ నుంచి వచ్చిందో అర్థంకావడం లేదు. బీసీసీఐ పాలసీలో ఇలాంటి వాటికి చోటు లేదు. కొన్ని పరిమితుల మధ్య కేవలం భార్య, కుటుంబసభ్యులను మాత్రమే అనుమతిస్తున్నాం. గర్ల్‌ఫ్రెండ్స్ వ్యవహారంపై విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది'' అని సదరు బీసీసీఐ అధికారిక ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు.

# కీలక సమయంలో ఆర్సీబీకి షాక్!




రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు కీలక సమయంలో షాక్ తగిలింది. ఆ జట్టు ఓపెనర్ ఫిల్ సాల్ట్ ఇంగ్లాండ్ వెళ్లాడు. తన వేలికి గాయం కావడంతో గత మూడు మ్యాచుల్లో బెంచ్‌కే పరిమితమయ్యాడు. గాయానికి సంబంధించి టెస్టు కోసం సాల్ట్ యూకే వెళ్లాడు. స్కానింగ్ తీసిన అనంతరం పరిస్థితిని బట్టి ఆర్సీబీ జట్టుతో చేరతాడు. శస్త్రచికిత్స అవసరమైతే మాత్రం ఈ లీగ్ నుంచి వైదొలిగినట్లే. దిల్లీతో మ్యాచ్ సమయంలో సాల్ట్ వేలికి గాయమైంది. బంతిని ఆపేందుకు ప్రయత్నించే క్రమంలో ప్రమాదం జరిగింది. ఆ తర్వాత అతడు మైదానంలోకి దిగలేదు. ఓపెనర్‌గా దూకుడైన ఆటతీరుతో ఫిల్ సాల్ట్ పరుగులు రాబడతాడు. ఆరు మ్యాచుల్లో 202 పరుగులు చేసిన అతడు.. విరాట్ కోహ్లీతో కలిసి ఆర్సీబీకి శుభారంభాలను అందించాడు. ఇప్పుడు ప్లేఆఫ్స్ బెర్తుల కోసం పోటీ తీవ్రతరమైన సమయంలో సాల్ట్ లేకపోవడం బెంగళూరుకు దెబ్బేనని క్రికెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అతడి స్థానంలో ఇప్పటికే ఓపెనర్‌గా బెతెల్ వచ్చినా పెద్దగా ప్రభావం చూపించడం లేదు. గత మూడు మ్యాచుల్లో బెతెల్ కేవలం 39 పరుగులు మాత్రమే చేశాడు. మరి ఈ విషయంలో ఆర్సీబీ మేనేజ్‌మెంట్ ఏం చేస్తుందో చూడాలి.

# అదరగొట్టేస్తోన్న యంగ్ 'ప్లేయర్స్'!

ఎదురెదురుగా అంతర్జాతీయ ఆటగాడు – ఓ కుర్రాడు.. సాధారణంగా వీరిద్దరిలో ఎవరిది పైచేయి అవుతుందని అనుకుంటాం.. ఎంతో అనుభవం కలిగిన సదరు ఇంటర్నేషనల్ ప్లేయర్‌దే కదా.. కానీ, ఐపీఎల్ 2026 సీజన్‌లో కుర్రాళ్ల దెబ్బకు హేమాహేమీలే చిత్తైపోయారు. పేరుకే 'అన్‌క్యాప్‌డ్'.. ఒక్కసారి బరిలోకి దిగితే ప్రత్యర్థి ఫేడ్అవుట్. ఇదీ ప్రస్తుతం యువ క్రికెటర్ల ప్రదర్శన చూశాక ప్రతిఒక్కరి నోటా వినిపించే మాట. వైభవ్ సూర్యవంశీ: ఈ పేరు కొత్తేం కాదు. గత సీజన్ నుంచి సంచలన ప్రదర్శనతో అదరహో అనిపిస్తున్నాడు. ప్రస్తుత ఎడిషన్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు ఆడుతూ ఇప్పటికే 404 పరుగులు చేసిన వైభవ్.. టాప్ క్లాస్ బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించాడు.

ప్రియాంశ్ ఆర్య: అంతా వైభవ్, అభిషేక్ ఓపెనింగ్ గురించే ప్రస్తావిస్తారు కానీ.. వారిద్దరికి ఏమాత్రం తగ్గని ఆటగాడు ప్రియాంశ్ ఆర్య. పంజాబ్ కింగ్స్ విజయాల్లో అతడిదే కీలక పాత్ర. ఎనిమిది మ్యాచుల్లో 285 పరుగులు చేసిన ప్రియాంశ్ ఆర్య స్ట్రైక్‌రేట్ 247.82. ప్రస్తుతానికి ఇతడిదే అత్యధికం.



ప్రభ్ సిమ్రన్ సింగ్: దిల్లీ క్యాపిటల్స్‌పై భారీ టార్గెట్ (265)ను పంజాబ్ కింగ్స్ ఛేదించిందంటే.. ప్రభ్‌సిమ్రన్ దూకుడే కారణం. మైదానం నలువైపులా షాట్లు కొట్టే ప్రభ్ 8 ఇన్నింగ్స్‌ల్లో 361 పరుగులు చేశాడు. రఘువంశీ: కోల్‌కతా తరఫున ఈ సీజన్‌లో నిలకడగా ఆడుతోన్న ఒకేఒక్క ప్లేయర్ అంగ్‌క్రిష్ రఘువంశీ. వన్‌డౌన్ లేదా సెకండ్ డౌన్‌లో వస్తూ కేకేఆర్ ఇన్నింగ్స్‌ను నిలబెడుతోన్న రఘువంశీ ఇప్పటి వరకు 268 పరుగులు చేశాడు.

# ధోని లాంటి వికెట్‌కీపర్‌ను చూడలేదు



మహేంద్రసింగ్ ధోని లాంటి మరో వికెట్ కీపర్‌ను తన కెరీర్‌లో చూడలేదని మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అభిప్రాయపడ్డాడు. 2011 ఐపీఎల్ ఫైనల్లో క్రిస్ గేల్‌ను డకౌట్ చేసిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ అతడు మహిపై ప్రశంసలు కురిపించాడు. ''ధోని అద్భుతమైన ఫినిషర్. అలాగే కెప్టెన్సీ గురించి అందరూ ఎంతో చర్చించుకుంటారు. కానీ తనలా వికెట్ కీపింగ్ చేసే వారిని నా కెరీర్‌లో చూడలేదు. వికెట్ల వెనుక అతడి పనితనం, స్పష్టమైన ఆలోచన విధా నం వల్లే కెప్టెన్‌గా కంటే కీపర్‌గా ధోనికి ప్రశంసలు వచ్చాయి. 2011 ఐపీఎల్ ఫైనల్లో అతను పట్టిన క్యాచ్ వల్లే గేల్‌ను డకౌట్ చేయగలిగాను. రాజస్థాన్ రాయల్స్ తరఫున మూడు సీజన్లు ఆడినప్పటికీ.. టైటిల్ గెలవకపోవడం నన్ను బాధిస్తుంటుం ది. 2018లో పంజాబ్ కింగ్స్‌కు ఆడేటప్పుడు బట్లర్ రనౌట్ (మన్కడింగ్)పై నేనేమీ పశ్చాత్తాపపడట్లేదు. ఒకవేళ ఆ నియమం క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా ఉంటే.. ఐసీసీ దాన్ని తొలగించేది కదా. మ్యాచ్ గెలవడం కోసమే అలా చేశాను. అందులో సిగ్గుపడాల్సిందేముంది'' అని అశ్విన్ చెప్పాడు.

# వుదయం సినిమా

MOVIE TIME!



## ఆరంభం ముగింపు
# అక్కడే!

**వుదయం సినిమా :** ''వారణాసి' చిత్రకథ వారణాసి ఘాట్‌లలో ఆరంభమై, అక్కడే ముగుస్తుంది'' అని పేర్కొన్నారు ఎస్ఎస్ కార్తికేయ. మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో పాన్ వరల్డ్ స్థాయిలో రూపొందుతున్న చిత్రం 'వారణాసి'. కేఎల్ నారాయణ, కార్తికేయ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవల మెక్సికోలో జరిగిన 'కామిక్ కాన్ ఎక్స్ పీరియన్స్'లో ఈ చిత్రం వీడియో గ్లింప్స్ ని ప్రదర్శించారు. ఆ ఈవెంట్ లో కార్తికేయ మాట్లాడుతూ... ఈ సినిమా వారణాసి ఘాట్స్ లో ఆరంభమై, అక్కడే ముగుస్తుందని పేర్కొన్నారు. ఇంకా దాదాపు 20 నిమిషాల పాటు సాగే రామాయణం ఎపిసోడ్ అద్భుతంగా ఉంటుందని తెలిపారు కార్తికేయ. ఒక కొత్త కోణంలో రాజమౌళి చిత్రీకరించిన ఈ ఎపిసోడ్ మొత్తం ఇప్పటివరకూ భారతీయ తెరపై చూడని విధంగా ఉంటుందని, విజువల్‌గా స్టన్నింగ్‌గా ఉంటుందని కూడా పంచుకున్నారు. తెరపై కనిపించే ఈ 20 నిమిషాల ఎపిసోడ్ చిత్రీకరణకు దాదాపు 60 రోజులు పట్టిందట. ప్రస్తుతం ఈ సినిమా షూట్ అంటార్కిటికాలో జరుగుతోంది. 2027 ఏప్రిల్ 7న 'వారణాసి' విడుదల కానుంది.



## పవర్‌ఫుల్ ఫైట్ లో వెంకటేశ్

**వుదయం సినిమా :** వెంకటేశ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఆదర్శ కుటుంబం'. 'హౌస్ నెం: 47 (ఏకే 47)' అనేది ఉపశీర్షిక. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో 'కేజీఎఫ్, హిట్ 3, తెలుసు కదా' చిత్రాల ఫేమ్ శ్రీనిధీ శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్నారు. ఈ సినిమాకి సంబంధించి ఓ హై ఓల్టేజ్ క్లైమాక్స్ యాక్షన్ ఎపిసోడ్‌ని హైదరాబాద్‌లో పూర్తి చేశారట మేకర్స్. ఫైట్ మాస్టర్ కెవిన్ కుమార్ ఆధ్వర్యంలో ఈ పోరాట సన్నివేశం తెరకెక్కించారట. వెంకటేశ్‌పై చిత్రీకరించిన ఈ పవర్‌ఫుల్ ఫైట్ మూవీ క్లైమాక్స్ లో వస్తుందని సమాచారం. కుటుంబ కథా చిత్రంగా రూపొందుతోన్న 'ఆదర్శ కుటుంబం'లో మధ్యతరగతి వ్యక్తి పాత్రలో నటిస్తున్నారు వెంకటేశ్. వినోదం, భావోద్వేగాల కలయికలో రూపొందుతోన్న ఈ సినిమా ఈ ఏడాదే రిలీజ్ కానుంది.



## 15న రాక్షసపురం

**వుదయం సినిమా :** ప్రముఖ నిర్మాణ సంస్థ క్రియేటివ్ కమర్షియల్స్ అధినేత, సీనియర్ నిర్మాత కేఎస్ రామారావు తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్న లేటెస్ట్ మూవీ 'రాక్షసపురం'. కన్నడలో సంచలన విజయం సాధించిన 'రాక్షసపుర' చిత్రానికి ఇది తెలుగు అనువాదం. ఈ చిత్రాన్ని మే 15న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు నిర్మాత కేఎస్ రామారావు అధికారికంగా ప్రకటించారు. విభిన్నమైన నటనతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రాజ్ బి శెట్టి ఈ సినిమాలో పవర్‌ఫుల్ పోలీస్ ఇన్ స్పెక్టర్ పాత్రలో నటించారు. డాక్టర్ రవి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఒక ఉత్కంఠభరితమైన మర్డర్ మిస్టరీ థ్రిల్లర్. ఇన్వెస్టిగేషన్ డ్రామా నేపథ్యంలో సాగే కథనం ప్రేక్షకులను అడుగడుగునా థ్రిల్‌కు గురి చేస్తుంది.

## మారణహోమం 1990s టీజర్ విడుదల

**వుదయం సినిమా :** ఎన్.కె.ఎస్. ఫిలిమ్స్ పతాకంపై సమన్విత ప్రెసెంట్స్ లో బంధు నరేష్ దర్శకత్వంలో బంధు నాగమణి నిర్మిస్తున్న చిత్రం 'మారణహోమం 1990s'. ఈ చిత్ర టీజర్ మరియు ఫస్ట్ లుక్ ప్రముఖ నటుడు శ్రీకాంత్ చేతుల మీదుగా ఘనంగా చేసారు. టీజర్ చూసిన శ్రీకాంత్ చిత్ర యూనిట్‌ను అభినందిస్తూ, సినిమా విజయంపై ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రముఖ హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ.. "మారణహోమం 1990s టీజర్ చాలా అద్భుతంగా ఉంది. దర్శకుడు మంచి స్టైల్ లో, బలమైన కంటెంట్ ఉన్న కథను ఎంచుకున్నారు. మేకింగ్ విజువల్స్ ఎక్స్‌ట్రార్డినరీగా ఉన్నాయి. చిత్ర హీరో హీరోయిన్లు మరియు ఇతర నటీనటులు తమ పాత్రల్లో ఒదిగిపోయారు. తప్పకుండా ఈ సినిమా తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని నమ్ముతున్నాను" అని చిత్ర యూనిట్‌కు ఆల్ ది బెస్ట్ చెప్పారు.





## టార్టాయిస్ పూర్తి

**వుదయం సినిమా :** ఎస్ కె గోల్డెన్ ఆర్ట్స్, ప్రశ్విత ఎంటర్టైన్మెంట్, ఎన్ వి ఎల్ క్రియేషన్స్ మరియు మధుపాల మహా మూవీస్ పతాకం పై రాజ్ తరుణ్, అమృత చౌదరి హీరో హీరోయిన్ గా శ్రీనివాస్ అవసరాల మరియు ధన్య బాలకృష్ణ ముఖ్య పాత్రలో రిత్విక్ కుమార్ దర్శకత్వంలో విజయ్ చౌదరి, శశిధర్ నల్ల, రామిశెట్టి రాంబాబు మరియు మధుపాల సురేష్ గార్లు సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం "టార్టాయిస్". ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీ గా ఉంది. ఈ చిత్రానికి అనూప్ రూబెన్స్ సంగీతం అందించారు.

ఈ సందర్భంగా యూనిట్ సభ్యులు మాట్లాడుతూ "మా "టార్టాయిస్" చిత్రం చాలా కొత్తగా ఉంటుంది. చాలా డిఫరెంట్ కథ. రాజ్ తరుణ్ 25వ చిత్రం గా కెరీర్ లో బెస్ట్ సినిమా అవుతుంది. శ్రీనివాస్ అవసరాల, ధన్య బాలకృష్ణ మరియు హీరోయిన్ అమృత చౌదరి క్యారెక్టర్స్ చాలా బలంగా ఉంటాయి. కొత్త స్క్రీన్ ప్లే తో డిఫరెంట్ కథ తో మంచి థ్రిల్లర్ చిత్రం ఇది. "హీరో కి నిద్రలో నడిచే అలవాటు ఉంది, ఈ క్రమంలో తను ఒక అమ్మాయిని చంపేస్తాడు. తర్వాత ఏమి జరుగుతుంది" అనే కాసెప్ట్ తో ఈ చిత్రానికి చిత్రీకరించాం. షూటింగ్ అంత పూర్తి అయింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకుని త్వరలోనే విడుదల చేస్తాం" అని తెలిపారు.

## విజయ్‌కు శుభాకాంక్షలు
### తెలియజేసిన మెగాస్టార్ చిరంజీవి

**వుదయం సినిమా :** తమిళనాడు ఎన్నికల్లో సత్తా చాటిన టీవీకే పార్టీ అధినేత, కథానాయకుడు విజయ్‌కు మెగాస్టార్ చిరంజీవి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ప్రత్యేక పోస్ట్ పెట్టారు.

**డియర్ విజయ్..**

మీ తొలి ఎన్నికల్లో సాధించిన ఈ అద్భుతమైన విజయానికి హృదయపూర్వక అభినందనలు. మీరు నిరంతరం ప్రేరణగా నిలుస్తూ, నాయకత్వం వహించి సేవ చేయాలని కోరుకుంటున్నాను. తమిళనాడు రాష్ట్ర ప్రజలకు మీ ప్రజా సేవ మరింతగా మేలుకలిగించాలని నా హృదయపూర్వక శుభాకాంక్షలు.





## విశ్వంభర నుంచి త్రిషా బర్త్ డే స్పెషల్ పోస్టర్ రిలీజ్

**వుదయం సినిమా :** మెగాస్టార్ చిరంజీవి మోస్ట్ ఎవైటెడ్ సోషియోఫాంటసీ మూవీ 'విశ్వంభర'. వశిష్ట దర్శకత్వంలో, యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై విక్రమ్, వంశీ, ప్రమోద్‌లు భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పోస్ట్‌ప్రొడక్షన్ పనులు చివరి దశలో ఉన్న ఈ చిత్రం విడుదలకు దగ్గరవుతోంది. చిరంజీవి పుట్టినరోజున విడుదల చేసిన స్పెషల్ గ్లింప్స్‌కు అద్భుతమైన స్పందన లభించడంతో చిత్రంపై అంచనాలు మరింత పెరిగాయి. ఈ చిత్రంలో హీరోయిన్ 'అవని' పాత్ర పోషించిన త్రిషా కృష్ణన్ పుట్టినరోజు సందర్భంగా, చిత్ర బృందం ఒక అద్భుతమైన కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో, లేత రంగు సాంప్రదాయ దుస్తులలో, మృదువైన ఎంబ్రాయిడరీతో ఉన్న త్రిషా, వెలుగుతున్న దీపాల పళ్ళెం పట్టుకుని ఎంతో అద్భుతంగా కనిపిస్తోంది. గోల్డ్ కలర్ బ్యాక్ డ్రాప్ పోస్టర్‌కు పండుగ వాతావరణాన్ని జోడిస్తోంది.

## లక్షకు పైగా రీల్స్ తో ట్రెండ్ అవుతున్న ఏందయ్యా సామీ సాంగ్

**వుదయం సినిమా :** విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ "రణబాలి". ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై "రణబాలి" సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. రీసెంట్‌గా ఈ చిత్రం నుంచి రిలీజ్ చేసిన 'ఏందయ్య సామీ..' పాట అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ సాంగ్ లక్షకు పైగా రీల్స్ తో సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతోంది. "రణబాలి"లో విజయ్, రశ్మిక పెళ్లి వేడుక సందర్భంగా ఈ అందమైన పాట చిత్రీకరించారు. 19వ శతాబ్దంలో పెళ్లి సందడి ఎంత సంప్రదాయంగా ఉండేదో 'ఏందయ్య సామీ..' పాటలో అందంగా రూపొందించారు. "రణబాలి" సెప్టెంబర్ 11న వరల్డ్ వైడ్ గ్రాండ్ రిలీజ్‌కు రాబోతోంది. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య కాలంలో బ్రిటీష్ పాలనా చారిత్రక జరిగిన యదార్థ సంఘటనల ఆధారంగా "రణబాలి" సినిమా రూపొందుతోంది.



## గోదారి గట్టుపైన ఆడియన్స్ ఎంజాయ్ చేస్తారు



**వుదయం సినిమా :** యంగ్ హీరో సుమంత్ ప్రభాస్ రూరల్ లవ్, ఫ్యామిలీ డ్రామా 'గోదారి గట్టు పైన'తో అలరించబోతున్నారు. సుభాష్ చంద్ర దర్శకత్వంలో రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ నిర్మించింది. నిధి ప్రదీప్ ఈ చిత్రంలో కథానాయికగా నటించగా, జగపతి బాబు కీలక పాత్రలో కనిపించనున్నారు. టీజర్, ట్రైలర్ పాటలకు అద్భుతమైన స్పందన వచ్చింది. ఈ చిత్రం మే 8న వరల్డ్‌వైడ్ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్మాత అభినవ్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. నేను 10 ఏళ్లుగా విభిన్నమైన వ్యాపారాల్లో ఉన్నాను. నాకు సినిమా అంటే ప్యాషన్ ఉంది. మంచి స్క్రిప్ట్ కోసం చూస్తున్న సమయంలో సుభాష్ గారు చెప్పిన కథ నాకు చాలా నచ్చింది. నేను యూనివర్సల్‌గా అందరికీ కనెక్ట్ అయ్యే ఎమోషన్స్‌తో కథ చేయాలని అనుకున్నాను. అలాంటి కథ ఈ సినిమాతో కుదిరింది.

ఒక నటుడు ఛాలెంజ్ ఉన్న పాత్ర చేయాలని కోరుకుంటాడు. తెలంగాణలో చేయడం అతనికి ఈజీ. కానీ ఈ పాత్ర కోసం గోదారి యాసను పర్ఫెక్ట్‌గా నేర్చుకుని, ఛాలెంజ్‌గా తీసుకుని చేశాడు. టఫ్‌గా తీసుకున్నప్పుడే యాక్టర్‌గా సంతృప్తి ఉంటుంది. ఈ సినిమాలో చాలా అద్భుతంగా చేశాడు. ఈ సినిమాను అందరూ సమానంగా ఆదరిస్తారు.



## ఘనంగా M4M ప్రీ రిలీజ్ వేడుక




**వుదయం సినిమా :** అమెరికన్ నటి జో శర్మ ప్రధాన పాత్రలో, దర్శకుడు మోహన్ వడ్లపట్ల తెరకెక్కించిన సస్పెన్స్ థ్రిల్లర్ M4M చిత్రం మే 8న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. పివిఆర్ ఐనాక్స్ పిక్చర్ ద్వారా విడుదలవుతున్న ఈ సినిమా తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో ఘనంగా ప్రీ రిలీజ్ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా తెలుగు సినీ దర్శకుల సంఘం (టిఎఫ్ డిఎ) అధ్యక్షుడు వి.ఎన్. ఆదిత్య, సీనియర్ డైరెక్టర్ వి. సముద్ర హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. దర్శకరత్న దాసరి నారాయణరావు జన్మదినాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా దర్శకుల దినోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంలో ఈ వేడుక జరగడం ప్రత్యేకతగా నిలిచింది.

## తప్పుగా అనుకున్నారు

**వుదయం సినిమా :** నటి జాన్వీ కపూర్ తన తాజా ఇంటర్వ్యూలో మద్యం అలవాటు గురించి చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఆమె ఖండించారు. మద్యానికి సంబంధించి తాను చేసిన వ్యాఖ్యలను కొన్ని మీడియా సంస్థలు తప్పుగా చిత్రీకరించడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇటీవల ఒక పాడ్‌కాస్ట్ లో ఆమె మాట్లాడుతూ.. తన జీవితంలో ఎదురైన ఒక బాధాకరమైన సంఘటన తర్వాత మద్యం అలవాటు అయిందని దానినుంచి బయటకు రావడానికి చాలా కష్టపడ్డానని పేర్కొన్నారు. అయితే, దీనిపై వస్తున్న కథనాలు తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని ఆమె టీమ్ పేర్కొంది. మద్యం వ్యసనంపై అవగాహన కల్పించే 'ఆఫ్ ది రాక్స్' 'అమహా' సంస్థలు నిర్వహించిన పాడకాస్ట్‌లో జాన్వీ మాట్లాడారు. ఆ మాటలను తప్పుగా వక్రీకరించారని సదరు సంస్థలు నోట్ విడుదల చేశాయి.

Printed, Published & Owned by SIRIKONDA MARIA, Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-7-25/5, Risalagadda,RTC X Roads, Hyderabad - 500020, Telangana.
Editor : SIRIKONDA AUGUSTIN. RNI No.: TELTEL/2000/00272. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.